www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 254
గురువారం | 12-12-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి రా. 10.27 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అశ్విని ఉ. 9.52 తదుపరి భరణి; వర్జ్యం: తె.ఉ.7.39, రా.6.39-8.07; దుర్ముహూర్తం: ఉ.10.19-11.03, మ.2.42-3.26; అమృతఘడియలు: తె.3.26-4.54; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 5.38
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

త్వరలో విస్తరణ!

వారం పది రోజుల్లో మంత్రివర్గంలో మరికొందరికి అవకాశం

రాహుల్‌గాంధీతో భట్టి విక్రమార్క భేటీ.. మంత్రివర్గ విస్తరణ, కులగణనపై చర్చ

నేడు పార్టీ అధిష్ఠానంతో సీఎం రేవంత్ సమావేశం

ఢిల్లీకి ఆశావహులు.. ముమ్మరంగా ప్రయత్నాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన చర్చలు ఢిల్లీలో మళ్లీ ప్రారంభమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం సాయంత్రం రాహుల్‌గాంధీతో ఇదే అంశంపై మాట్లాడినట్లుగా విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గురువారం మధ్యాహ్నం జైపూర్ నుంచి ఢిల్లీ చేరుకోనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అగ్రనేతలతో చర్చలు జరిపే అవకాశాలు ఉన్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. చర్చలు ఫలప్రదమైతే వారం పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. కాగా, గత కొంత కాలంగా మంత్రివర్గ విస్తరణ పెండింగ్‌లో ఉందని, ఈ విషయంలో నిర్ణయం తీసుకోకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని రాహుల్‌కు భట్టి చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో కులగణన సర్వే బాగా

మిగతా 13వ పేజీలో...



ట్రేడింగ్‌లో రూ.30 లక్షల నష్టం

కుటుంబం ఆత్మహత్య

- షేర్ల కోసం అధిక వడ్డీకి అప్పులు
- అనుభవం లేక భారీ నష్టాలు
- పురుగుల మందు తాగిన కుటుంబం
- భార్య, భర్త, కొడుకు, కుమార్తె మృతి
- మంచిర్యాల జిల్లా తాండూరులో విషాద ఘటన



మంచిర్యాల, తాండూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్లో నష్టాలు ఓ కుటుంబాన్ని బలిగొన్నాయి. ట్రేడింగ్‌లో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తం సంపాదించవచ్చనే ఉద్దేశంతో అప్పుతెచ్చి, పెట్టుబడులు పెడితే.. అనుభవరాహిత్యం కాటేసింది..! రూ.30 లక్షలు ఆవిరైపోయాయి. నెలకు 5-10% వడ్డీకి తెచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లించలేక.. అప్పుల వారి వేధింపులు తాళలేక ఓ

మిగతా 14వ పేజీలో...

డాక్టర్ నిరుద్యోగి!

పెరుగుతున్న ఎంబీబీఎస్‌లు...తగ్గుతున్న ఉపాధి అవకాశాలు

నెలకు రూ.20-30 వేలే.. నర్సులకన్నా తక్కువ జీతం

- గతంలో నోటిఫికేషన్లు ఇస్తే స్పందనే ఉండేది కాదు
- ఇప్పుడు వేలల్లో అర్జీలు.. 30 పోస్టులకు 350పైనే
- తెలంగాణ వచ్చాక 32 వేల మంది కొత్త వైద్యులు
- దేశవ్యాప్తంగా లక్షన్నర మంది నిరుద్యోగ వైద్యులు
- డబ్ల్యూహెచ్‌వో ప్రకారం వెయ్యి మందికి ఒక డాక్టర్
- తెలుగు రాష్ట్రాల్లో ప్రతి 681 మందికి ఒకరు
- మున్ముందు ఇంజనీరింగ్ కాలేజీల్లాగే వైద్యవిద్య
- తెలంగాణలో నాలుగు సంవత్సరాల తర్వాత ఏటా పది వేల మంది కొత్త డాక్టర్లు



ఈ ఏడాది జూలై 12న ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్య పోస్టుల భర్తీకిగాను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. అందులో ఒకే ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ (డెంటల్ సర్జరీ) పోస్టు ఉండగా, దానికి ఏకంగా 134 దరఖాస్తులొచ్చాయి. అదేనెల 2న బోర్డు 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ల (ఎంబీబీఎస్ వైద్యులు) పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. వీటికి ఏకంగా 4,850 దరఖాస్తులొచ్చాయి. తాజాగా హైదరాబాద్‌లోని పలు బస్తీ దవాఖానాల్లో 30 ఎంబీబీఎస్ పోస్టులకు డీఎంహెచ్‌వో కార్యాలయం నోటిఫికేషన్ ఇస్తే.. 350 వరకు దరఖాస్తులొచ్చాయి.

రాష్ట్రంలో ఏటికేడు నిరుద్యోగ డాక్టర్ల (ఎంబీబీఎస్) సంఖ్య పెరుగుతోందని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలు! గతంలో సర్కారు కొలువులంటే వైద్యులు ఏమాత్రం ఆసక్తి చూపేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. నోటిఫికేషన్ ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూసేవారి సంఖ్య భారీగా పెరిగింది. ఒక్క పోస్టుకు వందల సంఖ్యలో దరఖాస్తులొస్తున్నాయి. వైద్యులకు ఉపాధి కరువవుతుండటంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది.



ఒకప్పుడు వైద్యుడంటే పొద్దంతా రోగులను చూసేందుకే సరిపోయేది. కాస్త ఎంగిలి పడేంత తీరిక కూడా ఉండేది కాదు. వైద్యుల పేరుతోనే ఆస్పత్రులు, క్లినిక్‌లు నడిచేవి. ఇప్పుడు వైద్యుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో పోటీ పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం 1,32216 మంది డాక్టర్లున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక మన దగ్గర కొత్తగా 32 వేల మంది వైద్యులు రాష్ట్ర వైద్యమండలిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు ఉండాలి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ గణాంకాల మేరకు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి 681 మందికి ఒక వైద్యుడు ఉన్నారు. పెరుగుతున్న కాలేజీలు, సీట్ల పరంగా చూస్తే రాబోయే రోజుల్లో ఆ సంఖ్య మరింత తగ్గనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిజేసే ఎంబీబీఎస్ వైద్యులకు కేవలం రూ.25-30 వేలే ఇస్తున్నారు. అది కూడా మనదగ్గర ఎంబీబీఎస్ చేసినవారికి. ఇక విదేశాల్లో వైద్యవిద్య చదివిన వారి పరిస్థితి మరీ దారుణం. అంత జీతం కూడా వారికివ్వడం లేదు. ఇక ఎన్ఆర్ఐ, మేనేజ్‌మెంట్ కోటాలో రూ.కోటి పెట్టి చదివించిన తల్లిదండ్రుల

మిగతా 14వ పేజీలో...



భారత్ అమ్ములపొదిలో

వోరోనెజ్ రక్షణ కవచం

- గగనతల రక్షణకు రష్యా సాంకేతికత 2
- 8 వేల కి.మీ దూరంలోనే క్షిపణుల గుర్తింపు
- రూ.34 వేల కోట్ల డీల్
- కర్ణాటకలోని చిత్రదుర్గ వద్ద ఏర్పాటు!

జమిలి ఎన్నికలతో పెరగనున్న జీడీపీ!

- 1-1.5% వృద్ధి.. ఆర్థికవేత్తల అంచనా ఇదీ
- జమిలి ఏ ఒక్క పార్టీ అభిప్రాయమో కాదు
- దేశంలోని ప్రజలందరి కోరిక
- దాంతో దేశంలో సమూల మార్పులు 2
- మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



2

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత పథకం!

నా నిర్లక్ష్యం లేదు!



- ప్రీమియర్ షోకు వస్తున్నట్లు పోలీసులకు, థియేటర్ యాజమాన్యానికి ముందే చెప్పా
- తొక్కిసలాట, మహిళ మృతి ఘటనతో నాకు సంబంధం లేదు: అల్లు అర్జున్ 10
- తనపై కేసు కొట్టేయాలంటూ హైకోర్టులో పిటిషన్

'ఆశా'ల సమస్యల పరిష్కారానికి సిద్ధం

- బీఆర్ఎస్ నేతలు ఆశా వర్కర్లకు మద్దతు పలకడం హాస్యాస్పదం
- వైద్యారోగ్య మంత్రి రాజనర్సింహ
- ఆశాల ఆకస్మిక ఆందోళన వెనుక విపక్షాల పాత్రపై సర్కారు ఆరా!

13

పీఎఫ్ సొమ్ము ఏటీఎం ద్వారా విత్‌డ్రా



» జనవరిలో అందుబాటులోకి... కేంద్రం యోచన

న్యూఢిల్లీ, డిసెంబరు 11: ఉద్యోగ భవిష్యనిధి సొమ్ము ఉపసంహరణ మరింత సులభతరం కానుంది. ఉద్యోగులు తమ పీఎఫ్‌ను ఏటీఎం ద్వారా విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి సుమిత్రా దావ్రా తెలిపారు. 2025 జనవరి నుంచి ఈ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు. చందాదారులకు మెరుగైన సేవలు అందించేందుకుగాను ఐటీ వ్యవస్థలను ఆధునీకీకరిస్తున్నామని, క్లెయిమ్‌ల పరిష్కారం వేగవంతంగా జరిగేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా, పీఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఒక కార్డును జారీ చేయనుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వోలో 7కోట్ల మందికి పైగా చందాదారులున్నారు.

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత పథకం!

న్యూఢిల్లీ, డిసెంబరు 11: గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రత, ఇతర ప్రయోజనాలు కల్పించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఈ-కామర్స్ సేవల రంగంలో వారు సమర్థవంతంగా పనిచేసేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థలో తమ వంతు పాత్ర పోషించేందుకు వారికి సామాజిక భద్రత అవసరమని, దాని కోసం పథకం రూపొందిస్తున్నామని కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా తెలిపారు. బుధవారం ఆమె భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ ఆర్థిక విధాన వేదిక' కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ అంశం ప్రస్తావించారు. కొత్త కార్మిక చట్టం గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు నిర్వచనం ఇవ్వడంతో పాటు వారికి సామాజిక భద్రత కల్పించాలని నిర్దేశించిందని చెప్పారు. కాగా, గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు పెన్షన్, ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అక్టోబరులో ప్రకటించారు. దేశంలో 2020-21 నాటికి ఈ కార్మికులు 77 లక్షల మంది ఉన్నారని నీతి ఆయోగ్ అంచనా వేయగా... 2029-30 కల్లా వారి సంఖ్య 3 కోట్లు దాటుతుందని భావిస్తున్నారు.

'జమిలి'తో పెరగనున్న జీడీపీ!



» 1 నుంచి 1.5% మేర పెరుగుతుంది: కోవింద్

న్యూఢిల్లీ, డిసెంబరు 11: జమిలి ఎన్నికలతో దేశంలో సమూల మార్పులు చోటుచేసుకుంటాయని ఈ ఎన్నికలకు సంబంధించి కేంద్రం నియమించిన కమిటీ చైర్మన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశ జీడీపీ 1 శాతం నుంచి 1.5శాతం మేర పెరుగుతుందన్నారు. ఇది ఆర్థిక నిపుణులు చెబుతున్న విషయమని తెలిపారు. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు కలిపి ఒకేసారి జమిలి ఎన్నికల నిర్వహించాలన్నది ఏ ఒక్క రాజకీయ పార్టీ అభిప్రాయమో కాదని, దేశ ప్రజలందరి కోరిక అని కోవింద్ చెప్పారు. అయితే ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇతర పార్టీల ఆమోదం పొందాలని సూచించారు. జమిలి ఎన్నికల ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఈ ఏడాది సెప్టెంబరులోనే ఆమోదించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం.. లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతోపాటు ఆ తరువాత 100 రోజుల్లో మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

లోకం తీరు



సిరియా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోం

» రెబెల్స్.. ఇరాన్, హిజ్బుల్లాకు మద్దతిస్తే చర్యలు తప్పవు

» ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరిక



టెల్‌అవీవ్, డిసెంబరు 11: సిరియా అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోబోమని ఇజ్రాయెల్ ప్రకటించింది. . కానీ, ప్రస్తుత పాలకులు ఇరాన్‌ను బలపడేలా చేసి, హిజ్బుల్లాకు ఆయుధాలు అందిస్తే మాత్రం తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు బుధవారం ప్రకటన చేశారు. పౌరుల భద్రతే తమ ప్రాధాన్య అంశమన్నారు. సిరియాలోని రసాయనిక ఆయుధాగారాలు, క్షిపణి లాంచర్లు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు జిహాదీల చేతుల్లోకి వెళ్లకుండా చూసేందుకే వాటిని ధ్వంసం చేశామని చెప్పారు. అయితే, ప్రస్తుత పరిస్థితులు సిరియాలో అనిశ్చితికి, ఉగ్ర ముప్పునకు కూడా దారితీయొచ్చని నెతన్యాహు ఆందోళన వ్యక్తంచేశారు. డమాస్కస్‌ను తిరుగుబాటుదారులు ఆక్రమించిన వెంటనే ఇజ్రాయెల్ 'ఆపరేషన్ యారో ఆఫ్ బషన్'ను ప్రారంభించింది. సిరియాలోని వైమానిక, నౌకాదళ స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వందల సంఖ్యలో దాడులు చేస్తోంది. వ్యూహాత్మక ఆయుధ నిల్వల కేంద్రాలపై 350కి పైగా వైమానిక దాడులు జరిపింది. రాజధాని డమాస్కస్‌కు 25 కిలోమీటర్ల దూరం వరకు నెతన్యాహు సేనలు ట్యాంకులను తీసుకెళ్లాయి. మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఓ పునరావాస శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది సహా 29 మంది మృతి చెందారు. మృతుల్లో 8మంది చిన్నారులు ఉన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా-ఇజ్రాయెల్ కుట్రలు పన్ని సిరియాలో బషర్ ప్రభుత్వాన్ని కూల్చేశాయని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆరోపించారు. వీరికి సిరియా పొరుగు దేశం కూడా సాయం చేసిందని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, సిరియా నుంచి 75 మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి రప్పిస్తున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. వీరందరినీ లెబనాన్ తరలించామని, అక్కడి నుంచి భారత్‌కు వస్తారని వివరించింది.

దక్షిణ కొరియా అధ్యక్షుడి ఆఫీసులో సోదాలు

» 'సైనిక పాలన ప్రకటన' కేసులో పోలీసుల దర్యాప్తు

» పోలీసు కస్టడీలో మాజీ రక్షణమంత్రి ఆత్మహత్యాయత్నం

సియోల్, డిసెంబరు 11: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను 'సైనిక పాలన ప్రకటన' కష్టాలు వీడటం లేదు. అభిశంసన తీర్మానం వీగిపోవడంతో పదవీ గండం నుంచి ఆయన తప్పించుకున్నప్పటికీ, సైనిక పాలన విధించడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు క్రిమినల్ కేసును ఆయన ఎదుర్కొంటున్నారు. ఆయనతో పాటు మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, పలువురు సీనియర్ అధికారులపైనా పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఇప్పటి వరకు యూన్‌ను ప్రశ్నించడంగానీ, అరెస్టు కానీ చేయనప్పటికీ బుధవారం ఆయన కార్యాలయంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. మరోవైపు ఈ కేసులో అరెస్టయిన మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్ తాజాగా పోలీసు కస్టడీలో ఆత్మహత్యకు యత్నించారు. ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించామని, ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన తొలి వ్యక్తి ఆయనే. తాత్కాలికంగా సైనిక పాలనను అమలుచేయడంలో హ్యూన్ కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సైనిక పాలన విధించాలని యూన్‌కు సూచించింది ఆయనేనని సీనియర్ మిలిటరీ అధికారి ఒకరు తెలిపారు.

కాబుల్‌లో ఆత్మాహుతి దాడి.. మంత్రి దుర్మరణం

కాబుల్, డిసెంబరు 11: అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్ మరోసారి పేలుళ్లతో దద్దరిల్లింది. తాలిబన్ తాత్కాలిక శరణార్థుల శాఖ మంత్రి ఖలీల్ ఉర్ రెహ్మాన్ హక్కానీ మసీదులో ప్రార్థనలు చేసి వస్తున్న క్రమంలో ఓ దుండగుడు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో మంత్రితో పాటు మరో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గాయపడ్డారు. ఈ మేరకు ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ ఈ దాడికి చేసిందని ఆరోపించారు. అయితే ఈ ఘటనకు పాల్పడింది తామేనని ఎవరూ బాధ్యత వహించలేదు. కాగా, 2021లో అమెరికా, నాటో తమ బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత హక్కానీ తాత్కాలిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

కాబోయే కోడలికి కీలక పదవి అప్పగించిన ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 11: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ వరుసగా తన బంధువులకు కీలక పదవులు అప్పగిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు వియ్యంకులకు కీలక బాధ్యతలు అప్పగించిన ఆయన తాజాగా కాబోయే కోడలు కింబర్లీ గిల్ఫోయిల్‌కు కీలక పదవిని కట్టబెట్టారు. ఆమెను గ్రీస్‌కు అమెరికా రాయబారిగా నియమిస్తున్నట్లు ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. తనకు ఈ పదవిని అప్పగించిందుకు ట్రంప్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా కింబర్లీ ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్ పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు కింబర్లీకి 2020లో నిశ్చితార్థం జరిగింది.

సూసైడ్ నోట్‌తో బయటపడ్డ భార్య క్రూరత్వం

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాశ్ ఆత్మహత్య తర్వాత వెలుగులోకి వచ్చిన 40 పేజీల సూసైడ్ నోట్.. ఆయన భార్య క్రూరత్వాన్ని బయటపెట్టింది. బెంగళూరులో అతుల్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతుల్ 2019లో నిఖితను పెళ్లి చేసుకున్నారు. ఆమె ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. మనస్పర్థలు రావడంతో భార్య నిఖిత, అత్త నిశా, బావమరిది అనురాగ్, భార్య మేనమామ సుశీల్ తనను వేధించారని అతుల్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తనపై హత్యాయత్నం, వరకట్న వేధింపులు, అసహజ లైంగిక వేధింపుల ఆరోపణతో యూపీలో 9 కేసులు నమోదు చేశారని, ఆ కేసుల్లో రాజీ కోసం రూ.3 కోట్లు డిమాండ్ చేశారని వివరించారు. ప్రతి కేసులోనూ బెంగళూరు నుంచి యూపీ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, ఏడాదిలో 40 సార్లు నోటీసులు వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. తన నాలుగేళ్ల కుమారుడిని చూసేందుకూ రెండేళ్లుగా అనుమతించడంలేదని తెలిపారు. తెలంగాణ హైకోర్టులో దాఖలైన ఓ వరకట్న వేధింపుల కేసును కొట్టివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అతుల్ ఆత్మహత్య అంశాన్ని తాజాగా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వరకట్న వేధింపుల చట్టాన్ని మహిళలు దుర్వినియోగం చేసే ప్రవృత్తి దేశంలో పెరుగుతోందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. వరకట్నం కేసులను నిర్ధారించే ముందు అనవసరమైన వేధింపులను నియంత్రించాలని దిగువ కోర్టులకు సూచించింది. ఆత్మహత్యకు ముందు అతుల్ చేసిన 80 నిమిషాల వీడియో, 40 పేజీల సూసైడ్ నోట్‌లోని అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది.

భారత్ అమ్ములపొదిలో.. వోరోనెజ్ రక్షణ కవచం!

» గగనతల రక్షణకు రష్యా సాంకేతికత

» 8 వేల కి.మీ దూరంలోనే.. క్షిపణులను గుర్తించే అధునాతన వ్యవస్థ

» 34 వేల కోట్ల డీల్ కోసం భారత్ చర్చలు

» చిత్రదుర్గ వద్ద ఏర్పాటుకు సన్నాహాలు



న్యూఢిల్లీ, డిసెంబరు 11: గగనతల రక్షణలో భారత్ అమ్ములపొదిలో సరికొత్త కవచం చేరనుంది. రష్యాకు చెందిన అల్మాజ్-యాంటీ సంస్థ అభివృద్ధి చేసిన 'వోరోనెజ్ రాడార్' వ్యవస్థ అందుబాటులోకి వస్తే.. శత్రువులు ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులను 8 వేల కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించే సామర్థ్యం మన సొంతం అవుతుంది. అంతేకాదు.. శత్రువుల నిఘా విమానాలు(స్టెల్తర్ ఫైటర్), యుద్ధ విమానాలు, అంతరిక్ష వస్తువులను సైతం వోరోనెజ్ రాడార్ వ్యవస్థ గుర్తించగలదు. ఆ వెంటనే అప్రమత్తమై.. శత్రు క్షిపణులు, నిఘా/యుద్ధ విమానాలను గాల్లోనే అడ్డుకుంటుంది.

కర్ణాటకలో ఏర్పాటు

వోరోనెజ్ వ్యవస్థను కర్ణాటకలోని చిత్రదుర్గ వద్ద ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.34 వేల కోట్లతో అల్మాజ్-యాంటీతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇప్పటికే అల్మాజ్-యాంటీ డిప్యూటీ చైర్మన్ వ్లాదిమిర్ మెడోవ్నికోవ్ నేతృత్వంలోని బృందం గత నెల ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో పర్యటించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చిత్రదుర్గ సరైన ప్రదేశమని వెల్లడించింది. దీంతో.. డీల్ ఒప్పందాల కోసం డీఆర్‌డీవో అనుబంధ సంస్థ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఈఆర్‌డీవో) చర్యలు ప్రారంభించింది. ఈ విషయంలో భారత్-రష్యా మధ్య చర్చలు తుది దశలో ఉన్నాయని 'సండే గార్డియన్' ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం రష్యా రాడార్, క్షిపణి రక్షణ, గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసే అతిపెద్ద కంపెనీల్లో అల్మాజ్-యాంటీ ఒకటి కావడం గమనార్హం..!

మేకిన్ ఇండియాకు ఊతం!

కేంద్ర ప్రభుత్వం రక్షణకు సంబంధించి పూర్తి స్థాయి విదేశీ సాంకేతికతపై మొగ్గుచూపుతోంది. ఒకవేళ విదేశీ కంపెనీల నుంచి కొనుగోళ్లు జరిపినా.. సాంకేతిక బదిలీ అంశంపై దృష్టిసారిస్తోంది. ఈ క్రమంలో 50 దాకా భారత భాగస్వాములు, స్టార్టప్ లు వోరోనెజ్ వ్యవస్థలో 60% ఉద్పాదకతను చేపడతాయని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

ఎలా పనిచేస్తుంది..?

- వోరోనెజ్ వ్యవస్థ 8 వేల కిలోమీటర్ల దూరంలోనే శత్రువుల బాలిస్టిక్ క్షిపణులను గుర్తించగలదు. ఈ వ్యవస్థలోని ఒక రాడార్ శత్రు క్షిపణిని గుర్తించి, యాక్టివేట్ అయితే.. మరో రీజియన్‌లోని రాడార్ గనక అదే క్షిపణిని గుర్తిస్తే.. మొదటి రాడార్‌కు అదనపు సమాచారాన్ని అందజేస్తుంది.
- యుద్ధ విమానాలు, స్టెల్తర్ ఫైటర్లు, అంతరిక్ష వస్తువులను కూడా ఈ రాడార్లు గుర్తించి, వెంటనే సమాచారాన్ని అందజేస్తాయి.
- ఈ రాడార్లలోని అరే టెక్నాలజీ.. శత్రువుల టార్గెట్లను వేగంగా పసిగడతాయి.
- డ్నెపర్, డారిల్ వంటి పాత తరం రాడార్ వ్యవస్థలకంటే వోరొనెజ్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుంది. రష్యా వద్ద ఉన్న వోరోనెజ్ రాడార్ వ్యవస్థ ఆ దేశం మొత్తానికి రక్షణగా నిలుస్తోంది.
- ఒప్పందం కుదిరితే.. భారత్‌కు వోరోనెజ్-ఎం రకం రాడార్లు వచ్చే అవకాశాలున్నాయి. ఈ రకం రాడార్లు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే శత్రువుల క్షిపణులను గుర్తిస్తాయి. మధ్యశ్రేణి, దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల నుంచి రక్షణ కల్పిస్తాయి. దీంతోపాటు.. వోరోనెజ్-ఎం(వీహెచ్ఎఫ్ బ్యాండ్) కూడా ఇవే పనులను చేస్తుంది. వోరోనెజ్-డీఎం(యూహెచ్ఎఫ్ బ్యాండ్) చిన్న లక్ష్యాలను సైతం మెరుగైన రిజల్యూషన్‌తో.. అత్యంత కచ్చితంగా ట్రాక్ చేస్తాయి.

చైనా-పాక్‌ల నుంచి రక్షణ

చైనా, పాకిస్థాన్ ప్రయోగించే క్షిపణుల నుంచి ఈ వ్యవస్థ ముందస్తు హెచ్చరికలను అందించగలదు. ఇది అయానోస్పియర్ నుంచి.. తిరిగి భూమికి వచ్చే అధిక ఫ్రీక్వెన్సీ సంకేతాలను ప్రసారం చేస్తుంది. అవి దీర్ఘశ్రేణి క్షిపణులు, యుద్ధ విమానాలు, నౌకలను గుర్తించగలవు. రష్యా కూడా.. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా నుంచి ఎదురయ్యే ప్రమాదాలను పర్యవేక్షించడానికి వ్యూహాత్మకంగా వోరోనెజ్-ఎం రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. భారత వైమానిక దళానికి కూడా ఇలాంటి రాడార్ వ్యవస్థ అవసరం. సరిహద్దుల్లో చైనా పెద్ద సంఖ్యలో స్టెల్త్ ఫైటర్లు, డ్రోన్లను మోహరించింది. చైనా నుంచి పాకిస్థాన్ జే-35 స్టెల్త్ ఫైటర్లను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే రష్యాతో ఒప్పందాలు కుదుర్చుకోకూడదని అమెరికా చెబుతున్నా.. భారత్ వోరోనెజ్ వ్యవస్థపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

సమగ్ర ఉత్పత్తి యూనిట్‌గా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ

» కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఇంజన్, కోచ్, వ్యాగన్‌లతో కూడిన సమగ్ర ఉత్పత్తి యూనిట్‌గా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టతనిచ్చారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అంశాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య లేవనెత్తగా ఆయన సమాధానమిచ్చారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ప్రస్తుతం రూ.5వేల కోట్ల పైచిలుకు నిధులు తెలంగాణకు కేటాయించామని తెలిపారు. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌ల విస్తరణకు సంబంధించి జాతీయ కార్యాచరణలో భాగంగా చేపట్టిన అమృత్ తరహా అభివృద్ధిని అమలు చేస్తామని పేర్కొన్నారు. కాగా, ఏపీ విభజన చట్టం- 2014లో పొందుపరిచినట్లు కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారా? లేదా అనే అంశంపై స్పష్టతనివ్వాలని ఎంపీ కావ్య ప్రశ్నించారు. అలాగే నష్కల్ - హసన్ పర్తి, నష్కల్ - చింతలపల్లి బైపాస్ రీ-అలైన్‌మెంట్ అంశాలను లేవనెత్తారు.

రైల్వే సవరణ బిల్లుకు లోక్‌సభ ఓకే

న్యూఢిల్లీ, డిసెంబరు 11: రైల్వే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాల నిరసనల మధ్యే బుధవారం ఈ బిల్లును ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ఈ బిల్లు రైల్వేల ప్రైవేటీకరణకు దారితీయదని పేర్కొంది. కాగా, బిల్లుపై చర్చ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడారు. ఈ సవరణ ద్వారా రైల్వే ప్రైవేటుపరం అవుతుందని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, గతంలోనూ రాజ్యాంగం రద్దు చేస్తారని ఇలాగే అసత్య ప్రచారం చేసి దెబ్బతిన్నాయన్నారు.

నాకు మద్దతు తెలిపిన వారికి కృతజ్ఞతలు

» పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కోల్‌కతా, డిసెంబరు 11: ఇండియా కూటమికి నాయకత్వం వహించడానికి సంబంధించి తనకు మద్దతు తెలిపిన విపక్ష నేతలకు పశ్చిమ బెంగాల్ సీఎం మమత బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. 'నన్ను గౌరవించిన నాయకులందరికీ కృతజ్ఞతలు. వారందరి ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటున్నా. వారు, వారి పార్టీ బాగుండాలి. దేశం బాగుండాలి' అని బెనర్జీ ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్, ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన తదితర పార్టీల నేతలు మమత నాయకత్వానికి మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా జరగకుండా ఆటంకం కలిగిస్తున్నారని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లు వ్యవహరిస్తున్న తీరు వల్ల సభ వాయిదా పడుతోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మాట్లాడటానికి ఎక్కువ అవకాశం లభిస్తుందని, తమకు అవకాశం లభించడం లేదని పేర్కొన్నారు.

రాజ్యసభలో అంతరాయాలకు చైర్మన్ ధన్‌ఖడే కారణం

విసిగిపోయి.. మరో మార్గం లేకే 'అవిశ్వాసం'

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రాజ్యసభలో అంతరాయాలకు చైర్మన్ తీరే కారణమని, ఆయన ప్రవర్తన ఆ పదవి గౌరవానికి విరుద్ధంగా ఉందని మండిపడ్డారు. బుధవారం ఇక్కడ కానిస్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా కూటమి నేతలతో కలిసి రాజ్యసభలో ప్రతిపక్ష నేత కూడా అయిన ఖర్గే మీడియాతో మాట్లాడారు. ధన్‌ఖడ్ ఆయన పదవికి ఉన్న గౌరవాన్ని మరిచి, ప్రభుత్వ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంతో అనుభవం కలిగిన ప్రతిపక్ష నేతలకు కూడా ఉపన్యాసాలు ఇస్తున్నారని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిలా వ్యవహరిస్తున్నారన్నారు. అధికార పక్షానికి వంతపాడుతూ, ప్రతిపక్ష నేతలను మాట్లాడనీయకుండా నిలువరిస్తున్నారని ఆరోపించారు. చైర్మన్‌పై వ్యక్తిగతంగా తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదని, అయితే ఆయన తీరుతో విసిగిపోయిన తమకు అవిశ్వాస తీర్మానం తప్ప మరో మార్గం కనిపించలేదని చెప్పారు. 1952 నుంచి ఇప్పటి వరకు ఆర్టికల్ 67 కింద ఉప రాష్ట్రపతికి వ్యతిరేకంగా తీర్మానం రాలేదన్నారు. ఆ పదవిలో కొనసాగినవారు గతంలో ఎన్నడూ రాజకీయాలు చేయలేదని, నిష్పక్షపాతంగా వ్యవహరించారని తెలిపారు.

బీజేపీ ఎంపీల వ్యాఖ్యలను తొలగించండి

» సభ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోండి

» లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, డిసెంబరు 11: కాంగ్రెస్-సోరోస్ అంశంలో తనని అవమానించేలా బీజేపీ ఎంపీలు సభలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను బుధవారం స్వయంగా కలిసిన రాహుల్ గాంధీ.. సభ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీకి హంగేరికి చెందిన బిలియనీర్ జార్జి సోరోస్‌కు సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రా డిసెంబరు 5న ఆరోపించారు. ఆ మరుసటి రోజున నిషికాంత్ దూబే లోక్‌సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హస్తం సోరోస్ చేతిలో ఉందని, అమెరికా ప్రభుత్వం, జార్జి సోరోస్ ఇచ్చే నిధులతో పని చేసే ఓసీసీఆర్‌పీ(ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు)తో కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. భారత్ జోడో యాత్ర కోసం రాహుల్ గాంధీ.. సోరోస్ దగ్గర డబ్బు తీసుకున్నారా ? అని ప్రశ్నించారు. తీవ్ర దుమారం రేపిన ఈ వ్యాఖ్యలనే రికార్డుల నుంచి తొలగించాలని రాహుల్ కోరారు. అయితే, తాను చేసిన విజ్ఞప్తికి సభాపతి సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని స్పీకర్‌తో భేటీ అనంతరం రాహుల్ గాంధీ విలేకరులతో అన్నారు. అదానీ అంశంపై చర్చ జరగకూడదనే లక్ష్యంతో బీజేపీ ఎంపీలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రాజ్‌నాథ్‌కు గులాబీ

ఓవైపు అదానీ, మోదీ చిత్రాలు.. మరోవైపు 'అదానీ-మోదీ భాయ్ భాయ్' అనే మాటలు ముద్రించి ఉన్న సంచులతో మంగళవారం పార్లమెంట్ వద్ద నిరసన తెలియజేసిన ఇండియా కూటమి ఎంపీలు బుధవారం మరింత వినూత్నంగా తమ నిరసన తెలియజేశారు. పార్లమెంట్ భవనం ప్రవేశ ద్వారం వద్ద బీజేపీ ఎంపీలకు జాతీయ జెండా(త్రివర్ణ పతాకం ముద్రించిన కార్డులు), చిన్న గులాబీ పువ్వు ఇచ్చి స్వాగతిస్తూ సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఇదే క్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రాహుల్ గాంధీ జాతీయ జెండా, గులాబీ పువ్వు అందజేశారు. కానీ, రాజ్‌నాథ్ వాటిని స్వీకరించకుండానే ముందుకు వెళ్లిపోయారు. కాగా, ఎంతో మంది సామాన్యులకు జీవనాడి లాంటి ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లను మోదీ ప్రభుత్వం.. కొన్ని ధనిక, శక్తిమంతమైన సంస్థలకు ప్రైవేటు పెట్టుబడి సంస్థలుగా మార్చేసిందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. బుధవారం అఖిల భారత బ్యాంకింగ్ అధికారుల సమాఖ్యకు చెందిన ప్రతినిధులతో రాహుల్ సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు చేశారు. తన మోసపూరిత స్నేహితుల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులను అపరిమిత నిధుల వనరుగా చూడటాన్ని మోదీ ప్రభుత్వం ఇకనైనా నిలివేయాలని అన్నారు.

నెహ్రూ-గాంధీ కుటుంబం, సోరోస్‌ది ఎన్నో ఏళ్ల బంధం

కాంగ్రెస్- సోరోస్ అంశంలో బీజేపీ తన దాడిని తీవ్రం చేసింది. నెహ్రూ-గాంధీ కుటుంబం, జార్జి సోరోస్ మధ్య బంధం ఈనాటి కాదని, ఎన్నో ఏళ్ల అనుబంధమని పేర్కొంటూ బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. జార్జి సోరోస్ మాదిరిగానే హంగేరికి చెందిన ఫోరీ నెహ్రూ.. జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబానికి చెందిన బీకే నెహ్రూను వివాహం చేసుకున్నారని, తద్వారా ఫోరీ నెహ్రూకు రాహుల్ గాంధీతో చుట్టరికం ఉందని బీజేపీ పేర్కొంది. బీకే నెహ్రూ అమెరికాలో భారత రాయబారిగా పని చేసిన రోజుల్లో జార్జి సోరోస్ పలుమార్లు ఫోరీ నెహ్రూను కలిశారనేందుకు ఆధారాలున్నాయని తెలిపింది. ఈ నేపథ్యం నెహ్రూ-గాంధీ కుటుంబం తమ ఆర్థిక ప్రగతి కోసం దేశ ప్రయోజనాల విషయంలో ఎంత మేరకు రాజీపడిందనే ప్రశ్నలు లేవనెత్తుతుందని బీజేపీ పేర్కొంది.

ట్రంప్ కార్యవర్గంలో బిలియనీర్లు

» అందరి సంపద కలిపి 382 బిలియన్ డాలర్లు

» 172 దేశాల జీడీపీ కన్నా వారి ఆస్తి ఎక్కువ


ఎలాన్ మస్క్


వివేక్ రామస్వామి


ఐజాక్‌మన్

వాషింగ్టన్, డిసెంబరు 11: మధ్యతరగతి అమెరికన్లను రక్షిస్తాం.. సాధారణ అమెరికా పౌరుల కోసం పోరాడతాం.. అని ఎన్నికల ప్రచారంలో డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఇప్పుడు ఆ మధ్యతరగతి కోసం తన కార్యవర్గంలోకి అపర కుబేరులను ఎంపిక చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు తన కార్యవర్గంలోకి బిలియనీర్లు అయిన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి, లిండా మెక్‌మహోన్, హోవార్డ్ లుట్నిక్, డగ్ బర్గమ్, స్కాట్ బెసెంట్, జారెడ్ ఐజాక్‌మన్, స్టీవెన్ విట్కాఫ్, వారెన్ స్టీఫెన్స్‌లను తీసుకున్నారు. ప్రస్తుతం వీరి మొత్తం ఆస్తి విలువ సుమారు 382.2 బిలియన్ డాలర్లు. అంటే దాదాపు రూ.32 లక్షల కోట్లు. ఇది ఎంత పెద్ద సంపద అంటే.. ప్రపంచంలో ఎక్కువ దేశాలకు అంత జీడీపీ కూడా లేదు. 172 దేశాలు ట్రంప్ కార్యవర్గం సంపద మొత్తం అంత ఆదాయాన్ని పొందడంలేదు. కాగా, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ కేబినెట్‌లోని వారి మొత్తం సంపద 118 మిలియన్ డాలర్లు. అయితే గతంలో ట్రంప్ కేబినెట్ మొత్తం ఆస్తి విలువ 6.2 బిలియన్ డాలర్లు మాత్రమే అని ఫోర్బ్స్ వెల్లడించింది.

ట్రంప్ కార్యవర్గంలోకి కుబేరులు

ఎలాన్ మస్క్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి అధిపతిగా ప్రపంచ కుబేరుడు మస్క్‌ను ట్రంప్ ఎంపిక చేసుకున్నారు. మస్క్ ప్రస్తుత సంపద మొత్తం 363.3 బిలియన్ డాలర్లు.

వారెన్ స్టీఫెన్స్: బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా స్టీఫెన్స్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. వారసత్వంగా వచ్చిన ఆర్థిక సేవల కంపెనీ స్టీఫెన్స్ ఇన్‌కార్పోరేషన్‌కు అధిపతి వారెన్ స్టీఫెన్స్. అతని మొత్తం ఆస్తి 3.4 బిలియన్ డాలర్లు.

లిండా మెక్‌మహోన్: ప్రపంచ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు మెక్‌మహోన్ కో ఫౌండర్. లిండాకు విద్యా శాఖ పగ్గాలు అప్పగించే అవకాశముంది. మెక్‌మహోన్ కుటుంబం సంపద 3 బిలియన్ డాలర్లు.

జారెడ్ ఐజాక్‌మన్: నాసా అధిపతిగా ఐజాక్‌మన్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. మస్క్‌కు సన్నిహితుడైన ఆయన స్పేస్ ఎక్స్‌లో పెట్టుబడి పెట్టారు. ఐజాక్‌మన్ మొత్తం ఆస్తి విలువ 1.7 బిలియన్ డాలర్లు.

హోవార్డ్ లుట్నిక్: కేంటర్ ఫిట్జ్‌గెరాల్డ్ అనే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌కు హోవార్డ్ అధిపతి. కామర్స్ సెక్రటరీగా ట్రంప్ అవకాశం ఇచ్చారు. లుట్నిక్ మొత్తం ఆస్తి విలువ 1.5 బిలియన్ డాలర్లు.

వివేక్ రామస్వామి: మస్క్‌తో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీని లీడ్ చేసే అవకాశం వివేక్‌కు ట్రంప్ ఇచ్చారు. ఆయన మొత్తం ఆస్తి విలువ ఒక బిలియన్ డాలర్లు.

స్టీవెన్ విట్కాఫ్: మధ్యప్రాచ్యానికి ప్రత్యేక రాయబారిగా విట్కాఫ్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. ఫ్లోరిడాలో రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారుడైన విట్కాఫ్ మొత్తం సంపద విలువ ఒక బిలియన్ డాలర్లు.



కబడ్డీ ఆడిన మంత్రి సీతక్క

ములుగు జిల్లా ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకులం మైదానంలో సీఎం కప్ క్రీడాపోటీలను మంత్రి సీతక్క బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలతో కలిసి ఆమె కబడ్డీ ఆడారు. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆమె బాలికలకు సూచించారు. - ములుగు, (ఆంధ్రజ్యోతి)

ఇతరులు లోనికి రాకూడదు

» గురుకులాల్లోకి ప్రవేశం నిషేధం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్కారు విద్యాసంస్థల్లో ఇటీవల వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని ఇటీవలి కాలంలో ప్రతిపక్షాలు, ఇతర పార్టీల నాయకులు రెసిడెన్షియల్ విద్యాసంస్థలను సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పలు విద్యాసంస్థల సొసైటీలు చర్యలకు ఉపక్రమించాయి. ఇందులో భాగంగా గురుకుల పాఠశాల, కళాశాలల గేటుకు సెక్రటరీ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనధికార వ్యక్తులు, సంస్థల ప్రవేశం నిషేధమని, అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి.

హాస్టల్ ఫుడ్ పాయిజన్ ఘటనల్లో.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుమానాలు

» ఇందులో బీఆర్ఎస్ పాత్ర.. ఎంఎస్‌డీఎస్ చైర్‌పర్సన్ శోభారాణి

తాండూరు/తాండూరు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తరుచుగా ప్రభుత్వ వసతి గృహాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక బీఆర్ఎస్ నాయకుల పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బొంద్రు శోభారాణి ఆరోపించారు. బుధవారం వికారాబాద్ జిల్లా తాండూరులోని గిరిజన ఆశ్రమ సంక్షేమ వసతి గృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతతో కలిసి శోభారాణి పరామర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై తమకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుమానాలు ఉన్నాయని అన్నారు. అది చెబితే ఆయన నోటీసులు పంపించారని అలాంటి వాటికి తాము భయపడబోమని ధీమా వ్యక్తం చేశారు.

19 నుంచి 29 వరకు పుస్తక ప్రదర్శన

బర్కత్‌పుర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన తెలంగాణ నిర్మించడమే లక్ష్యంగా ఈ నెల 19 నుంచి 29 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందులో అన్ని భాషల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, 350 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావులను ఆహ్వానించామని తెలిపారు. బుధవారం హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ యాకుబ్ షేక్, ఆర్.శ్రీనివాస్, కోశాధికారి పి.నర్సింహారెడ్డి మీడియాతో మాట్లాడారు. పుస్తక ప్రదర్శన ప్రాంగణానికి దాశరధి కృష్ణమాచార్య పేరు పెట్టామని, సభా కార్యక్రమ వేదికకు బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికకు తోపుడు బండి సాధిక్ పేరు పెట్టామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు తక్కువ ధరలో స్టడీ మెటీరియల్ కొనుగోలు చేయవచ్చని, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడానికి 'బుక్ టూ వాక్' పేరుతో రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పుస్తక ప్రదర్శనలో ఫుడ్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ వంటకాలతో పాటు ఇరానీ చాయ్, బిర్యానీలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

మేడారం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

భక్తులకు శాశ్వత సౌకర్యాల కోసం ప్రణాళిక.. ప్రశాంతంగా దర్శించుకునేలా గద్దెల విస్తరణ

» ట్రాఫిక్ నియంత్రణ..రోడ్ల విస్తరణ
» కాటేజీల నిర్మాణం
» 2026 మహాజాతరకు ముందే పనుల ప్రారంభం
» వచ్చే ఏడాది జరిగే మినీ జాతరకు రూ.3.86 కోట్లు



నిర్మాణ దశలో ఉన్న పూజారుల విశ్రాంతి భవన సముదాయం

ములుగు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టిపెట్టింది. జాతరకు ముందు తాత్కాలిక సౌకర్యాలు కల్పించే ఆనవాయితీకి ఇక చెక్ పెట్టేసి.. భక్తుల కోసం శాశ్వత ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలని సంకల్పించింది. ఇందుకు మంత్రి సీతక్క చొరవతో మేడారం అభివృద్ధి కోసం సర్కారు 'మాస్టర్ ప్లాన్' సిద్ధం చేస్తోంది. ఈ మేరకు 2026 మహాజాతరకు ముందే పనులను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఎన్ని కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించనుందనేది తెలియరాలేదు.

ఆ అభివృద్ధి పనులు ఏమిటి?

రెండేళ్లకోసారి 4 రోజుల పాటు జరిగే మహాజాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తారు. ఈ స్థాయిలో వచ్చే భక్తుల కోసం అక్కడ పెద్దగా సౌకర్యాలు లేవు. సమక్క-సారలమ్మ గద్దెల పరిసరాలు ఇరుకుగా ఉన్నాయి. ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాలు చిన్నగా ఉండటంతో భక్త జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొక్కిసలాట జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యలను నివారించేందుకు గద్దెలు విస్తరించనున్నారు. మేడారం సమీపంలోని మార్గాల్లో ట్రాఫిక్ జాం సమస్యను అధిగమించేందుకు రహదారులను విస్తరించనున్నారు. ఇందులో భాగంగా పస్రా-మేడారం, తాడ్వాయి-మేడారం, కొండాయి, భూపాలపల్లిని కలిపే కాల్వపల్లి, గొల్లబుద్దారం బయ్యక్కపేట రోడ్లను విస్తరించనున్నారు. జాతరకు 20 కి.మీ దూరంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు. మేడారంలో అంతర్గత రోడ్లనూ వెడల్పు చేయనున్నారు. మేడారానికి మహాజాతరప్పుడే కాకుండా ఏడాది పొడుగునా భక్తులు వస్తుంటారు. భక్తులు.. తమ కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో వచ్చి మేడారంలో హాయిగా విడిది చేసేందుకు శాశ్వత ప్రాతిపదికన కాటేజీలు నిర్మించనున్నారు. అయితే గతంలో కేటాయించిన నిధులతో మేడారంలో పూజారుల విశ్రాంతి భవన సముదాయం, మేడారం-ఊరట్టం సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మొత్తంగా రూ.17 కోట్ల 50 లక్షలతో రోడ్డు, రూ.3కోట్ల 50 లక్షలతో గెస్ట్‌హౌస్ పనులు చేస్తున్నారు. కాగా, మేడారంలో రెండేళ్లకోసారి జరిగేది మహాజాతర అయితే ఏటా జరిగేది మినీ జాతర! వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర జరగనుంది. ఈ జాతరకు ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.3.86 కోట్లు కేటాయించింది.

అదనంగా రూ.430 కోట్లు అవసరం

పెరుగుతున్న నిమ్స్ అంచనాలు.. ప్రభుత్వానికి నివేదించిన ఆర్ అండ్ బీ

» ఇప్పటికే రూ.1,698 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం నిర్మించతలపెట్టిన నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (నిమ్స్) అదనపు భవనాల నిర్మాణానికి అదనంగా రూ.430 కోట్లు అవసరమని ఆర్ అండ్ బీ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గత ప్రభుత్వ హయాంలో నిమ్స్ అదనపు భవనాలకు శంకుస్థాపన జరగ్గా, పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గతంలో రూపొందించిన ప్రాజెక్టులో పొందుపర్చని పలు అంశాలు తాజాగా తెరమీదకు రావడంతో పాటు, కొత్త పనులు చాలా అవసరమంటూ అధికారులు ప్రభుత్వానికి తెలిపారు. ఈ నేపథ్యంలో నిమ్స్ అదనపు భవనాల పనులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ప్రభుత్వానికి సమగ్ర వివరాలను ఒక నివేదిక ద్వారా తెలిపింది. ఆసుపత్రి అదనపు భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే మంజూరు చేసిన రూ.1,698 కోట్లకు అదనంగా మరో రూ.430 కోట్ల మేర నిధులు అవసరమవుతాయని నివేదికలో పేర్కొన్నట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఇవీ అదనపు పనులు

ఎంట్రన్స్ ఎలివేటెడ్ ర్యాంపునకు రూ.40.25 కోట్లు, మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కోసం రూ.169.12 కోట్లు, సబ్‌స్టేషన్‌కు రూ.28 కోట్లు, విద్యుత్ హై టెన్షన్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వాటర్ లైన్లను మరోచోటకు మార్చేందుకు రూ.20.70 కోట్లతో పాటు మరికొన్ని పనులకు కలిపి రూ.374.13కోట్లు అవుతుందని నివేదికలో పేర్కొన్నారు. దీనికి ట్యాక్స్‌లు రూ.56.56 కోట్లు.. మొత్తంగా మరో రూ.430.69 కోట్లు అదనపు నిధులు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. నిమ్స్ అదనపు భవనాలను దాదాపు 19.54 ఎకరాల్లో.. 5 బ్లాకులుగా విభజించి నిర్మిస్తున్నారు. ఆసుపత్రి, యుటిలిటీ బ్లాకులు అన్నీ కలిపి దాదాపు 26,19,204 చదరపు అడుగుల మేర ఉండనున్నాయి. వీటిలో ఆసుపత్రి భవనాలు 4 ఉంటాయి. కాగా, 30 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో కూడిన భూగర్భ ట్యాంకును ఏర్పాటు చేయనున్నారు. ఆసుపత్రిలో మొత్తం 53 ఆపరేషన్ థియేటర్లు, 53లిఫ్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ అదనపు ఆసుపత్రి భవనంలో 2020 పడకలను ఏర్పాటు చేయను న్నారు. మెడికల్ ఎక్విప్‌మెంట్ కోసం రూ.98.47 కోట్లను ఖర్చు చేయనున్నారు. కాగా, నిర్మాణ పనులను 2026 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

ఉత్తమ పార్లమెంటేరియన్ తరహాలో
ఏటా ఉత్తమ లెజిస్లేచర్ అవార్డు

» ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది
» ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణా కార్యక్రమం ప్రారంభం సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
» కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరం



హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు తరహాలో శాసనసభలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సభ్యునికి 'ఉత్తమ లెజిస్లేచర్' అవార్డును ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీహెచ్ఆర్‌డీఐ)లో బుధవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణా కార్యక్రమాన్ని(లెజిస్లేచర్ ఓరియంటేషన్) ప్రసాద్‌కుమార్‌తో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. శాసనసభ వ్యవహారాలపై సభ్యులకు పూర్తి అవగాహన ఉంటేనే.. సభలో వారు అర్థవంతంగా మాట్లాడగలుగుతారని చెప్పారు. గడిచిన పదేళ్లలో ఎప్పుడు కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇలాంటి శిక్షణా కార్యక్రమం జరగలేదని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేల్లో 57 మంది కొత్తగా ఎన్నికైన వారే ఉన్నారని, వారు ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఈ ఓరియంటేషన్ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో పాటుగా 65 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

జనవరిలో కేసీఆర్, హరీశ్‌రావు వంతు!

» విచారణకు పిలువనున్న కాళేశ్వరం కమిషన్

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఈ నెల 17న హైదరాబాద్‌కు రానున్నారు. ఈనెల 24వరకు హైదరాబాద్‌లోనే ఉండి విచారణ చేపట్టనున్నారు. తొలుత మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ బి.హరిరామ్‌లను.. ఆ తర్వాత సీఎంవో మాజీ కార్యదర్శి స్మితా సభర్వాల్, మాజీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు ఎస్‌కే జోషి, సోమేశ్‌కుమార్, మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాలున్నాయి. ఈ నెల 18 లేదా 19న క్రాస్ ఎగ్జామినేషన్ పునఃప్రారంభంకానుంది. ఇక, వచ్చే జనవరిలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీశ్‌రావులను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలవనుంది. మరోవైపు ఫిబ్రవరిలో కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందించే అవకాశాలున్నట్టు సమాచారం. ఈ నెలాఖరుతో కమిషన్ విచారణ గడువు ముగియనుంది. కాగా, విద్యుత్ విచారణ నివేదికపై త్వరలోనే ప్రభుత్వం శాసనసభలో చర్చకు పెట్టనుంది. ఈ నేపథ్యంలో కాళేశ్వరంపై నివేదికను త్వరలోనే సమర్పించడానికి పీసీ ఘోష్ సమాయత్తమవుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నాయకుడిని హత్య చేసిన మావోయిస్టులు

» ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి.. ఐఈడీ పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా వార్‌జోన్‌గా మారుతోంది. ఈ జిల్లాలో బుధవారం ఒక్కరోజే 4ఘటనలు జరగడం సంచలనంగా మారింది. బీజాపూర్ జిల్లా సోమన్‌పల్లికి చెందిన బీజేపీ నేత మండోర(41)ను మంగళవారం అర్ధరాత్రి మావోయిస్టులు హత్య చేశారు. అతడు పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, అందుకే హత్య చేశామని లేఖలు వదిలారు. ఇక బీజాపూర్ జిల్లా గంగలూరు అటవీ ప్రాంతంలో బుధవారం మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎన్‌కౌంటర్ జరగ్గా ఒక మావోయిస్టు మృతి చెందాడు. ఎన్‌కౌంటర్ సమయంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీపై కాలు వేయడంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం అదే అడవిలో బలగాలు గాలించి రెండు భారీ ఐఈడీలు గుర్తించినట్లు బీజాపూర్ జిల్లా పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

చట్టమే గెలవాలి...!

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ రోజునుంచి ప్రార్థనాస్థలాల (ప్రత్యేక నిబంధనలు)చట్టం—1991మీద దాఖలైన పిటిషన్లను విచారించబోతోంది. స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 ఆగస్టు 15నాటికి దేశంలోని ఆయా ప్రార్థనాస్థలాల మతస్థితిని యథాతథంగా పరిరక్షిస్తూ, వాటి స్వరూప స్వభావాలను మార్చే అన్ని ప్రయత్నాలను ఈ చట్టం నిషేధిస్తున్నది. అయోధ్యలో రామజన్మభూమి—బాబ్రీ మసీదు వివాదం నేపథ్యంలో, పీవీ నరసింహారావు ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం ఆ ఒక్క వివాదాన్ని మాత్రం మినహాయిస్తూ మిగతా ప్రార్థనాస్థలాల జోలికి ఎవరూ పోకుండా అడ్డుకొనే ప్రయత్నం చేసింది. ఈ చట్టం రాజ్యాంగవిరుద్ధమనీ, కొట్టివేయాలనీ కోరుతూ దాఖలైన ఆరుపిటిషన్లపై న్యాయస్థానం చేపడుతున్న ఈ విచారణ భవిష్యత్ భారతంలో లౌకికవాదం, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ముఖ్యమైనది. అయోధ్య వివాదం పరిష్కారంతో ఇక ఈ తరహా ఘర్షణలకు తెరపడుతుందనీ, సయోధ్య వెల్లివిరుస్తుందనీ అంతా అనుకున్నారు. కానీ, కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు వరుసగా రేపుతున్న మరిన్ని వివాదాలు మతవైషమ్యాలు పెంచుతున్న తరుణంలో, ఈ చట్టం ఉనికిమీద సర్వోన్నత న్యాయస్థానం రాబోయేరోజుల్లో ఏమి చెబుతుందోనని దేశప్రజలు ఎదురుచూస్తున్నారు.

పిటిషన్‌దారులలో సుబ్రహ్మణ్యస్వామి, న్యాయవాది అశ్విన్ ఉపాధ్యాయ పేర్లు ముఖ్యంగా చెప్పుకోవాలి. మధ్యయుగాల్లో కొందరు మతోన్మాదులు చేసిన అకృత్యాలకు ఈ నవయుగంలో జనం తన్నుకుచావకూడదన్న లక్ష్యంతో ఈ చట్టం రూపొందితే, దాని ఉద్దేశాన్ని వీరు తప్పుబడుతున్నారు. ఆనాటి దండయాత్రికుల దురాగతాలను ప్రశ్నించనివ్వకుండా, ఆ దురాక్రమణలను సవాలు చేయనివ్వకుండా ఈ చట్టం అడ్డుపడుతున్నదని వారి ఆరోపణ. యథాతథస్థితి పేరిట న్యాయస్థానాలనుంచి ప్రార్థనాస్థలాల వివాదాలకు పరిష్కారం దక్కనివ్వకుండా చేస్తున్నదనీ, అప్పటి చారిత్రక, సాంస్కృతిక అకృత్యాలకు ఇప్పుడు మరమ్మతులు జరగాల్సిందేనని వారి వాదన. అయోధ్య వివాదం దేశాన్ని ఎంతగా కుదిపేసిందో తెలిసిందే. దానికి న్యాయస్థానం అందించిన పరిష్కారంమీద భిన్నాభిప్రాయాలున్న విషయాన్ని అటుంచితే, అగ్గి అక్కడితో ఆరిపోకుండా దావానలంలాగా వ్యాపిస్తూండటం విచారకరం. పురాతన ఆలయాలను కూల్చి మసీదులు కట్టారనీ, అర్చనకు అనుమతించాలంటూ స్థానిక న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తూండటం, అవి సరేననడం చూస్తున్నదే. మసీదు అడుగున ఏమున్నదో తేల్చడానికి దిగువకోర్టులు సర్వేలకు అనుమతిస్తుంటే, హైకోర్టులు సమర్థిస్తుంటే, సుప్రీంకోర్టు ఆట నియమాలను స్వల్పంగా మార్చి కానివ్వమనడం జరిగిపోతోంది. వారణాసిలో జ్ఞానవాపి, మధురలో షాహీ ఈద్గా, సంభాల్‌లో షాహీ జామా..ఇలా వివాదాలు సాగిపోతున్నాయి.

సుప్రీంకోర్టు 2019నాటి అయోధ్య తీర్పులో ఈ చట్టాన్ని ఘనంగా ప్రశంసించింది. అలనాటి ఘోరాలు, చారిత్రక అన్యాయాలను సరిదిద్దవలసిందేనంటూ వర్తమానంలో ఆయా మతస్థలాల రూపురేఖలను మార్చేందుకు చేసే ఏ ప్రయత్నాన్నీ అనుమతించకుండా, ఆదిలోనే అడ్డుపడుతూ ఈ చట్టం ఎంతో మంచిపనిచేసింది.. దేశప్రజల శాంతియుత సహజీవనానికి ఇది అత్యావశ్యకం అని గొప్పగా వ్యాఖ్యానించింది. కానీ, అదే న్యాయస్థానం ఈ చట్టాన్ని పరోక్షంగా బలహీనపరిచింది. అడుగున మందిరాలున్నాయన్న వాదనతో మసీదులను దెబ్బతీసే ప్రయత్నాలను నిలువరించలేదు. మూలాలు తెలుసుకుంటామని అంటున్నారు కానీ, స్వరూపాన్ని మారుస్తామనలేదు కదా అంటూ మాజీ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ళక్రితం జ్ఞానవాపి వివాదంలో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రప్రభుత్వం తన వైఖరి తెలియచేయకుండా, సర్వోన్నతన్యాయస్థానం తనకుతానుగా చొరవచూపకుండా, మరోపక్క దిగువకోర్టులను నియంత్రించకుండా ఒక జగన్నాటకం ఇంతకాలం సాగింది. అయోధ్యతో సరి, ఇక భవిష్యత్తులో సామాజిక అశాంతి రేగకూడదన్న ఈ చట్టం లక్ష్యం నెరవేరకుండా పోయింది. సంభాల్‌లో ఇటీవల జరిగిన హింస దేశ భవిష్యత్ పరిణామాలకు సంబంధించిన ఓ బలమైన హెచ్చరిక. బాబ్రీ కూల్చివేతకు ఒక ఏడాదిముందుగా, ఎంతో ముందుచూపుతో తయారైన ఈ మూడుదశాబ్దాలనాటి చట్టాన్ని నిలబెట్టుకోవడం దేశానికి శ్రేయస్కరం.

పంజాబీ పార్టీ ఎలా పతనమయింది?

పంజాబ్‌లో సంభవిస్తున్న పరిణామాలు తీవ్ర కలవరపాటు కలిగిస్తున్నాయి. అకాలీదళ్ నాయకుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం గురించి మాత్రమే నేను ప్రస్తావించడం లేదు. నా వ్యాకులతకు ప్రధాన కారణం శిరోమణి అకాలీదళ్‌లో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అఖల్ తఖ్త్ జోక్యం చేసుకున్న తీరు. ఒక రాజకీయ పార్టీ వ్యవహారాలలో ఆ సిక్కు మత పీఠం ప్రమేయం పెట్టుకున్న వైనం లోతైన, విస్తృత రాజకీయ, న్యాయ సంబంధ, రాజ్యాంగపరమైన సమస్యలను లేవనెత్తుతోంది. వాటి గురించి మౌనం వహించడం తగదు. మన లౌకిక గణతంత్ర రాజ్యాన్ని (సెక్యులర్ రిపబ్లిక్) కూల్చివేసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఒక రాజకీయ పార్టీ (అది కేవలం ఒక రాష్ట్రానికి మాత్రమే పరిమితమైనదే అయినా) అంతర్గత విషయాలలో ఒక మత సంస్థ నిర్దయాత్మకంగా వ్యవహరించడాన్ని ఎట్టి పరిస్థితులలోను ఉపేక్షించకూడదు.

అఖల్ తఖ్త్— అకాలీదళ్ సంబంధాల తాజా వాస్తవాలు సూటిగా ఉన్నాయి. వరుసగా సార్వత్రిక, శాసనసభ ఎన్నికలలో పరాజయాలను చవిచూసిన శిరోమణి అకాలీదళ్ ప్రస్తుతం మనుగడ సంక్షోభంలో ఉన్నది. తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ రాజకీయ వారసత్వాన్ని పొందిన నాటి నుంచి దుష్పరిపాలన, అవినీతి, రాజకీయ అవివేకం ఆరోపణలతో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ పార్టీలో తీవ్ర సవాళ్ల నెదుర్కొంటున్నారు. సుఖ్‌బీర్ నాయకత్వ శైలిని మొదటి నుంచీ వ్యతిరేకించినవారు ఇటీవల మరింత మద్దతుతో, పూర్తిస్థాయిలో తిరుగుబాటు చేశారు. అకాలీదళ్ చీలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అకాలీదళ్‌కు ఏర్పడ్డ ఈ విపత్కర పరిస్థితిలో సిక్కుమత సర్వోన్నత ధార్మిక సంస్థ అఖల్ తఖ్త్ రంగప్రవేశం చేసింది.

మన రాజకీయ రంగంలో శిరోమణి అకాలీదళ్ లేకపోతే జరిగేదేమిటి? కేవలం పంజాబ్ మాత్రమే కాదు, యావద్భారతదేశమూ తీవ్రంగా నష్టపోతుంది. ఒక రాజకీయ శూన్యత నెలకొంటుంది. ఆ శూన్యత, తీవ్రవాద శక్తుల విజృంభణకు దారితీస్తుంది. పంజాబ్ లోపల, వెలుపల ఉన్న సిక్కు మతస్థులలో అనేక మంది ఇప్పటికీ 1984 నాటి తీవ్ర మనస్తాపం నుంచి తేరుకోనే లేదు. ఆ నాటి సిక్కుమత వ్యతిరేక మారణకాండ వారిని ఇప్పటికీ కోపోద్రిక్తులను చేస్తోంది. ఆ హత్యాకాండకు పాల్పడినవారు ఇప్పటికీ ఎటువంటి శిక్షలకు గురికాకుండా స్వేచ్ఛగా ఉండడం ఎంతో మంది సిక్కులను బాధిస్తోంది. అయితే పంజాబ్, జాతీయ రాజకీయాలలో అకాలీదళ్ నిర్వహిస్తున్న పాత్ర సిక్కు మతస్థులకు ఎంతో ఓదార్పునిస్తోంది. '1984' మానసిక గాయాలకు ఒక విధంగా ఉపశమనం కలిగిస్తోంది. సరే, సుఖ్‌బీర్ బాదల్ తన తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ రాజకీయ విజ్ఞత, పాలనా సామర్థ్యం, ప్రజాదరణకు వారసుడు కాలేకపోయారు. తత్కారణంగానే అకాలీదళ్‌ను సమస్యలు చుట్టుముట్టాయి. ఫలితంగా ఆ పార్టీ పరిస్థితి అంతకంతకూ దిగజారిపోతోంది. అకాలీదళ్ నిర్నిరోధ పతనాన్ని అరికట్టేందుకు ఆ పార్టీ వ్యవహారాలలో ఎవరో ఒకరు జోక్యం చేసుకోవల్సి ఉన్నది.

నిజమే, పార్టీ శ్రేయోభిలాషులు జోక్యం చేసుకోవాలి. అయితే అకాలీదళ్‌ను చక్కదిద్దగల పెద్దరికం ఉన్నది ఎవరు? ఏ పెద్ద మనిషి ప్రమేయంతో సమస్యలు తీరిపోతాయి? ఇవి ఆలోచించాల్సిన విషయాలు. అకాలీదళ్ వ్యవహారాలలో అఖల్ తఖ్త్ జోక్యం చేసుకుని మధ్యవర్తిత్వం నెరపడం సముచితమేనా? అంతకంటే ముఖ్యంగా అఖల్ తఖ్త్ సర్వోన్నత ఆదేశాలకు అకాలీదళ్ లోబడడం సరైన విషయమేనా? ఎందుకంటే ఇది ఒక పార్టీ లేదా ఒక మత సమూహం అంతర్గత వ్యవహారం కాదు; అలాగే ఒక పార్టీ, కొంతమంది మతనాయకుల మధ్య వ్యవహారం అంతకంటే కాదు.



సిక్కు మత సంస్కరణ ఉద్యమంలో మూలాలు ఉన్న ఒక పంథిక్ సంస్థగా అకాలీదళ్ ఆవిర్భవించింది. ఖలిస్తానీ ఉగ్రవాదం సమసిపోయిన తరువాత అకాలీదళ్ రాజనీతిజ్ఞతలో ఒక పెద్ద మార్పు సంభవించింది. ఒక 'పంథిక్' పార్టీ నుంచి ఒక పంజాబీ పార్టీగా, ఒక మత సంబంధ–ప్రాంతీయ పార్టీ నుంచి స్వచ్ఛమైన ఒక ప్రాంతీయ పార్టీగా పరివర్తన చెందింది. అయితే, అకాలీదళ్ సిక్కు మతస్థుల పార్టీ అని, సిక్కు మత వ్యవస్థకు అది జవాబుదారీగా ఉంటుందనే విషయాన్ని ఇటీవలి పరిణామాలు స్పష్టం చేశాయి.

ప్రప్రథమంగా ప్రస్తావించాల్సిన అంశం: శిరోమణి అకాలీదళ్ ఒక ప్రాంతీయ పార్టీ స్థాయి నుంచి ఒక మత సమూహం పార్టీగా తిరోగమించింది. సిక్కు మత సంస్కరణ ఉద్యమంలో మూలాలు ఉన్న ఒక పంథిక్ సంస్థగా శిరోమణి అకాలీదళ్ ఆవిర్భవించింది. అయితే పంజాబ్‌లో ఖలిస్తానీ ఉగ్రవాదం సమసిపోయిన తరువాత విజయవంతంగా అధికారానికి తిరిగివచ్చిన అకాలీదళ్ రాజనీతిజ్ఞతలో ఒక పెద్ద మార్పు సంభవించింది. 1996లో ఆ పార్టీ మోగా సమావేశంలో ఒ'పంథిక్' పార్టీ నుంచి ఒక పంజాబీ పార్టీగా, ఒక మత సంబంధ—ప్రాంతీయ పార్టీ నుంచి స్వచ్ఛమైన ఒక ప్రాంతీయ పార్టీగా పరివర్తన చెందింది. సిక్కుల ప్రయోజనాలకే ప్రధానంగా ప్రాతినిధ్యం వహిస్తున్న అకాలీదళ్ అనేక సంవత్సరాలుగా ఎంతో మంది హిందువులను పార్టీ సభ్యులుగా చేర్చుకుని పలువురికి నాయకత్వ స్థానాలను కూడా కల్పించింది. అయితే ఇటీవలి పరిణామాలు అకాలీదళ్ ఒక పంథిక్ పార్టీ అని, పంజాబ్‌లో అధిక సంఖ్యాకులు అయిన సిక్కు మతస్థుల పార్టీ అని, సిక్కు మత వ్యవస్థకు అది జవాబుదారీగా ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేశాయి. ఈ మార్పును మనం అంగీకరిస్తే, సువిశాల భారతదేశాన్ని అధిక సంఖ్యాకులు అయిన హిందూ మతస్థుల ఆకాంక్షలు, అభిమతాలకు అనుగుణంగా పాలించేందుకు ఆరాటపడుతున్న శక్తులను ఎలా ఆక్షేపించగలం?

రెండో అంశం రాజ్యాంగబద్ధమైన ఔచిత్యం. రాజ్యాంగ బద్ధంగా నమోదై, గుర్తింపు పొందిన రాజకీయ పక్షం శిరోమణి అకాలీదళ్. రాజ్యాంగం ప్రవచించిన లౌకిక వాదానికి నిబద్ధమై ఉండేందుకు వాగ్దానం చేసిన రాజకీయ పార్టీ ఒక మత అత్యున్నత అధికార పీఠం ఆదేశాలను ఎలా ఔదలదాలుస్తుంది? అకాలీదళ్ పార్టీ సంవిధానంలో పార్టీ అంతర్గత వివాదాల పరిష్కారంలో అఖల్ తఖ్త్‌ను మధ్యవర్తిగా నిర్ణయించుకోవాలనే నిబంధన ఏమీ లేదు. పార్టీ వెలుపలి నుంచి సైద్ధాంతిక మార్గదర్శకత్వం, సలహాను తీసుకునే స్వేచ్ఛ ఇప్పుడు ఏ రాజకీయపక్షానికి అయినా ఉన్నది. ఒక పార్టీ నాయకత్వం మామూలుగా మతనాయకుల నుంచి సలహాలు తీసుకోవచ్చు. నిజానికి ఇప్పుడు కుల లేదా మతపరమైన సంస్థలతో సంబంధాలు ఉండి వాటి మార్గదర్శకత్వాన్ని తీసుకుంటున్న పార్టీలు ఉన్నాయి. అయితే మనం ఇప్పుడు అకాలీదళ్ విషయమై ప్రజల సమక్షంలో విచారణ నిర్వహించి, అనివార్యంగా నిబద్ధమవ్వాల్సిన తీర్పును వెలువరించడం గురించి మాట్లాడుకుంటున్నాం. రాజ్యాంగ బద్ధమైన అధికార పదవులకు పోటీపడే రాజకీయపక్షం ఒక మత సంస్థ విచారణకు అంగీకరించడం ఎలా సబబు? అఖల్ తఖ్త్ బహిరంగ విచారణ సమంజసమే అయితే భారతీయ జనతాపార్టీ వ్యవహారాలను, ఆ పార్టీ ప్రభుత్వాలను నిర్వహించడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్రను ఎలా ప్రశ్నించగలం?



■ యోగేంద్ర యాదవ్

ఇక చివరి అంశం రాజకీయ వ్యవహారాలలో అఖల్ తఖ్త్ జోక్యం చేసుకోవడంలో ఔచిత్యం ఉన్నదా? అఖల్ తఖ్త్ ఒక మత వర్గం ఆధ్యాత్మిక సంస్థ మాత్రమే కాదు, చట్టాలు, రాజ్యం నుంచి స్వతంత్రంగా వ్యవహరించి అనుయాయులపై నైతిక అధికారాన్ని నెరపే సంస్థ. అఖల్ తఖ్త్ జతేదార్‌లను నియమించేది, తొలగించేది శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) దేశీయ చట్టం ద్వారా నెలకొల్పబడిన సంస్థ ఇది. ఎస్‌జీపీసీ గానీ, అది నియమించినవారు గానీ రాజకీయాలలో జోక్యం చేసుకునేందుకు ఆ సంస్థకు సిక్కు గురుద్వారాల చట్టం—1925 ఎలాంటి అధికారాలనివ్వలేదు. మత సంబంధిత వ్యవహారాలలో మార్గదర్శకత్వం ఇవ్వడానికి మాత్రమే అఖల్ తఖ్త్ ఉన్నది. ఏవైనా సామాజిక వివాదాలలో, వివాదపడిన పక్షాలు రెండూ అంగీకరించిన పక్షంలో మధ్యవర్తిత్వం చేసి న్యాయం నిర్ణయించే అధికారం మాత్రమే ఎస్‌జీపీసీకి ఉన్నది. మతస్థులను మతం నుంచి వెలివేసేందుకు ఎస్‌జీపీసీకి గల అధికారాలపై కూడా అనేక సందేహాలు ఉన్నాయి.

ప్రస్తుత వివాదం గుణాత్మకంగా భిన్నమైనది. అన్ని అంగీకారయోగ్యమైన పరిధులను అది అతిక్రమించింది. సుఖ్‌బీర్ బాదల్‌పై బహిరంగ విచారణ ఒక రాజకీయ వ్యవహారం అఖల్ తఖ్త్ ఆయనకు సంధించిన అనేక ప్రశ్నలలో ఒక్కటి మాత్రమే మతపరమైన విషయానికి సంబంధించినది: అది 'బి–అదాబి' (సిక్కు మత పవిత్రగ్రంథమైన గురు గ్రంథ సాహిబ్‌ను అపవిత్రీకరణ వ్యవహారంపై ఆయన అసమర్థంగా వ్యవహరించారన్న ఆక్షేపణ అది). మిగతావన్నీ ప్రభుత్వంలోను, అకాలీదళ్ నాయకుడుగాను ఆయన నిర్వర్తించిన పాత్రకు సంబంధించినవి. అవి కూడా 'పంథ్'ను ప్రభావితం చేసే అంశాలే కావడం గమనార్హం. సరే, అకాలీ నేతలకు వీటిపై ఎటువంటి అభ్యంతరాలు లేవు అటువంటి జోక్యాన్ని వారు కోరారు. అయితే పూర్తిగా మత సంస్థ అయిన అఖల్ తఖ్త్ ఒక రాజకీయ పార్టీని పునర్ వ్యవస్థీకరించే అధికారాలను ఎలా సంతరించుకున్నదనేదే అసలు ప్రశ్న. ఇది ఆమోదయోగ్యమైతే బీజేపీకి ఓటు వేయమని తన అనుయాయులను డేరా సచా సౌదా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఆదేశించడంలో తప్పు ఏముంది?


అంతకంటే ఆక్షేపణీయమైనది ఈ వ్యవహారంలో చోటు చేసుకున్నది. అకాలీదళ్ పునర్ వ్యవస్థీకరణకు ఆదేశించడం ద్వారా అఖల్ తఖ్త్ ఒక రాజకీయ సంస్థ స్థాయికి పరిమితమైపోలేదా? ఇప్పుడు ప్రతి రాజకీయ సంస్థ మాదిరిగానే అఖల్ తఖ్త్ కూడా ప్రజల నిశిత పరిశీలన, నిందాత్మక ప్రచారాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. మరి ఈ పరిస్థితిలో సిక్కు సమాజంలో మత, రాజకీయ అధికారాల మధ్య విభజన లేదన్న వాదనను అఖల్ తఖ్త్ చేస్తుందా? సిక్కుల విషయంలో అది సమంజసమే అయితే, పౌర సమాజ వ్యవహారాలలో ప్రభావశీల జోక్యం చేసుకుంటున్న బాబాలు, యోగులు, స్వాములను సమర్థించేందుకు బీజేపీ సైతం అదే వాదనను ఉపయోగించుకోదా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

'తల్లి' సెంటిమెంట్‌తో చెలగాటం!

తెలంగాణ రాజకీయం మొత్తం ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం చుట్టూ తిరుగుతున్నది. ప్రజలు సతమతమయ్యే ఎన్నో సమస్యల నుంచి దృష్టి మళ్ళించడానికి ఏదో ఒక సెంటిమెంటును ఎరగా వేసి పాలక పక్షాలు ఆడే నాటకంలో ఇప్పుడు కొత్తగా ఇది చేరింది. మనం భారతదేశ మ్యాప్‌లో జాతీయ జెండాతోపాటు కిరీటధారి ఐన నిలువెత్తు మహిళను భరతమాతగా చూపుతాము. తెలంగాణ ఏర్పడక ముందు మనకు తెలుగుతల్లి విగ్రహం ఉండేది— ఒక చేతిలో మామిడాకుల కలశం, మరో చేతిలో వరికంకులతో. ఇలాంటి చిహ్నాలను స్త్రీలను గౌరవించే మన సంప్రదాయంలో భాగంగా చూడవచ్చు. అంతేతప్ప భరతమాత ఇలా ఉంటుంది, తెలుగుతల్లి ఇలా ఉంటుంది.. అనే భౌతికమైన ప్రాతిపదిక ఏదీ లేదు. ఎవరు ఏ రకమైన సెంటిమెంట్ కోసం ఈ "మాత"లను, "తల్లు"లను సృష్టించుకున్నా అవి స్ఫూర్తినిచ్చే ఊహాచిత్రాలే!

మనకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగు తల్లి మాదిరిగా తెలంగాణ తల్లి ఉండాలనే సెంటిమెంటు మొదలైంది. వాస్తవంగా తెలుగుతల్లి సమైక్యాంధ్ర తల్లి మాత్రమే కాదు, తెలుగు భాష మాట్లాడే వారందరికీ తల్లే. సరే, తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం కనుక తెలంగాణ తల్లి రూపకల్పన జరిగింది. ఒక చేతిలో మొక్కజొన్న కండె, మరో చేతిలో బతుకమ్మ, నెత్తిన కిరీటం... ఇదీ కేసీఆర్ అండ్ కో రూపొందించిన తెలంగాణ తల్లి. నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరో తెలంగాణ తల్లికి రూపకల్పన చేసింది. ఇది అత్యంత ప్రాధాన్యత గల సెక్రటేరియట్ ముందు కొలువు తీరింది.



వాస్తవానికి భరతమాత, తెలుగు తల్లి, తెలంగాణ తల్లి... ఇలా "తల్లు"లను సృష్టించే సమయంలో మనం అప్రయత్నంగానే మన పురాణాలలోని సరస్వతి, పార్వతి, లక్ష్మీదేవి.. తదితర దేవతల రూపాలను అనుకరిస్తాం. అందువల్లనే ఆ రూపాలలో కిరీటాలు, వడ్డాణాలు, హారాలు, చీరకట్టుబాట్లు వచ్చి చేరుతున్నాయి. తెలంగాణ తల్లి కూడా అందుకు మినహాయింపు కాదు. అందుకే ఏ తల్లిని మార్పు చేసినా సెంటిమెంటుకు బందీలైన ప్రజలు అంత తొందరగా జీర్ణం చేసుకోలేరు!

కాంగ్రెస్ రూపుదిద్దిన ఈ తెలంగాణ తల్లిలో రాజరికానికి చిహ్నం అయిన కిరీటాన్ని తొలగించారు. ఒక చేతిలో జొన్న, సజ్జ తదితర ధాన్యం కంకులు ఉంచి, మరో చేతిని అభయ హస్తంగా మలిచారు. ఇక్కడ కాంగ్రెస్ ఒక విషయాన్ని గుర్తించాలి. తెలంగాణ తల్లిగా ఒక రూపం కొంతకాలం పాటు ప్రచారం పొందిన తర్వాత ఆ రూపాన్ని ప్రజల మనోఫలకం నుంచి తొలగించి మరో రూపాన్ని ఒప్పించడం అంత సులభం కాదు. ఇక విగ్రహం విషయానికి వస్తే— తెలంగాణ సెంటిమెంట్‌గా సృష్టించిన విగ్రహాలు రెండింటిలోనూ వాస్తవానికి బహుజన స్త్రీ రూపం గానీ, శ్రామిక స్త్రీ రూపం గానీ లేవు. తెలంగాణ శ్రామిక స్త్రీ మట్టగోచీ పెట్టుకొని పొలంలో పురుషుడితో సమానంగా శ్రమిస్తుంది. వర్గ దృక్పథం నుండి చూస్తే— చెంగులు విరబోసుకొని చీర కట్టిన మహిళను ధనిక, జమీందారీ వర్గానికి ప్రతీకగా చూడవచ్చు. శ్రామిక స్త్రీ ఎల్లప్పుడూ మట్టగోచీ పెట్టుకొని శ్రమకు అనుకూల రూపంలో ఉంటుంది. ఇక మధ్య తరగతి మహిళ ఈ రెండు రకాల చీర కట్టుబాట్లూ పాటిస్తుంది. మధ్యతరగతి మహిళలు పనిచేసే సమయంలో శ్రామిక స్త్రీలా గోచీ పెట్టుకుంటారు, పని పూర్తి కాగానే ఉన్నత వర్గ స్త్రీలా ఉండడానికి చీర చెంగులు విరబోసుకుని ఉంటారు. వాస్తవానికి తెలంగాణా తల్లి చీరకట్టు శ్రామిక, బహుజన స్త్రీ రూపంలో ఉండడమే న్యాయం. చెప్పాలంటే యథాతథంగా చాకలి ఐలమ్మ రూపం! అది చారిత్రకంగా ప్రాధాన్యత గల రూపం కూడా. మరి అటు కేసీఆర్ అండ్ కో గానీ, ఇటు రేవంత్ బృందం కానీ తల్లికి ఒక రూపాన్ని ఇచ్చే సమయంలో దీనిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో తెలియదు.

ఇకపోతే గత ప్రభుత్వం తెలంగాణ తల్లి ఒక చేతిలో బతుకమ్మను ఉంచింది. దాన్ని తొలగించి ప్రస్తుత ప్రభుత్వం అభయహస్తం సూచికగా ఉంచింది. వాస్తవానికి ఈ రెండూ కరెక్టు కాదు. తెలంగాణలో ఆడే బతుకమ్మ పండుగకు తెలంగాణ రాష్ట్రం వచ్చాక బహుజన బతుకమ్మగా కలరింగ్ ఇచ్చారే గానీ, నాకు తెలిసి నా చిన్నతనంలో బతుకమ్మను శ్రామిక స్త్రీలు అసలు పట్టించుకునేవారే కాదు. వైశ్య, బ్రాహ్మణ, వెలమ, రెడ్డి తదితర ఉన్నత వర్గాల మహిళలు మాత్రమే బతుకమ్మ ఆడుకునేవారు. చాకళ్ళు బొచ్చెలు మోసేవారు, ముదిరాజులు తంగేడు పూలు, గునుగు పూలు సేకరించడంలో ఉండేవారు. అలా పాములు కరిచి చెరువులో మునిగి అనేకమంది బహుజనులు మృత్యువాత పడేవారు కూడా. ఇట్లాంటి బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర పుణ్యమా అని రాష్ట్ర సెంటిమెంట్‌గా మారింది. ఆ రకంగానే తంగేడు పువ్వును రాష్ట్ర పుష్పంగా మార్చుకున్నాం కూడా. ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బతుకమ్మను తొలగించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మరలా సెంటిమెంట్‌లో వేలు పెట్టినట్టయ్యింది. వాస్తవానికి భరతమాత, తెలుగు తల్లి, తెలంగాణ తల్లి... ఇలా "తల్లు"లను సృష్టించే సమయంలో మనం అప్రయత్నంగానే మన పురాణాలలోని సరస్వతి, పార్వతి, లక్ష్మీదేవి.. తదితర దేవతల రూపాలను అనుకరిస్తాం. అందువల్లనే ఆ రూపాలలో కిరీటాలు, వడ్డాణాలు, హారాలు, చీరకట్టుబాట్లు వచ్చి చేరుతున్నాయి. తెలంగాణ తల్లి కూడా అందుకు మినహాయింపు కాదు. అందుకే ఏ తల్లిని మార్పు చేసినా సెంటిమెంటుకు బందీలైన ప్రజలు అంత తొందరగా జీర్ణం చేసుకోలేరు!

• ----ఎన్. తిర్మల్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్ | editpage@andhrajyothy.com | వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

రెగ్యులరైజేషన్‌పై తీర్పు పాక్షిక ఉపశమనమే!

గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణలో నిరుద్యోగుల నిరీక్షణను, వేదనలను కాదని అక్రమంగా, అన్యాయంగా అనర్హులైన జూనియర్, డిగ్రీ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసింది. ఈ అంశంపై ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును నిరుద్యోగులు సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. రెగ్యులరైజేషన్‌లను నిలిపివేయాలని, మున్ముందు ఉద్యోగాల భర్తీని చట్ట ప్రకారం నిర్వహించాలని హైకోర్ట్ ఆదేశించింది.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయవద్దని 1994 పబ్లిక్ సర్వీస్ రూల్స్ చెప్తున్నాయి. కానీ కేసీఆర్ ప్రభుత్వం 2016లో ఈ చట్టానికి సవరణ చేస్తూ 'సెక్షన్ 10ఎ'ను చేరుస్తూ జీవో 16ను తీసుకువచ్చింది. దీన్ని పాటిస్తూ కాంటాక్ట్ కింద కొనసాగుతున్న జూనియర్, డిగ్రీ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసింది. ఎలక్షన్లో లబ్ధి కోసం, రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం నియమాలను అతిక్రమించి 5544 మందిని క్రమబద్ధీకరించింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, దీక్షలు చేశారు. వినతి పత్రాల ద్వారా నిరసన తెలియజేశారు. అయినప్పటికీ, ఇప్పుడు నిరుద్యోగుల తరపున గొంతు చించుకుంటున్న కేటీఆర్, హరీష్‌రావులతో సహా ఏ ఒక్క మంత్రి గానీ, ఎమ్మెల్యే గానీ నిరుద్యోగుల బాధ వినేందుకు సంసిద్ధత చూపలేదు. చివరగా హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. నిజానికి ఇప్పుడు హైకోర్టు తీర్పు ద్వారా కూడా నిరుద్యోగులకు పాక్షికంగానే ఉపశమనం లభించింది.

హైకోర్టు ఒకపక్క జీవో 16ను రద్దు చేస్తూ, ఇలాంటి రెగ్యులరైజేషన్ రాజ్యాంగ విరుద్ధమనీ, చట్టవిరుద్ధమనీ అంటూనే, ఇప్పటికే రెగ్యులరైజ్ అయిన వారిని కొనసాగించుకోవచ్చుననీ, వారి మేము తొలగించలేమనీ చెప్పడం నిరుద్యోగులను నిరాశకు గురిచేసింది. తప్పు అని చెప్పినప్పుడు ఆ విధానంలో రెగ్యులరైజ్ అయిన వారిని తొలగించాలి, ఆ తప్పు చేసిన వారిని శిక్షించాలి. అంతేతప్ప ఆ తప్పును కొనసాగిస్తూ పోవడం ఎందుకు? ఈ 5544 మంది కాంట్రాక్టు ఉద్యోగుల బహుళ ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పిన కోర్టు— మరి లక్షలాదిమంది నిరుద్యోగుల బహుళ ప్రజా ప్రయోజనాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? పాక్షిక న్యాయాన్ని మాత్రమే ఇస్తున్న ఈ తీర్పును సవాల్ చేస్తూ నిరుద్యోగులు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉంది.

అక్రమ దారిలో రెగ్యులరైజ్ అయిన ఉద్యోగులందర్నీ తప్పనిసరిగా తొలగించాలి. నోటిఫికేషన్ ద్వారా ఆ ఉద్యోగాలను భర్తీ చేయాలి. ఈ విషయంలో నిరుద్యోగులకు ప్రభుత్వం సహకరించాలి. ప్రభుత్వాలు ఉపాధిని చూపించలేక దేశంలో రోజు రోజుకూ నిరుద్యోగ సంక్షోభం పెరుగుతున్న ఈ కాలంలో ఎట్టిపరిస్థితిలోనూ ఏ చిన్న ఉద్యోగాన్నీ కూడా రెగ్యులరైజ్ చేయకూడదు. ఉన్న ఉద్యోగాలు మొత్తం ఇలా అక్రమ పద్ధతిలో భర్తీ అయిన తర్వాత ఇక 'ఈసారికి వారిని క్షమిస్తున్నాం' అని వదిలేస్తే నష్టపోయేది రాజకీయ నాయకులు కాదు, నిరుద్యోగులు. గ్రూప్ వన్ పరీక్షలో తప్పు జరిగిందనే కదా రెండుసార్లు రద్దు చేసి మూడోసారి విజయవంతంగా నిర్వహించింది. అప్పుడు మరి ఆ ఒక్క తప్పే కదా అని వదిలేయలేదేం? ఎన్నికల్లో ఎమ్మెల్యే అక్రమమైన పద్ధతిలో గెలిస్తే అతని అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తున్నారు కదా? ఆ న్యాయం ఇక్కడ ఎందుకు వర్తించదు?

ప్రస్తుతం ఒక్కో నోటిఫికేషన్ రావడానికే దాదాపు పదిహేనేళ్ళ సమయం పడుతున్నది. అప్పటిదాకా నిరుద్యోగులు లక్షల రూపాయలు అప్పు చేసి కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరోపక్క ప్రభుత్వాలు ఉద్యోగ నోటిఫికేషన్లు వేయడం మానేసి ఇలా నిరుద్యోగుల మధ్యనే అంతరాలను సృష్టించే స్వార్థ రాజకీయ విన్యాసాలకు పాల్పడుతున్నారు.

– మండ్ల రవి
ఉస్మానియా యూనివర్సిటీ

రేవంత్‌రెడ్డి మరో కేసీఆర్!

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో వందలసార్లు 'సన్నాసి' అనే పదప్రయోగం తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రూపాయలైనా విలువ చేసే నిర్మాణాత్మక కార్యక్రమం ఒక్కటీ చేసిన పాపాన పోలేదు. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు, బీఆరఎస్ పాలనలో కేసీఆర్ చేసిన తప్పులను యథాతథంగా కాపీ పేస్ట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలన ప్రజలకు నవ్వు తెప్పిస్తోంది. సోనియా గాంధీ కుటుంబం మెప్పు పొందడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండ్ కో ఆరాటపడుతున్న తీరు చూస్తూంటే గత బీఆరఎస్ పాలనకూ రేవంత్‌రెడ్డి పాలనకూ తేడా ఏమీ కనిపించడం లేదు.

బీఆరఎస్ పాలనలో ఏ శాసన సభ్యుడూ తను సొంతంగా పని చేస్తానని ఎప్పుడూ చెప్పలేదు. అన్నీ కేసీఆరే చూస్తాడన్న భ్రమను కల్పించారు. ఇప్పుడు అదే స్థానం రేవంత్‌రెడ్డి దక్కించుకున్నాడు. ఎవరు చూసినా రేవంత్‌రెడ్డి 'ఆహా ఓహో' అంటూ చిందులేస్తున్నారు. మధ్య మధ్యలో భారతీయ జనతా పార్టీ ఎక్కడ ముందుకు వస్తోందో అని భయపడి లేని అక్రమ సంబంధాలు అంటగడుతున్నారు. గత ఏడాది నుంచి కాంగ్రెస్ పార్టీ ఊదరగొడుతున్న ఫోన్ టాపింగ్ కేసులు, కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన అవకతవకలు, రోడ్డు లీజ్ విషయం, అక్రమంగా అనుమతులు ఇచ్చిన కారు రేస్ కేసు, హైదరాబాదులో జరిగిన భూ దందా, ధరణి అక్రమాలు, జన్వాడ ఫామ్ హౌస్ కేసులలో ఒక్కటి కూడా నిరూపించి శిక్షించలేకపోయారు. పైగా కేసీఆర్ కుటుంబంపై ఈగ వాలనివ్వడం లేదు. కేటీఆర్ బరితెగించి ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఎందుకు మిన్నకుండిపోయింది? కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్లు అమ్ముకున్నట్టే కేసీఆర్ కుటుంబానికి అమ్ముడుపోయిందని ఢిల్లీ వర్గాల భోగట్టా.

గత కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్లు అప్పు చేసిందని ప్రతి రోజూ నెత్తీ నోరు కొట్టుకొని మొత్తుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు సాధ్యమో కాదో ఆలోచించకుండా ఆరు గ్యారెంటీల హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచింది. ఆ గ్యారంటీలకు ఇప్పటికీ దిక్కులేదు. మరి మూసీ ప్రక్షాళనకు, సుందరీకరణకు లక్షా నలభై వేల కోట్లు ఎక్కడ నుంచి తెచ్చి పెడతారు? దాని పూర్తి ప్రయోజనం ఏమిటన్న దానిపై ప్రభుత్వానికి ఇంతవరకు క్లారిటీ లేదు. హైదరాబాద్‌ను కబ్జా చేసిన సోకాల్డ్ రియల్టర్ల భరతం పట్టకుండా పేదవాళ్ల గుడిసెల పైకి హైడ్రాను పంపించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు హైడ్రా షో పుటప్ కార్యక్రమంగా మారిపోయింది. హైదరాబాద్ నగరాన్ని ఆక్రమించుకున్న ప్రో—బీఆరఎస్ రియల్టర్ల నుండి ఎలాంటి సంకేతాలు వచ్చాయో తెలియదు గాని ఇప్పుడు హైడ్రా గొడవ హైదరాబాద్‌లో లేదు. మరోవైపు ఫోర్త్ సిటీ అంటూ చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. ఉన్న సిటీలో సౌకర్యాల కొరత ఉంటే, కొత్త సిటీ అభివృద్ధి అంటూ ప్రణాళిక లేకుండా ఆర్థిక వనరులు లేకుండా ముందుకు వెళ్లడం విస్మయాన్ని కలిగిస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హైప్ సృష్టించిన అలూరు ఎలక్ట్రాన్ సిటీ లాగా ఇది కూడా వాళ్ళ అస్మదీయులకు డబ్బు చేకూర్చే పథకంగా మారబోతుందా?

ఇక లగచర్ల ఘటనలో అక్కడ ఫార్మా కంపెనీల సంగతి ఏమిటో గాని, అధికారులపై దాడి రాజకీయ కోణంగా మారిపోయి రెండు పార్టీల మధ్య యుద్ధంగా మారింది. కాంగ్రెస్, బీఆరఎస్ నాయకులు పోటీపడి అక్కడ సంఘటనలపై రాజకీయాలు చేశారు. తమ్ముడు ఒక పార్టీ నుంచి కుట్ర చేశాడని జైలుకు వెళ్తే, ఆయన అన్న అధికార పార్టీలో ప్రభుత్వ విప్‌గా నియమింపబడతాడు. ఇది ఎంత విచిత్రమైన రాజకీయ విన్యాసమో ఊహకు కూడా అందదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది కోసమే ఆ ఫార్మాసిటీ అని ఆగమేఘాల మీద ఢిల్లీ వెళ్లి హడావిడి చేసిన కేటీఆర్ ఇక్కడ కోర్టులో గాని, పోలీస్ స్టేషన్లో గాని ప్రభుత్వం మీద ఎలాంటి ఫిర్యాదూ ఇవ్వలేదు. అంటే ఇది మనఃపూర్వకంగా చేసింది కాదన్నమాట. ప్రతి రోజూ ఏదో ఒక రాజకీయ అంశాన్ని తెరపైకి తెచ్చి అసలు విషయాలను మరుగుపరిచి ఒక సంవత్సరం పాటు కాలక్షేపం చేశారు.



బీఆరఎస్ పాలనలో ఏ శాసన సభ్యుడూ తను సొంతంగా పని చేస్తానని ఎప్పుడూ చెప్పలేదు. అన్నీ కేసీఆరే చూస్తాడన్న భ్రమను కల్పించారు. ఇప్పుడు అదే స్థానం రేవంత్‌రెడ్డి దక్కించుకున్నాడు. ఎవరు చూసినా రేవంత్‌రెడ్డి 'ఆహా ఓహో' అంటూ చిందులేస్తున్నారు. మధ్య మధ్యలో భారతీయ జనతా పార్టీ ఎక్కడ ముందుకు వస్తోందో అని భయపడి లేని అక్రమ సంబంధాలు అంటగడుతున్నారు.

గతంలో కేసీఆర్ పట్ల పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇతర నాయకులు విధేయత చూపినట్లుగానే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చుట్టూ ఒక కోటరీ ఏర్పడింది. రోజూ తిరుగుతున్నా ఏమి గ్రహించలేకపోతున్నాడు. అర్బన్ నక్సలైట్లను విద్యావేత్తలుగా, సలహాదారులుగా, విద్యా కమిషన్ సభ్యులుగా నియమించాడు. మాటిమాటికీ ఢిల్లీకి చక్కర్లు కొడుతూ అధిష్ఠానానికి డబ్బు మూటలు మోస్తున్నాడన్న అపప్రథ మూటగట్టుకుంటున్నాడు. కాంగ్రెస్ పార్టీ పరిపాలిస్తున్న రాష్ట్రాలలో కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ అధిష్ఠానికి ఏటీఎంలుగా మారాయని ఢిల్లీ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఇక్కడ అధికారంలో ఉండాలంటే సామంత రాజు లాగా కప్పంగట్టే పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాకుండా ప్రతి చిన్న నిర్ణయానికి రేవంత్ ఢిల్లీ బాట పట్టాల్సి వస్తున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సీల్డ్ కవర్ ముఖ్యమంత్రులతో నడిచేవి. ఇప్పుడు డబ్బు మూటలతో నడుస్తున్నాయని ఢిల్లీ వీధులలో చెవులు కొరుక్కొంటున్నారు. ఒకవేళ రేవంత్‌రెడ్డి అందుకు ఉపయోగపడకపోతే ఆ పదవి ఉంటుందో ఊడుతుందో తెలియదు.

అలాగే గతంలో కేసీఆర్ రక్షక వాహనాలను ఇచ్చి కమాండ్ కంట్రోల్ సృష్టించి పోలీసు వ్యవస్థను తన కనుసన్నల్లో పెట్టుకొని ఫోన్ టాపింగ్‌కు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అందులో అన్ని పార్టీల బాధితులూ ఉన్నారని ఎన్నోసార్లు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా ప్రతిపక్షం మాటల్ని వింటుందన్నది ప్రధాన ఆరోపణ. ఇంతవరకు ప్రభుత్వం నుంచి సరైన వివరణ లేదు. మరోవైపు రాష్ట్రంలో విచ్చలవిడిగా హత్యలు, మానభంగాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఏ ప్రత్యేక చర్యా తీసుకోవడం లేదు. డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పాడు. దాన్ని అరికట్టేందుకు ఆ వ్యాపారంలో ఉన్నట్లయితే రాజకీయవేత్తలను శిక్షిస్తామని మాత్రం చెప్పలేదు.

యథేచ్ఛగా, అక్రమంగా ఇసుక, మట్టి దోపిడీ జరుగుతూనే ఉంది. గత బీఆరఎస్ నాయకులంతా వాటినమ్ముకొని అక్రమ రాజకీయానికి అలవాటు పడ్డారన్న సంగతి ముఖ్యమంత్రికి తెలియంది కాదు. వాళ్లను శిక్షించడం పక్కన పెట్టి, తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ముత్యాలమ్మ దేవాలయంపై జరిగిన దాడి తీవ్రంగా ఖండించదగినది. ఇతర రాష్ట్రాల నుంచి మతోన్మాద ప్రచారం చేసేవాళ్లు తెలంగాణలో అక్రమంగా చొరబడి తీవ్రవాద భావాలు వ్యాప్తి చేస్తున్నా ప్రభుత్వం అదుపు చేయలేకపోతున్నది. ఓవైసీతో లోలోపల జరిగిన ఒప్పందమే దీనికి ప్రధాన కారణం.

రైతు భరోసా అంటూ దాటవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పత్తి కొనుగోళ్ల విషయంలో చేసిన తాత్సారం వల్ల రైతులకు విపరీతమైన నష్టం వాటిల్లింది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు అస్మదీయులకే ఒరిగేలా మారింది. అది బీఆరఎస్ పార్టీ దళిత బంధు స్కీం లాగా మారిపోయింది. అసైన్మెంట్ భూములకు ప్రత్యేక చట్టం తెచ్చి హక్కు కల్పిస్తామని, కౌలుదారులకు సహాయకారిగా ఉంటామని చెప్పిన కాంగ్రెస్ వాగ్దానాలు ఈ రోజుకూ నెరవేరలేదు. ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కొన్ని ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి మురిసిపోతుంటే చూసిన వాళ్ళు ముక్కున వేలేసుకుంటున్నారు. తెలంగాణ వచ్చి పదేళ్లయిన తర్వాత ఇప్పుడు విగ్రహాల పంచాయతీ కొత్తగా సృష్టించి లేని భావోద్వేగాలను ప్రజల్లో కల్పించాలని ఇరు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. కేసీఆర్ పాపాలు కాంగ్రెస్‌కు వరంగామారితే, కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో లేకపోవడం రేవంత్‌రెడ్డికి వరంగా మారిపోయింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఏడాది పరిపాలన ప్రోగ్రెస్ కార్డును ఒక్కసారి పరిశీలించుకుని ముందుకు వెళితే మంచిది.



■ ఎం. రఘునందన్‌రావు
మెదక్ పార్లమెంటు సభ్యులు



టైగర్ టెన్షన్..

ములుగు అరణ్యంలో పెద్దపులి సంచారం

- రెండు రోజులుగా భయం భయం
- గోదావరి దాటి మల్లూరు అడవిలోకి..
- అటు నుంచి కిన్నెరసాని వైపు పయనం
- ఏటా ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి వచ్చిపోతున్న పులులు
- 2021లో వేటగాళ్ల ఉచ్చుకు ఓ ఆడ పులి బలి

8


(ఫైల్)


మంగపేట మండలంలోని తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలోని వాగువద్ద పెద్దపులి పాదముద్రలు

పెద్దపులి గాండ్రింపులతో ములుగు అడవులు దద్దరిల్లుతున్నాయి. దాని సంచారం నిజమని తేలడంతో అటవీ గ్రామాలు భయంతో వణికిపోతున్నాయి. ఏటా ఇలా ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి ఇక్కడి అరణ్యంలోకి వచ్చివెళుతున్నా.. ఈ సారి వచ్చిన పులి ఎక్కడ తమపై దాడి చేస్తుందోననే ఆందోళన గ్రామస్థుల్లో నెలకొంది. కానీ, ఆ పులి నెమ్మదిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యం వైపు వెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే మళ్లీ వెనక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయనే సమాచారంతో మళ్లీ టెన్షన్ మొదలైంది. రెండు రోజులుగా పెద్ద పులి జాడలతో జనం భయభయంగా గడుపుతున్నారు.

- ములుగు/మంగపేట (ఆంధ్రజ్యోతి)

మాల, మాదిగల మధ్య చిచ్చుపెడుతున్న సీఎం

- ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి
- మాజీ ఉప ముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

హనుమకొండ టౌన్, డిసెంబరు 11: తెలంగాణ రాష్ట్రంలో మాల, మాదిగల మధ్య సీఎం రేవంత్‌రెడ్డి చిచ్చు పెడుతున్నాడని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. అసెంబ్లీలో జరుగుతున్న శీతాకాల సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. వర్గీకరణ చేపట్టకుండా ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తుండటంతో మాదిగలు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయ్యాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు గతంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపినట్లు రాజయ్య గుర్తు చేశారు. వరంగల్ జిల్లాలో 1994 నుంచి 2024 వరకు 30 ఏళ్ల దళిత హక్కులను కడియం శ్రీహరి దోచుకుతింటున్నారని విమర్శించారు. కడియం శ్రీహరి ఒక్క మాదిగ బిడ్డకు న్యాయం చేయలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో కడియం శ్రీహరి మంత్రిగా పని చేసిన సమయంలో మాదిగలను ఎన్‌కౌంటర్ చేయించాడని ఆరోపించారు. పదేండ్లు బీఆర్ఎస్‌లో ఉండి పార్టీకి నమ్మకద్రోహం చేసి, తన బిడ్డ కోసం స్వార్థంతో కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వెళ్లాడన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల నిరీక్షణకు తెర

బస్టాండ్ కోసం ప్రతిపాదించిన కాజీపేట ఆర్వోబీ పక్కన ఉన్న రైల్వే శాఖకు చెందిన స్థలం



- కాజీపేటలో బస్‌స్టేషన్ ఏర్పాటుకు అడుగులు
- పరిశీలనలో ఆర్వోబీ పక్కనున్న రైల్వేశాఖ స్థలం
- ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే నాయిని చర్చలు
- ఎకరం స్థలం ఇవ్వడానికి రైల్వేశాఖ అంగీకారం
- త్వరలో తీరనున్న కాజీపేట వాసుల కల
- బస్టాండ్ కోసం మూడు దశాబ్దాలకుపైగా ఉద్యమం

కాజీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి ముందడుగు పడింది. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఎకరం స్థలం ఇవ్వడానికి రైల్వే అధికారులు సూత్రపాయంగా అంగీకరించారు. బస్టాండ్ నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలిసి పులుమార్లు విన్నవించారు. దీంతో కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందుకు కావాల్సిన స్థలం కోసం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్‌ను కలిసి చర్చలు జరిపారు. సమీపంలోని రైల్వే ఖాళీ స్థలంలో ఒక్క ఎకరం ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.. రైల్వే అధికారులు అధికారికంగా స్థలం అప్పగిస్తే బస్టాండ్ నిర్మాణం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

మూడు దశాబ్దాలుగా ఉద్యమం

కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని మూడు దశాబ్దాలుగా స్థానికులు పోరాటం చేస్తున్నారు. 1990లో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు కూడా కాజీపేట పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ ప్రైవేట్ స్థలంలో బస్టాండ్ నిర్మించాలని ఉద్యమం చేశారు. వాల్‌పోస్టర్లు, ప్రకటల ద్వారా డిమాండ్ చేశారు. అలాగే పలు రాజకీయ పార్టీలు సైతం బస్టాండ్ నిర్మించాలని పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. ఆపై ఎన్నికల్లో గెలిచి రాజకీయంగా పదవులు అనుభవించారే కానీ.. బస్టాండ్ నిర్మాణాన్ని విస్మరించారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒకరకంగా అన్ని రాజకీయ పార్టీలకు బస్టాండ్ ఉద్యమం ఒక ఎన్నికల అస్త్రంగా మారింది.

ఎన్నో సమస్యలకు పరిష్కారం

కాజీపేటలో బస్టాండ్ లేకపోవడంతో స్థానికులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కాజీపేటలో బస్టాండ్ లేకపోవడంతో ప్రధానరహదారిపై చిన్న రేకుల షెడ్‌వద్ద బస్‌స్టాండ్ కొనసాగుతోంది. ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ.. నిత్యం ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాజీపేటలో రైలు తప్పిపోయిన ప్రయాణికులు, చుట్టుపక్కల సుమారు 50 గ్రామాలకు బస్సుల్లో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. వరంగల్ - హైదరాబాద్ ప్రధాన రహదారి కావడంతో బస్సులు ఆగినప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్టాండ్ నిర్మిస్తే ప్రయాణికులు సౌలభ్యంతో పాటు రవాణాశాఖకు లాభదాయకంగా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

కాజీపేటలో బస్టాండ్ కట్టించి తీరుతాం..

నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

కాజీపేటలో బస్టాండ్ ఎలాగైనా నిర్మించి తీరుతా.. రైల్వే జీఎం, డీఆర్ఎంను పలుమార్లు కలిసి చర్చించా. ఎట్టకేలకు కాజీపేట ఆర్వోబీ సమీపంలో ఉన్న రైల్వే ఖాళీ స్థలం ఒక ఎకరం ఇవ్వడానికి రైల్వే అధికారులు ఒప్పుకున్నారు. అయితే స్థలానికి బదులు మరో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన స్థలం ఇవ్వడమా, లేక మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేయడమా, లేదా లీజుకు తీసుకునే విషయాలపై రైల్వే అధికారులతో చర్చలు జరుగుతున్నాయి. అవి త్వరలో ఒక కొలిక్కి వస్తాయి. ఎన్నో యేళ్లుగా కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని కాజీపేట వాసుల డిమాండ్. గతంలో బస్టాండ్‌పై ఎందరో రాజకీయాలు చేసి ఉద్యమాలు చేపట్టి తర్వాత మరిచిపోయారు. ఎన్నికల ముందు కాజీపేటలో బస్టాండ్ నిర్మిస్తామని హామీ ఇచ్చా. ఆరు నూరైనా కాజీపేటలో బస్టాండ్ కట్టించి తీరుతాం.



కాజీపేటలో బస్సుల రాకపోకలు సాగిస్తున్న ప్రస్తుత బస్టాండ్

వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన కొండా సురేఖ, వేం నరేందర్‌రెడ్డి

- ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- హైదరాబాద్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం

8

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పకడ్బందీగా సేకరించాలి

- ప్రతీ 500 ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు ఒక సర్వేయర్
- వీసీలో కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం

కోడెల వ్యవహారంలో కదిలిన డొంక

- పోలీసు విచారణలో వెలుగులోకి విస్తుపోయే నిజాలు
- అక్రమదందా కోసమే సొసైటీ ఏర్పాటు చేసినట్టు గుర్తింపు
- విస్మయం వ్యక్తం చేస్తున్న రాజన్న భక్తులు

6

పెళ్లికి వచ్చి మృత్యు ఒడికి..


విష్ణు (ఫైల్)

- మాధన్నపేట చెరువులో పడ్డ కారు
- ఊపిరాడక నర్సింహులపేట ఏఈవో మృతి
- కారులో నుంచి దూకి ప్రాణాలు దక్కించుకున్న మరొకరు
- రెండు నెలల్లో ఏఈవో వివాహం.. అంతలోనే విషాదం

నర్సంపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవలనే ఓ యువతితో నిశ్చితార్థం.. మరో రెండు నెలల్లో వివాహం.. ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి.. ఈ క్రమంలో స్నేహితుడికి సోదరుడి వివాహానికి వచ్చిన ఆ యువకుడిని అనుకోని ప్రమాదం వెంటాడింది. స్నేహితులతో సంతోషంగా గడుపుదామని చెరువు కట్టకు వెళ్లగా చెరువే మృత్యువై మింగేసింది. కట్టమీద కారులో వెళుతుండగా అదుపు తప్పి పడిపోగా ఊపిరాడక మరణించాడు. ఇదే ప్రమాదంలో మరొకరు కారులో నుంచి బయటకు దూకి ప్రాణాలను దక్కించుకున్నారు. ఈ ప్రమాదం బుధవారం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామ శివారులోని మాధన్నపేట చెరువులో ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల వెంకన్న - పద్మ దంపతుల రెండో కుమారుడు మిర్యాల విష్ణు (27) ఇదే మండలంలో వ్యవసాయ శాఖలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని కమలాపురం శివారులోని సత్యం ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన తన స్నేహితుడు కానిస్టేబుల్ ప్రణీత్ సోదరుడి వివాహానికి హాజరయ్యాడు. విష్ణుతో పాటు నర్సింహులపేటకు చెందిన స్నేహితులు ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వీరేందర్‌తో పాటు మరికొందరు హాజరయ్యారు. వివాహానంతరం ఫంక్షన్‌హాల్‌కు దగ్గరలోనున్న మాధన్నపేట చెరువు కట్ట వద్దకు సేదతీరేందుకు

మిగతా 6వ పేజీలో...


చెరువులోకి దూసుకెళ్లిన కారును బయటకు తీస్తున్న దృశ్యం

డ్రగ్స్‌తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

- తల్లిదండ్రుల ఆశలను విద్యార్థులు నెరవేర్చాలి
- కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- కేయూలో ర్యాంగింగ్, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు



యాంటీ ర్యాంగింగ్, డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, పీసీ అంబర్‌కిశోర్‌ఝా

కేయూ క్యాంపస్, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. బుధవారం కేయూ ఆడిటోరియంలో వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షతన కేయూ జాతీయ సేవా పథకం, స్టూడెంట్ వేల్ఫేర్ సెంటర్ సంయుక్త నిర్వహణలో విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ హాజరయ్యారు.

ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి విద్యార్థునుద్దేశించి ప్రసంగిస్తూ.. కాకతీయ యూనివర్సిటీ ర్యాగింగ్, డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్ అని ప్రకటించారు. యువత డ్రగ్స్‌తో స్వల్పకాలిక ఆనందానికి బానిసలు కావొద్దని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు మార్గదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు సంపూర్ణ అభివృద్ధిని, నైపుణ్యాలను సాధించాలని వివరించారు. ర్యాగింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అన్నారు. మాదక ద్రవ్యాలరహిత జీవనశైలికి అంబాసిడర్లుగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు నిలవాలని పిలుపునిచ్చారు.

ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్‌తో పాటు పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొనాలని సూచించారు. యువత బాధ్యతతో మెలగాలని ఉద్బోధించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. వర్సిటీలో నూతన విద్యార్థులకు గౌరవభావంతో స్వాగతం పలకాలని సూచించారు. విద్యార్థులందరూ కుటుంబంలాగా కలిసుండాలని కోరారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని హితవు పలికారు. ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టాలన్నారు. ర్యాగింగ్‌తో పాటు డ్రగ్స్ తీసుకుంటే చట్టపరంగా కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు. వర్సిటీలో చదువులపై శ్రద్ధ వహించాలని చెప్పారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను బలిచేయవద్దని కోరారు. అధ్యాపకులు, ఉద్యోగులు ఎల్లప్పుడూ విద్యార్థుల ప్రవర్తనను గమనించాలని సూచించారు.

యాంటీ నార్కోటిక్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ డ్రగ్స్‌తో అనర్థాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో విద్యార్థులకు వివరించారు. సదస్సులో డ్రగ్స్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ జి.హనుమంతు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, క్యాంపస్ కళాశాల వివిధ విభాగాధిపతులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ భారవి శర్మ, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ సంకినేని వెంకట్, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ కుమార్, కేవీఎస్ నరేందర్, కల్యాణితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో అతిథులందరికీ కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి శాలువా, పుష్పగుచ్ఛం, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల నృత్యాలు సభికులను అలరించాయి. కళాకారుల ఆట, పాటలు విద్యార్థుల్లో నూతన ఆలోచనలను రేకెత్తించాయి.

లే అవుట్ పర్మిషన్లు ఉంటేనే రిజిస్ట్రేషన్లు

సబ్ రిజిస్ట్రార్ ఆనంద్

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: నాన్ లే అవుట్ ప్లాట్లు ఎందుకు రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు..?

సబ్ రిజిస్ట్రార్: ప్రభుత్వం 257 జీవో ప్రకారం నాన్ లే అవుట్ భూములను రిజిస్ట్రేషన్ చేయడం లేదు. ఒకవేళ రిజిస్ట్రేషన్‌లు చేయాలంటే లింకు డాక్యుమెంటులు ఉండాలి.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే ఎలాంటి భూమి పత్రాలు ఉండాలి..?

సబ్ రిజిస్ట్రార్: ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేయాలంటే 58, 59 జీవోల ప్రకారం ప్రభుత్వ అనుమతితో డబ్బులు చెల్లించిన వాటికి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో రిజిస్ట్రేషన్‌లు తగ్గడానికి గల కారణాలు ఏమిటి..?

సబ్ రిజిస్ట్రార్: నాన్ లే అవుట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్‌లు చేయకపోవడం ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్ భూములు, అనుమతులు లేని వెంచర్లు రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు.

ఆంధ్రజ్యోతి: రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మధ్యవర్తులను ఆశ్రయించవలసిందేనా..?

సబ్ రిజిస్ట్రార్: డాక్యుమెంట్లు తయారుచేసి నేరుగా నోటరీతో మీ-సేవలో దరఖాస్తు చేసుకుంటే సరైన పత్రాలు ఉంటే రిజిస్ట్రేషన్‌లు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: రిజిస్ట్రేషన్ అధికారుల పేరు చెప్పి దళారులు డబ్బులు వసూలు చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.. దానిపై మీ అభిప్రాయం ఏవి ఎటి..?

సబ్ రిజిస్ట్రార్: రిజిస్ట్రేషన్ అధికారులు పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే నేరుగా కార్యాలయంలో అధికారులను కలిసి ఫిర్యాదు చేయాలి. దళారులను ఎవరు ఆశ్రయించవద్దు.

- హనుమకొండ టౌన్

దేశ, ధర్మ రక్షణ కోసం యువత సంసిద్ధం కావాలి

సేవా సురక్షా సంస్కార్ లక్ష్యంగా ముందుకు సాగాలి

అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ సంఘటన్ కార్యదర్శి మిలింద్ పరాండే

భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వేలాది మంది త్రిశూల్ దీక్ష ప్రతిజ్ఞ



త్రిశూల్ దీక్షలో ప్రసంగిస్తున్న అంతర్జాతీయ కార్యదర్శి మిలింద్ పరాండే

వరంగల్ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ, ధర్మ రక్షణ కోసం సేవా సురక్షా సంస్కార్ లక్ష్యంతో యువతలో స్ఫూర్తి నింపి సంసిద్ధంగా ముందుకు సాగాలని అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ సంఘటన్ కార్యదర్శి మిలింద్ పరాండే పిలుపునిచ్చారు. బుధవారం గీతా జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హిందూ ఐక్యతను చాటే భజరంగ్‌దళ్ త్రిశూల్ దీక్ష ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని వరంగల్ భద్రకాళి దేవాలయం సమీపంలోని కీర్తి గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మిలింద్ పరాండే మాట్లాడుతూ.. దేశ సంస్కృతిని, దేశాన్ని విదేశీ దాడుల నుంచి కాపాడి రక్షించుకున్న ఛత్రపతి శివాజీ మహారాణా ప్రతాప్ వంటి హిందూ వీరుల పోరాటపటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీతామాతను అపహరిస్తే లంకా దహనం జరిగిందని, ద్రౌపదికి అవమానం జరిగితే మహాభారత సంగ్రామం చోటు చేసుకుందని, లవ్ జిహాద్ పేరుతో హిందూ స్త్రీల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు.

భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల్ల సత్యం మాట్లాడుతూ.. సాధు సంతుల వీహెచ్‌పీ నేతల అలుపెరుగని పోరాటం, హిందూ సమాజం ఐక్యతతోనే అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. ధర్మ రక్షణ కోసం భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. త్రిశూల్ దీక్ష సందర్భంగా వేలాది మంది భజరంగ్‌దళ్ కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు.

భజరంగ్‌దళ్ కార్యకర్తలు భద్రకాళి దేవాలయం నుంచి ఎంజీఎం సెంటర్, పోచమ్మ మైదాన్, మండి బజార్, బట్టల బజార్ మీదుగా భద్రకాళి ఆలయం వరకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వీహెచ్‌పీ ప్రధాన్ బోదనపెల్లి నర్సింహమూర్తి, పి.లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాలకొండ భాస్కర్‌రావు, వీహెచ్‌పీ వరంగల్ జిల్లా విభాగ్ నందాల చందర్‌బాబు, వరంగల్ మహానగర్ అధ్యక్షుడు కేశిరెడ్డి జైపాల్‌రెడ్డి, క్షేత్ర భజరంగ్‌దళ్ సంయోజక్ వీరకుమారస్వామి, శివరాములు, శ్రీరామ్ ఉదయ్‌కుమార్, అల్లకట్ల సాయికుమార్, బండి రోహిత్ యాదవ్, ఎలంగదుల రాజు తదితరులతో పాటు దాదాపు 3వేల మంది భజరంగదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మిలింద్ పరాండే

భజరంగ్‌దళ్ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ సంఘటన్ కార్యదర్శి మిలింద్ పరాండే బుధవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రొటోకాల్ ప్రకారం అర్చకులు మిలింద్ పరాండేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మిలింద్ పరాండేను దేవాదాయ శాఖ డీసీ కాంతారావు, ఈవో శేష భారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, అర్చకులు భద్రకాళి శేషులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన తేజ కొత్త మిర్చి ధర

క్వింటాకు రూ.15వేలు

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో తేజ మిర్చి (కొత్తది) ధర రోజు రోజుకు పెరుగుతోంది. నాలుగు రోజులుగా చూస్తే రోజు రూ.500 చొప్పున పెరుగుతూ వస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మార్కెట్‌కు సుమారు 40 బస్తాల కొత్త తేజ మిర్చి అమ్మకానికి రాగా వ్యాపారులు క్వింటాకు రూ.15వేల చొప్పున కొనుగోలు చేశారు. అదే విధంగా తేజ మిర్చికి క్వింటాకు రూ.12వేలు, తేజ ఏసీ మిర్చికి రూ.16వేలు, వండర్‌హాట్ మిర్చికి రూ.14,500, యూఎస్-341 మిర్చికి 13,500ల ధర పలికింది. పత్తిని సీసీఐ రూ.7521 చొప్పున కొనుగోలు చేయగా, వ్యాపారస్థులు రూ.6935 చొప్పున ఖరీదులు చేశారు.

బంధన్ ఆస్పత్రికి బల్దియా నోటీసులు జారీ

వారంలో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరిపి నడుపుతున్న బంధన్ ఆస్పత్రి యాజమాన్యానికి బల్దియా అధికారులు షోకాజు నోటీజులు జారీ చేశారు. నగర ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో బుధవారం షోకాజు నోటీసులు ఇచ్చినట్టు బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. భవన నిర్మాణానికి ముందు ప్లాన్‌లో స్టిల్ట్‌కు అనుమతులు తీసుకుని అందులో పార్కింగ్‌కు బదులుగా నిర్మాణాలు చేపట్టినట్టు అధికారులు వెల్లడించారు. అంతే కాకుండా పెంట్ హౌస్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారని తెలిపారు. అలాగే బిల్డింగ్ నిర్మాణంలో కూడా డీవియేషన్ ఉందని అధికారులు గుర్తించినట్టు తెలిపారు. అధికారులు ఇచ్చిన షోకాజు నోటీసుకు వారంలోగా వివరణ ఇవ్వాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

ముస్లిం యువతకు ఉచిత వివాహ పరిచయ వేదిక

వడ్డెపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సియాసత్, మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఫోరం జిల్లా కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్ధిఖీ తెలిపారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బీ, పీజీ, డిగ్రీ, బీఎడ్, ఇంటర్, ఎస్సెస్సీ, ఆలీం, హఫీజ్, టెక్నికల్ తదితర విద్యార్హతలు గల వారు తమ బయోడెటాతో పాటు రెండు పోస్టుకార్డు సైజు ఫొటోలతో తల్లిదండ్రులతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల యువతీ, యువకులు హాజరవుతారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు 9908763454/9885374872లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమాశంలో ఫోరం ప్రతినిధులు సయ్యద్ అక్బర్, మహ్మద్ నయీమొద్దీన్, మీర్జా నదీంబేగ్, పర్వీన్ బేగం, ఆయేషాబేగం, నుస్రిత్ జహాన్, మొహిసినా ఆరీఫ్, అజారొద్దీన్, ఖైరూల్, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు భగవద్గీత

రుద్రేశ్వరాలయంలో వైభవంగా గీతా జయంతి ● టీటీడీ ఆధ్వర్యంలో గీతా పఠన పోటీలు, బహుమతులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్త మానవాళి మనుగడకు భగవద్గీత ఎంతో దోహదం చేస్తుందని, సాహిత్య ప్రపంచంలో అపూర్వ గ్రంథం భగవద్గీతేనని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకురాలు కనకధారాస్తోత్రం వెలువరించిన కాకినాడకు చెందిన చల్లా అరుంధతేశ్వరి అన్నారు. మార్గశిర శుద్ధ ఏకాదశి బుధవారం పవిత్ర గీతా జయంతిని పురస్కరించుకొని వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. తొలుత శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రతిష్ఠించి పుష్పార్చనతోపాటు నీరాజన మంత్రపుష్పం చేసిన అనంతరం వరంగల్ శివానందల హరి ట్రస్టు సభ్యులు వందమందికి పైగా భగవద్గీతలోని 18 అధ్యాయాల ముఖ్య శ్లోకాలను శ్రావ్యంగా పారాయణం చేశారు.

ఈ సందర్భంగా చల్లా అరుంధతేశ్వరి మాట్లాడుతూ.. మానవుడిలో సంపూర్ణ వికాసాన్ని కలిగించి పరిపూర్ణ వ్యక్తిగా శక్తిగా రూపొందించే సాధనం భగవద్గీత అన్నారు. గీతా పారాయణం చేసిన వ్యక్తి సన్మార్గంలో పయనిస్తూ ఇతరులకు మార్గదర్శనం చేస్తారని ఆమె చెప్పారు. శ్రీకృష్ణ పరమాత్మ అనేక యోగాలను గురించి గీత ద్వారా ఉపనిషత్తుల సారం, సమన్వయ స్వరూపం మానవుడిని ఉన్నతుడిగా తీర్చిదిద్దే అమృత భాండం గీతాసారమని అన్నారు. మనిషి జీవన్ముక్తుడు కావడానికి గీత దివ్య ఔషధమని చెప్పారు. ఈ గ్రంథం ప్రతీ ఇంటా కరదీపికగా వెలుగొందాలని ఆమె ఆకాంక్షించారు. టీటీడీ ధర్మప్రచారక్ పరిషత్ సమన్వయకుడు రావిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మానవులందరికీ భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. గీతా పారాయణం చేసిన చిన్నారులందరికీ గంగు ఉపేంద్రశర్మ దుశ్శాలువాలతో సత్కరించారు. సౌందర్యలహరి సభ్యులు విశాలక్ష్మి, శ్రీదేవి, కవిత, చంద్రశేఖర్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



వేయిస్తంభాల ఆలయంలో గీతా పారాయణం చేస్తున్న మహిళలు

టీటీడీ ఆధ్వర్యంలో..

టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ పాఠశాలలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. సుమారు 150 మందికిపైగా విద్యార్థులు పాల్గొనగా జూనియర్స్ విభాగంలో ఎం.అద్వైత్, కె.కార్తీక్, ఎ.సాయిప్రసన్న, సీనియర్స్ వి.అక్షయ, కె.కౌశిక్, సీహెచ్. అభిరాంలు విజేతలుగా నిలిచారు. వీరికి టీటీడీ డీపీపీ కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి ప్రశంసపత్రాలతోపాటు శ్రీమద్రామాయణం గ్రంథాలను బహూకరించారు. దేవిరెడ్డి అంజిరెడ్డి, కె. అశోక్‌కుమార్, పోశాల శ్రీనివాస్, తదితర ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు, సంస్కృత అధ్యాపకురాలు జోష్న తదితరులు పాల్గొన్నారు.

కేయూ పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షల వాయిదా

కేయూ క్యాంపస్, డిసెంబరు 11, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిసెంబరు 18 జరగాల్సిన పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలన్నీ నిరవధికంగా వాయిదావేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు పరీక్షల నిర్వహిస్తామనే విషయాన్ని తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. విద్యార్థులందరూ గమనించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు కోరారు.

కోడెల వ్యవహారంలో కదిలిన డొంక

- పోలీసు విచారణలో వెలుగులోకి విస్తుపోయే నిజాలు
- అక్రమదందా కోసమే సొసైటీ ఏర్పాటు చేసినట్టు గుర్తింపు
- విస్మయం వ్యక్తం చేస్తున్న రాజన్న భక్తులు

గీసుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'తీగలాగితే డొంకంతా కదిలిన' చందాన వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి కోడెల, దూడలను తీసుకువచ్చి అక్రమంగా అమ్ముకొన్న వ్యవహారంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అయితే కోడెలను, లేగదూడెలను అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకునేందుకు ఏకంగా ఆలయ గోశాలలను ఎంచుకున్నట్టు బయటపడటంతో రాజన్న భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. రాజన్న ఆలయ గోశాల కోడెలను రైతులకు రెండు చొప్పున ఇచ్చేందుకు నిబంధనలు ఉండగా సదరు వ్యక్తులు రైతులపేరుతో గంపగుత్తగా కోడెలను, లేగదూడలను తెచ్చి కబేళాలకు అమ్ముతున్నట్లు నిర్ధారణైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసి రాంబాబు రాజేశ్వరీ సొసైటీ ద్వారా వేములవాడ గోశాల నుంచి కోడెలను, లేగదూడలను తీసుకొచ్చి అమ్ముకుంటున్నట్టు గత నెల 29న వెలగందుల రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో రాంబాబుపై ఈ నెల 1న కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి కొద్దినెలలుగా రెండు దఫాలుగా 66కోడెలను తీసుకువచ్చినట్టు బయటపడింది. అనంతారానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన పసునూటి శ్యామ్‌తో కలిసి తీసుకొచ్చామని, గీసుగొండ, దుగ్గొండి మండలాలకు చెందిన పలువురు రైతుల నుంచి ఆధార్‌కార్డులతో పాటు వారికి సంబంధించిన భూమి పత్రాలను సేకరించి ఆలయ గోశాల అధికారులకు అందించి కోడెలను, దూడలను తీసుకొచ్చినట్టు రాంబాబు పోలీసుల విచారణలో తెలిపాడు. కొద్ది రోజుల అనంతరం తాము తీసుకొచ్చిన వాటిలో 26కోడెలను రాజన్న ఆలయ గోశాలకే తిరిగిచ్చామని, మరికొన్ని పారిపోయాయని, మిగిలిన 11 కోడెలు గట్టుక్రిందపల్లి వద్ద గల తన పాకలో ఉన్నట్టు చెప్పుకొచ్చాడు. అయితే పాకలో ఉన్న కొన్ని కోడెల చెవులకు టాగ్‌లు లేనట్లుగా పంచనామాలో పోలీసులు, అధికారులు గుర్తించారు. కాగా పారిపోయినట్లుగా చెప్పిన కోడెలను ముగ్గురూ కలిసి అమ్ముకున్నట్టు తేలటంతో బీఎన్ఎస్ 318(4) యాక్ట్ కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఇక ఆధార్‌కార్డులు ఇచ్చిన వారిపై పోలీసులు ఆరా తీస్తుండగా.. గీసుగొండ, దుగ్గొండి మండలాలకు చెందిన 33 మంది నుంచి ఆధార్‌కార్డులు, భూమి పత్రాలను రాంబాబు, రాజు, శ్యాం సేకరించినట్టు సమాచారం. పోలీసులు వారిని పిలిపించి మాట్లాడారు. రాజన్న ఆయల గోశాల నుంచి కోడెలను,దూడలను తమ పేరుమీద తీసుకువచ్చి రాంబాబు, రాజు, శ్యాంలు అమ్ముతున్న విషయం తమకు తెలియదన్నారు. అయితే రైతులు లేకుండా ఆలయ గోశాల అధికారులు రాంబాబు ఒక్కరికే ఎలా ఇన్ని కోడెలను ఇచ్చారనేది గమనార్హం. రైతులు లేకుండా ఏక మొత్తంలో కోడెలను గోశాల నుంచి తీసుకువచ్చే క్రమంలో అటు ఆలయ అధికారులను, ఇటు రైతులను డబ్బులతో రాంబాబు, రాజు, శ్యాం మేనేజ్‌చేసినట్టు అనుమానిస్తున్నారు.

గుడికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

బంగారం, వెండి, నగదు చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన అనుమానితుడు

మట్టెవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి ఇంటిని గుల్ల చేశాడు. ఇంటి తాళాన్ని పగలగొట్టి బంగారం, వెండి, నగదును అపహరించుకుపోయాడు. ఈ సంఘటన వరంగల్ పిన్నవారి వీధి మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ పిన్నవారి వీధిలో వజ్‌సింగ్ అనే వ్యాపారి నివాసం ఉంటున్నారు. వజ్‌సింగ్ ఇటీవల రాజస్థాన్‌కు వెళ్లాడు. బుధవారం ఉదయం వజ్‌సింగ్ భార్య లలితబాయి ఇంటికి తాళం వేసి పిల్లలతో కలిసి గుడికి వెళ్లింది. దర్శనం అనంతరం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించింది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో దాచుకున్న నాలుగున్నర తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదును చోరీ చేసినట్లు గుర్తించింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించింది. కాగా, వరంగల్ పిన్నవారి వీధిలో బుధవారం జరిగిన సంఘటనలో చోరీకి పాల్పడిన అనుమానితుడు సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్లు పోలీసులు గుర్తించారు. పిన్నవారి వీధి డాల్ఫిన్ గల్లీ, జేపీఎన్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్డు, వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఉన్న సీసీ ఫుటేజీలను మట్టెవాడ పోలీసులు, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. చోరీకి పాల్పడిన అనంతరం అనుమానిత వ్యక్తి పిన్నవారి వీధి గుండా డాల్ఫిన్ గల్లీ నుంచి జేపీఎన్ రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు ఆటోలో వెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

నకిలీ బంగారం అంటగట్టిన షాపు యజమాని?

వరంగల్ నగరానికి చెందిన ఒక బంగారం వ్యాపారి నకిలీ బంగారం ఇచ్చి ములుగు ప్రాంతానికి చెందిన వారిని మోసం చేసినట్లు తెలిసింది. యేడాది కిందట వరంగల్ చౌరస్తా ఆర్ఎన్‌టీ రోడ్డులోని ఒక బంగారం షాపులో ములుగు జిల్లాకు చెందిన వారు రెండు తులాల బంగారు గాజుల కోసం సదరు షాపు యజమానికి డబ్బులు ఇచ్చారు. షాపు యజమాని బంగారు గాజులు చేసి ఇచ్చారు. సంవత్సరం తరువాత బంగారం షాపు యజమాని ఇచ్చిన గాజులు నకిలీవని తేలడంతో మోసపోయామని గుర్తించి బుధవారం ములుగుకు చెందిన బాధితులు షాపు యజమానిని నిలదీశారు. దీంతో రెండు తులాల గాజులకు గాను, ప్రస్తుతం బంగారం ధర కట్టిస్తానని షాపు యజమాని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగినట్లు తెలిసింది.

రైలులో ప్రయాణిస్తూ వ్యక్తి మృతి

గిర్మాజీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో కలిసి రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండె సంబంధిత అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ విలేఖరులకు తెలిపిన ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన ఎల్.భరత్‌కుమార్(57) ప్రయివేటు ఉద్యోగం చేస్తూ చైన్నైలో తల్లితో కలిసి ఉంటున్నాడు. రాజస్థాన్‌లో జరిగిన శుభ కార్యంలో పాల్గొన్న భరత్‌కుమార్ తల్లి కమలాదేవి, మేన కోడలు రక్షితసోనితో కలిసి సోమవారం అర్ధరాత్రి రాజస్థాన్ నుంచి తాంబరం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లో చైన్నైకు బయలుదేరాడు. బుధవారం 5 గంటల సమయంలో భరత్‌కుమార్‌కు ఛాతిలో నొప్పి రావడంతో తల్లి, మేనకోడలు ఈ విషయాన్ని సహచర ప్రయాణీకుల ద్వారా రైల్వే కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో రైలు వరంగల్ రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫారంకు చేరుకోగా స్టేషన్ మేనేజర్, జీఆర్‌పీ సిబ్బంది 108 అంబులెన్స్‌తో సహా సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. రైలు రావడంతో భరత్‌కుమార్‌ను ప్లాట్‌ఫారంపై దించి 108 సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతి సమాచారాన్ని వెంట ఉన్న తల్లి, మేనకోడలుకు చెప్పి ఎంజీఎం మార్చురిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని తల్లికి అప్పగించి ఎస్సై మొహినుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గతంలో భరత్‌కుమార్‌కు బైపాస్ సర్జరీ జరిగిందని, గుండెపోటుతో మృతి చెందినట్లుగా తెలిసిందని సీఐ పేర్కొన్నారు.

పెళ్లికి వచ్చి మృత్యు ఒడికి..

(5వ పేజీ తరువాయి)



నర్సంపేట మార్చురీలో విష్ణు మృతదేహం

మృతుడు విష్ణు, ప్రేమ్‌కుమార్‌రెడ్డి కారులో వెళ్లారు. ఈ క్రమంలో చెరువు చివరలోనున్న మత్తడి సమీపంలో కట్ట కిందకు వెళ్తుండగా కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో స్థానికులు గమనించి కేకలు వేయగా కారులో ముందుసీట్లో కూర్చున్న ప్రేమ్‌కుమార్‌రెడ్డి డోరు తీసుకొని బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. డ్రైవింగ్ చేస్తున్న విష్ణు కారులో ఉండిపోవడంతో చెరువులోకి దూసుకెళ్లిన కారు బోల్తాపడి మునిగిపోయింది. దీంతో విష్ణు కారులోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కు మార్, సీఐ రమణమూర్తి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ యంత్రంతో, మాధన్నపేట యువకుల సహాయంతో చెరువులో నుంచి కారును, అందులోని విష్ణు మృతదేహాన్ని బుధవారం సాయంత్రం బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం నర్సంపేటలోని మార్చురీకి తరలించారు.

కుటుంబంలో విషాదం

మృతుడు విష్ణుకు ప్రణీత్ అనే కానిస్టేబుల్ నర్సింహులపేటలో పనిచేస్తున్న క్రమంలో పరిచమయ్యాడు. దీంతో స్నేహితుడి సోదరుడి వివాహానికి వెళ్లిన స్నేహితులతో కలిసి ఉత్సాహంగా గడిపిన విష్ణు.. అంతలోనే మృతిచెందడంతో ఇటు స్నేహితులు, కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మరో రెండు నెలల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సి ఉండగా, మృత్యు ఒడిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2321	2080
పల్లికాయ (సూక)	3500	4000
పల్లికాయ (పచ్చిది)	5500	5500
కందులు	-	-
పెసళ్లు	6812	6000
పత్తి	6935	5800
పసుపు (కాడి)	11131	11000
పసుపు (గోల)	11009	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	15000	12000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	14500	11000
యూఎస్341ఏసీ	13000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

నేటితో ముగియనున్న మండల స్థాయి పోటీలు

కాశిబుగ్గ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ మండల స్థాయి పోటీలు గురువారంతో ముగియనున్నాయి. వరంగల్, ఖిలా వరంగల్ మండల స్థాయిలో యోగ, కబడ్డీ పోటీలు బుధవారం జరిగాయి. గురువారం ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. పీఈటీలు పెద్ది రాజు, నారాయణ పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయని డీవైఎస్‌వో సత్యవాణి తెలిపారు.

ఘనంగా ఐఎంఏ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు

వరంగల్ మెడికల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 2024-25 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వరంగల్‌లోని ఐఎంఏ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ బన్సాలీ, రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకాంతారెడ్డి, ఎస్ఏటీసీఓఎస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కాళీప్రసాద్, శేషమాధవ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ నుంచి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ నాగార్జునరెడ్డి అధ్యక్ష మెడల్‌ను స్వీకరించారు. అనంతరం డాక్టర్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. వైద్యుడిగా ప్రభుత్వ విధులతోపాటు ఐఎంఏకు సైతం తన పూర్తి శాయశక్తులా తోడ్పాటునందిస్తానన్నారు. నూతన ప్రధాన కార్యదర్శి అజిత్ అహ్మద్, ఆర్థికశాఖ కార్యదర్శి శిరీష్ కుమార్, కోశాధికారి శిరీష్, ఉపాధ్యక్షులు నరేశ్ కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ వేడుకల్లో ఐఎంఏ ప్రతినిధులు ప్రవీణ్, రామకృష్ణ, మోహన్‌రావు, రాకేశ్, హరి, సంధ్యారాణి, సందీప్, బాలాజీ, కస్తూరి ప్రమీల, సాంబశివరావు, శివకుమార్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా సతీష్

కాశిబుగ్గ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కస్తూరి సతీష్ విజయం సాధించారు. సంఘం ఎన్నికలు బ్యాలెట్ ద్వారా మొదటిసారి నిర్వహించారు. వరంగల్ కాశిబుగ్గలోని కాస్మో ఫంక్షన్ హాల్‌లో బుధవారం పోలీసు బందోబస్తు మధ్య జరిగిన ఓటింగ్‌లో త్రినగరికి చెందిన నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు. అధ్యక్ష స్థానానికి సతీష్‌తో పాటు బాలు, కర్ణాకర్ పోటీ పడ్డారు. సతీష్‌కు 388 ఓట్లు, బాలుకు 240, కర్ణాకర్‌కు 66 ఓట్లు పడ్డాయి. 148 ఓట్లతో సతీష్ విజయం సాధించినట్లు ఎన్నికల నిర్వాహకులు రాజేందర్, దశరథం, నాగరాజు, మధు, వేణు ప్రకటించారు.

ఆశా వర్కర్లపై దాడిని ఖండించాలి

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల

ఖిలావరంగల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లపై విచక్షణా రహితంగా జరిపిన దాడిని ఖండించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏసిరెడ్డి నగర్ ప్రాంతంలో ఆశా వర్కర్లకు మద్దతుగా నిరసన ధర్నా చేపట్టారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు భవానీ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రత్నమాల మాట్లాడుతూ.. ఆశాలు రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులుగా చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆశాల డిమాండ్‌లన్నింటినీ నెరవేరుస్తామని వాగ్దానాలు చేసి ప్రభుత్వం ఏర్పడ్డాక పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం ఆశాలకు రూ.18వేల కనీస వేతనం ఇచ్చి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఆశాల సమస్యలను పరిష్కరించాలని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఐద్వానాయకులు తాటిపాముల ఉదయశ్రీ, ఈసంపెల్లి మంజుల, ఎమ్డీ.జరీనా, కాంపెల్లి అనిత, షమీనా రజియా, ఈశ్వరమ్మ, సక్కుబాయి, రాజేశ్వరి, హేమలత, రాజక్క పాల్గొన్నారు.

ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులను వర్సిటీ క్యాంపస్‌కు తరలించాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి కేయూ క్యాంపస్‌కు మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్ (ఎంఎస్‌డబ్ల్యూ) కోర్సును తరలించాలని కేయూ ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని తన చాంబర్‌లో కలిసి విన్నవించారు. డిపార్టుమెంట్ షిఫ్టింగ్ కమిటీ వేసి వర్సిటీ క్యాంపస్‌లో తగిన సదుపాయాలను కల్పించి త్వరలోనే క్యాంపస్‌కు ఎంఎస్‌డబ్ల్యూ కోర్సును తరలిస్తామని వీసీ ప్రతాప్‌రెడ్డి తమకు హామీ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

గెజిటెడ్ అసోసియేషన్‌లో సభ్యత్వాన్ని నిరాకరించండి

రెవెన్యూ నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు

రాంనగర్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో గెజిటెడ్ పేరుతో ఇటీవల స్థాపించిన అసోసియేషన్‌లో నాన్ గెజిటెడ్ ఉద్యోగులెవరూ సభ్యత్వం తీసుకోవద్దని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి పిలుపునిచ్చారు. రికార్డ్ అసిస్టెంట్ నుంచి తహసీల్దార్ వరకు ఒక సంఘం, సబార్డినేట్ నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు ఒక సంఘాన్ని స్థాపించి నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు జిల్లా స్థాయి పోస్టులు ఇవ్వలేదన్నారు. గెజిటెడ్ అసోసియేషన్ ద్వారా నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు ఎలాంటి న్యాయం జరగకపోవడం ద్వారానే నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. రాష్ట్ర కమిటీ ద్వారా పీఆర్సీ సబ్‌కమిటీ, సీసీఎల్ఏ, సీఎస్‌కు తమ సమస్యలపై లేఖలు ఇచ్చినప్పటికీ అక్కడ సెక్షన్‌లలో ఉండే గెజిటెడ్ అసోసియేన్‌కు సంబంధించిన ఉద్యోగుల వల్ల కలెక్టర్లకు సర్క్యులర్స్ రావడం లేదని ఆరోపించారు.

మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ప్రెస్‌క్లబ్ వద్ద జర్నలిస్టుల నిరసన



ప్రెస్‌క్లబ్ వద్ద నల్లబ్యాడ్జీలు, హెల్మెంట్లు ధరించి జర్నలిస్టుల నిరసన

వడ్డెపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులపై దాడిచేసి విచక్షణారహితంగా వ్యవహరించిన సినీనటుడు మంచు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదుచేసి వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడిచేసిన మోహన్‌బాబుపై చట్టపరంగా చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు, హెల్మెట్లు ధరించి హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ ప్రెస్‌క్లబ్ వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే -143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్. లెనిన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై సినీనటుడు మంచు మోహన్‌బాబు దాడి చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి మోహన్‌బాబుకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో వివిధ యూనియన్ల నేతలు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించే గ్రూపు-2 పరీక్షలకు పకడబందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రూపు-2 పరీక్షలు 15, 16 తేదీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, అలాగే మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 82 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నామని, ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 33,005 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులతో రాకూడని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్షలు జరిగే సమయాలలో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సుల సమయాలను మార్చాలన్నారు. భట్టుపల్లిలోని ఎస్ఆర్ ప్రైమ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఆర్టీసీ అధికారులు పరీక్షా తేదీలలో హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి ఉదయం 7గంటలకు, 8గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జిల్లా అధికారులు, గ్రూపు-2 పరీక్షల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

● వరంగల్ కలెక్టరేట్: గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు బయోమెట్రిక్, ఇన్విజిలేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాటాడుతూ పరీక్ష నిర్వహణలో బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ల పాత్ర కీలకమని, జాగ్రత్తగా అభ్యర్థుల హాజరు తీసుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ యాప్‌ను ఎలా ఉపయోగించాలో పీపీటీ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా వ్యాప్తంగా గ్రూప్-2 పరీక్షకు 11,309 మంది హాజరవుతుండగా 28 సెంటర్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 160 మంది అభ్యర్థులకు ఒక బయోమెట్రిక్ చొప్పున 86 బయోమెట్రిక్ టాప్స్ ద్వారా హాజరు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వినయ్‌భాస్కర్‌ను విమర్శించే అర్హత రావు పద్మకు లేదు..

బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ రజనీకాంత్



విలేకరులతో మాట్లాడుతున్న పులి రజనీకాంత్

హనుమకొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను విమర్శించే హక్కు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు లేదని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులి రజనికాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన కోసం దాస్యం వినయ్‌భాస్కర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 60 శాతం స్థానికులకే ఉద్యోగాలు కేటాయించాలని, పలు సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీలో వినయ్‌భాస్కర్ ధర్నా చేస్తే.. రావు పద్మ వినయ్‌భాస్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలి

వడ్డెపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీయూసీఐ 5వ జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని అఖిల భారత కిసాన్ సంఘటన్(ఏబీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని ఎంఎల్‌పీఐ రెడ్‌ఫ్లాగ్ పార్టీ జిల్లా కార్యాలయంలో టీయూసీఐ హనుమకొండ జిల్లా ప్రతినిధి పొన్నుల నగేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ దేశంలోని కార్మిక, కర్షక ప్రయోజనాలను కాలరాస్తోందని దుయ్యబట్టారు. వేతనాల కోతలు, పనిభారం పెంపు, లాకౌట్లు, పనిగంటల పెంపు, కాంట్రాక్టీకరణ, ధరల పెంపు చేస్తూ సామాన్య ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందని విమర్శించారు. తొలుత సభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇంజపెల్లి కిషన్, కిరణ్, భద్రయ్య, గడ్డం రమేష్, రవి, భిక్షపతి, రమేష్, రాజు, నరేందర్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు షురూ..

మండల స్థాయిలో 400 మంది హాజరు

జేఎన్ఎస్ వేదికగా రెండు రోజుల పాటు పలు అంశాల్లో పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీల్లో భాగంగా బుధవారం హనుమకొండలోని జేఎన్ఎస్‌లో హనుమకొండ జిల్లా స్థాయి క్రీడా పోటీలు జోరుగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్ జోనా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి అనంతరం మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇలాంటి క్రీడాపోటీలు వేదికగా నిలుస్తాయన్నారు. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహించగా, అందులో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా మండలస్థాయికి ఎంపిక చేశామన్నారు. ఇక్కడ పలు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించగా, ప్రధానంగా కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, రెజ్లింగ్, యోగా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. హనుమకొండ, కాజీపేట మండల స్థాయిలో నిర్వహించనున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో తొలిరోజు 400మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. రెండో రోజు గురువారం కాజీపేట మండలంలోని క్రీడాకారులకు క్రీడా ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణిలు హాజరవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్, హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఎంహెచ్‌వో మల్లం రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనిల్‌కుమార్, డీఎస్ఏ కోచ్ శ్రీమన్నారాయణ, పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్ జోన

క్రైం కార్నర్

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

వరంగల్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 28 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రాజేశేఖర్‌రెడ్డి 26 మందికి రూ.32,400 జరిమానా విధించగా, ఎల్కతుర్తికి చెందిన ఈరా సుమన్, హనుమకొండకు చెందిన బానోతు సుమన్‌కు రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించారని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేని 8మందికి రూ.4వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

16 మందికి..

మట్టెవాడ : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 16 మందికి జరిమానా, ఒకరికి రెండు రోజుల సామాజిక సేవ శిక్షను బుధవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వరంగల్‌లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన 16 మంది వాహనదారులకు రూ.18,900 జరిమానా విధించారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపిన కేసులో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ప్రాంతానికి చెందిన నీలమారి శ్రవణ్ కుమార్‌కుమెజిస్ట్రేట్ రెండురోజుల సామాజిక సేవ శిక్షను విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

న్యూశాయంపేటలో కుక్కల హల్‌చల్

ముగ్గురిని గాయపరిచిన శునకాలు



గాయపడిన అనిల్

న్యూశాయంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో బుధవారం కుక్కలు హల్‌చల్ చేశాయి. న్యూశాయంపేటలోని హరిజనవాడకు చెందిన బూర్ల అనిల్‌కుమార్ ఇంటి ముందు ఉండగా మూడు కుక్కలు ఒక్కసారిగా ఎగబడి మోకాలుపై, చేయిపై గాయపరిచాయి. అలాగే రాసమల్ల వాడలో ఇద్దరిని గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. న్యూశాయంపేటలో కుక్కల బెడద రోజు రోజుకూ పెరుగుతోందని, డివిజన్ ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు న్యూశాయంపేటలో కుక్కల బెడద లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

గొర్రెల పెంపకం లాభదాయకం

మామునూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల మాంసానికి ఎక్కువ డిమాండు, లాభదాయకంగా ఉన్నందువలన గొర్రెల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బసవరెడ్డి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో గొర్రెల పెంపకంపై శిక్షణ కార్యక్రమం, రైతు మేళా బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ బసవరెడ్డి, ఎంఎస్ఆర్ఐ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ హాజరై కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ బసవరెడ్డి మాట్లాడుతూ.. రైతులు గొర్రెల పెంపకంలో శాస్త్రీయ పద్ధతిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. నేషనల్ లైవ్స్టాక్ మిషన్ ద్వారా గొర్రెల లోన్ ఎలా పొందవచ్చో వివరించారు. గొర్రెలను ఎంపిక చేసుకోవడంలో తీసుకోవాల్సిన మెళకువలు, వాటికి వచ్చే వివిధ వ్యాధులు, నివారణ గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. గొర్రెలకు ఉపయోగపడే పశుగ్రాసాలు, పెంచే పద్ధతులను, సంబంధిత పథకాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి బాలకృష్ణ, ప్రొఫెసర్ అండ్ హెడ్ లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ డిపార్టుమెంట్ డాక్టర్ మహేందర్, డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ అమరేశ్వరీ, డాక్టర్ సాయికిరణ్, వెంకటరాజు, విజయలక్ష్మి, పార్థసారథి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



గొర్రెల పెంపకంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సైంటిస్టులు

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని బీసీ విద్యార్థి నేత అరెగంటి నాగరాజుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రా నికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ స్కూళ్లలో ఫుడ్ పాయి జన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల మరణాలపై సమీక్షించాలని కోరారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

కాజీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మీదుగా కుంభమేళా యాత్రను పురస్కరించుకుని జనవరి 19న కుంభమేళా స్పెషల్ రైలు నడప నున్నట్లు ఐఆర్‌సీటీ ఎగ్జిక్యూటివ్ పవన్ తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన రైలు వివరాలు తెలిపారు. జన వరి 19న సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలుకు భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజ యవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తూని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరంలో హాల్టింగ్‌సౌకర్యం కల్పించారు.యాత్ర ఇతరవివరాలు కోసం 92810 30749, 92810 30749 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సుబేదారి పోలీసులకు బారికేడ్లు, 30 కుర్చీల అందజేత

హనుమకొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసులకు క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పది బారికేడ్లు, స్టేషన్ అవసరాలకు 30 కుర్చీలను అందజేసినట్లు సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్, మేనేజర్ నరేష్‌రెడ్డి చేతుల మీదుగా అందించినట్లు సీఐ తెలిపారు. సామాజిక దృక్పథంతో ముందుకొచ్చి అందించిన వారి బృందాన్ని అభినందించారు.

కాజీపేట రైల్వే సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ కావ్య

కాజీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం ఎంపీ కడియం కావ్య రైల్వే సమస్యలపై ప్రస్తావించారు. రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్, బైపాస్ లైన్, అలైన్‌మెంట్, ప్లాట్‌ఫారాల విస్తరణ తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ, ఇంజన్, కోచ్, ఉత్పత్తి యూనిట్‌ను అన్నిరకాల తయారీ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. నగరానికి ఇరువైపులా బైపాస్‌లైన్‌లు నష్కల్- హసన్‌పర్తి, నష్కల్ - చింతల్‌పల్లి, భూబాధితుల సమస్యలను పరిగణలోకి తీసకుంటున్నామన్నామని మంత్రి చెప్పారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుపై ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి జాతీయ కార్యాచరణలో భాగంగా అమృత్ భారత్‌లో భాగంగా కాజీపేటకు రూ.5వేల కోట్లతో నిధులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

రాత్రి వేళల్లో మిర్చి తొడిమెల కాల్చివేత

వరంగల్ సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్‌టీఆర్ నగర్ సమీపంలో ఉన్న మిర్చి కల్లాలు, కోల్డ్ స్టోరేజీల వారు మిర్చి నుంచి వేరు చేసిన తొడిమెలను కాలుస్తున్నారు. దీంతో ఆ పొగకు స్థానికులు, ముఖ్యంగా వృద్ధులు, ఇతర జబ్బులు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అడుప మహేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్ తదితరులతో కలిసి బుధవారం రాత్రి మిర్చి కల్లాల వద్దకు వెళ్లి పరిశీలించారు. మిర్చి తొడిమెలను కాలుస్తున్నందున వెంటనే ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్‌కు సమాచారం అందించగా పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి పంపించారు. కాలుతున్న మిర్చి తొడిమెల ఘాటుకు పోలీసులు సైతం హైరానా పడ్డారు. దీంతో పోలీసులు సంబంధిత కల్లాలలో పనిచేస్తున్న సిబ్బందిని పిలిచి మొదటిసారి వదిలేస్తున్నాం... మరోసారి జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కర్రు రాజేందర్, ల్యాగల భిక్షపతి, చెరుకు హరిబాబు, సారంగం, ప్రశాంత్, నరేష్, దాను తదితరులు పాల్గొన్నారు.

ట్రైసిటీలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్ సిబ్బంది

వరంగల్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ బాంబ్ అండ్ డాగ్ స్క్వాడ్ ఆర్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్రజలు రద్దీగా ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్‌లతో పాటు వీఐపీ నివాసాలు, పోలీస్ హెడ్‌క్వార్టర్ ఎదుట క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి విచారించి వదిలేశారు.

నీటి సరఫరా కార్మికులను ఆదుకోవాలి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఫిల్టర్‌బెడ్‌లతో పాటు నీటిని సరఫరా చేస్తున్న కార్మికుల సమస్యలు పరిషరించాలని దళిత బహుజన మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బల్దియా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి సుద్దాల కుమార్ మాట్లాడుతూ.. ఫిల్టర్ బెడ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. కార్మికులు మృతిచెందితే దహన సంస్కారాల కోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ.10వేలు కూడా అందించడం లేదని అన్నారు. ఇంకా వాటర్ సప్లయి చేసే కార్మికులు ఉదయం 4 గంటలకు నీరు విడుదల చేసేందుకు బయలుదేరే చలికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, చలికోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా ఫిల్టర్‌బెడ్‌లలో నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే రసాయనాల వల్ల చాలామంది కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రతీ కార్మికుడికి ఆరోగ్య బీమా వర్తించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాణాసాగర్, నాయకులు ల్యాదెల్ల సాల్మాన్, చిరంజీవి, సాంబయ్య, కొత్తకొండ రవి పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల నిరసన

భూములు కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్



వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గీసుగొండ మండలం శాయంపేట హవేలి గ్రామ రైతులు వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూనిర్వాసిత రైతులు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన వారిలో కొంత మందికి మాత్రమే పరిహారం అందించి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటి వరకు కొందరికి నష్టపరిహారం ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. తమ బాధను కలెక్టర్, ఆర్డీవోలకు విన్నవించుకుందామంటే వారు అందుబాటులో లేకపోవడంతో పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేసినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో శాయంపేట హవేలి రైతులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో యువ జోష్

- కలలను నిజం చేసుకుంటున్న యువత
- తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ ఉన్నత స్థాయికి..
- శిక్షణ పూర్తి చేసుకున్న 578 మంది.. వరంగల్ కమిషనరేట్‌కు కేటాయింపు
- వివిధ జోన్లలోని పోలీస్ స్టేషన్లలో విధులు

వరంగల్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఉన్నత చదువులు చదివిన యువత పోలీస్‌శాఖలో చేరడానికి అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఇతర శాఖల్లో ఉద్యోగాల్లో చేయడానికే మొగ్గు చూపేవారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పోలీసు ఉద్యోగం చేయించేందుకు భయపడేవారు. ఇక ఈ శాఖలో చేరే మహిళల సంఖ్యయితే అంతంత మాత్రంగానే ఉండేది. అలాంటిది ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. కొడితే పోలీస్ నౌకరే కొట్టాలన్నట్టుగా పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా పోటీపడి పోలీస్ శాఖలోకి వస్తున్నారు. కానిస్టేబుల్‌కు ఇంటర్, ఎస్సైకు డిగ్రీ విద్యార్హతలే ఉన్నప్పటికీ పీజీలు, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఎంఈడీలు చేసిన యువత పోలీస్ కానిస్టేబుల్‌కు ఎంపికై ప్రజాసేవకు అంకితమవుతున్నారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ఏదో ఒక ఉద్యోగం సాధించాలనే కసితో ఉన్న యువత ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసేందుకు వీలుగా ఉంటుందనే ఆలోచనతో పోలీస్ కొలువుపై గురిపెడుతున్నారు.

తల్లిదండ్రుల ఆశయాలకు ప్రాణం పోస్తూ..

కొందరు తల్లిదండ్రులు తాము సాధించలేని ఆశయాలను తమ పిల్లలతో పూర్తిచేయించి ఆనందాన్ని చూస్తున్నారు. పిల్లలను ప్రోత్సహిస్తూ కొలువుల వైపు నడిపిస్తున్నారు. ఈ క్రమంలో తమ పిల్లల ఒంటిపై ఖాకీ దుస్తులు పడగానే చూసుకుని సంబురపడిపోతున్నారు. మరి కొందరు పిల్లలైతే చిన్నప్పటి నుంచి తండ్రిని పోలీస్ యూనిఫామ్‌లో చూసి తాను కూడా పోలీసే కావాలని లక్ష్యంగా పెట్టుకొని చివరికి కలను నెరవేర్చుకుంటున్నారు. ఈ క్రమంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా పోటీపడి కొలువులు కొడుతున్నారు. గతంలో ఎక్కడో ఓ దగ్గర అర్బన్ ప్రాంతాల్లో ఉమెన్ పీసీ కనిపించేది. గ్రామీణ ప్రాంతాలతో పాటు

పోలీస్‌శాఖలో అత్యవసర విభాగాల ఫోన్ నెంబర్లు

ఎమర్జెన్సీ డయల్ : 100
సీపీ వాట్సాప్ నెంబర్ : 8712685257
సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబర్ : 1930
మాదక ద్రవ్యాల నియంత్రణ టోల్ ఫ్రీ నెంబర్ : 1908
షీ టీం ఫోన్ నెంబర్ : 8712685142



సీపీతో సమావేశంలో పాల్గొన్న కమిషనరేట్‌కు కేటాయించిన పీసీలు (ఫైల్)

నగరాల్లో సైతం మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలన్నా భయపడేవారు. ఇప్పుడు అన్ని ఠాణాల్లో మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.

వరంగల్ కమిషనరేట్‌కు 578 మంది..

శిక్షణ పూర్తి చేసుకున్న 578 మంది కానిస్టేబుళ్లను ప్రభుత్వం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించింది. ఈ 578 మందిలో సెంట్రల్ జోన్‌కు 145, వెస్ట్‌జోన్‌కు 119 మంది, ఈస్ట్‌జోన్‌కు 68 మంది, మరో ఐదుగురు ఇతర విభాగాలను కేటాయించారు. ఇక 578 మందిలో 367 సివిల్ కానిస్టేబుళ్లు, 211మంది ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారు. 367 మంది సివిల్ కానిస్టేబుల్స్‌లో 244 మంది పురుషులు, 123 మంది మహిళలుండగా.. 211 మంది ఏఆర్ కానిస్టేబుళ్లలో 168మంది పురుషులు, 43 మంది మహిళలున్నారు.

వారం దరికి కమిషనరేట్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల పోస్టింగులు ఇవ్వడంతో విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టింగ్‌లు ఇచ్చిన వారందరితో సీపీ గత నెల నవంబరు 30న సమావేశం ఏర్పాటు చేసి విధుల్లో ఎలా రాణించాలనే దానిపై దిశానిర్దేశం చేశారు.



హనుమకొండ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

బీఈడీ సెకండియర్‌లో ఉండగానే ఉద్యోగం వచ్చింది

వి.వినూష, వరంగల్ జిల్లా కొత్తూరు



నాన్న శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో బీఈడీలో జాయిన్ చేయించారు. డిగ్రీ పూర్తికాగానే పోటీ పరీక్షలకు పై దృష్టిసారించా. ఈ లోపు పోలీసు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ రావడంతో అప్లై చేసి ప్రిపేరయ్యాను. ఓయూలో బీఈడీ చేస్తుండగానే జాబ్ వచ్చింది. ఇక మా అక్క ఎస్‌జీటీ టీచర్‌గా పని చేస్తోంది.

ఆర్మీలో చేరాలనుకున్నా..

డి. కరుణ్య, ఎంఎస్సీ బయాలజీ, హనుమకొండ పీఎస్



చిన్నప్పటి నుంచి ఆర్మీలో జాయిన్ కావాలనే ఉండేది. సీపీ తరుణ్‌జోషి ఉన్న సమయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీపరీక్షలకు హాజరయ్యా. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నుంచి వచ్చేదాన్ని. కానీ హైట్ లేకపోవడంతో ఆర్మీలోకి తీసుకోలేదు. నాన్నకు సివిల్ పోలీస్ అంటే ఇష్టం ఉండటంతో పీసీ ఈవెంట్స్, రాత పరీక్షకు హాజరై అర్హత సాధించా.

లేడీ పోలీస్

- స్మార్ట్ పోలీసింగ్‌తో డిపార్ట్‌మెంట్ వైపు మహిళల ఆసక్తి
- ఒత్తిళ్లను అధిగమిస్తూ శభాష్ అనిపించుకుంటున్న అతివలు
- 33 శాతం రిజర్వేషన్‌తో నెరవేరుతున్న కల

వరంగల్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వంటింటికే పరిమితమైన అతివలు.. నేటి కాలంలో ఏ పనినైనా అలవోకగా చేయగలమని నిరూపించుకుంటున్నారు. పిరికితనం, బిడియాన్ని వదిలి ధైర్యంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. తమకు అందివచ్చిన ఏ అవకాశాన్ని కూడా చేజార్చుకోకుండా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. అంతరిక్షంలో అడుగుపెట్టడమే కాదు.. విమాన పైలట్ నుంచి రైళ్లలో లోకో పైలట్ వరకు అన్ని రంగాల్లోనూ శభాశ్ అనిపించుకుంటున్నారు. కఠినమైన పోలీసు కొలువుల్లోనూ సత్తా చాటుతున్నారు.

వరంగల్ కమిషనరేట్‌లో మహిళా పోలీసుల సంఖ్య	
డీసీపీ	1
ఇన్స్‌పెక్టర్	2
సబ్ ఇన్స్‌స్పెక్టర్లు	28
ఏఎస్సైలు	39
హెడ్ కానిస్టేబుళ్లు	15
సివిల్ కానిస్టేబుళ్లు	175
ఏఆర్ కానిస్టేబుళ్లు	50

పోలీసు విధుల నిర్వహణ విషయంలో గతంలో మహిళల్లో అనేక అనుమానాలు, అపోహాలు ఉండేది. ఇప్పుడు సీన్ మారిపోయింది. అంత స్మార్ట్ పోలీసింగ్ నడుస్తోంది. దానికి తోడు ఉద్యోగాల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ ఉండటంతో పోలీస్‌శాఖ వైపు మహిళలు చూస్తున్నారు.

పోలీస్ శాఖలో రిసెప్షన్, పేపర్ వర్క్‌కే పరిమితం కాకుండా ఉన్నతాధికారులు ఏ బాధ్యతలు అప్పగించిన అవలీలగా చేసే స్తున్నారు. సివిల్ ఒక్కటే కాకుండా వీఐపీలకు బందోబస్తు నిర్వహించే ఏఆర్ విభాగం, నిత్యం రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్, కోర్టు డ్యూటీ, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లోనూ అసాధారణ విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ పోలీస్ కానిస్టేబుళ్లే కాకుండా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, జిల్లా పోలీస్ బాస్‌లుగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తూ తమ సత్తా చాటుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషన రేట్‌లోని మూడు జోన్లలో మహిళా పోలీస్ సిబ్బంది, అధికారులు పురుష అధికారులు దీటుగా పని చేస్తున్నారు. సెంట్రల్ జోన్ డీసీపీగా మహిళాధికారి ఉండడం ప్రత్యేకత.

తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా : కె.అశ్విని రెడ్డి, గుండ్లపాడు



డిగ్రీ పూర్తి చేయగానే పోలీస్ నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తు చేసి సొంతంగానే ప్రిపేర్ అయ్యా. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా. శిక్షణకు వెళ్లడానికి ముందు వివాహమైంది. నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. గ్రూప్-2 ఆఫీసర్ కావాలనే ఆకాంక్ష ఉంది. దాని కోసం ప్రయత్నిస్తున్నా.

అమ్మ ప్రోత్సహించింది..

షహనాజ్, హనుమకొండ పీఎస్



మేం ఇద్దరం అక్కాచెల్లెళ్లం. అక్క ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తోంది. నాన్న లేకపోవడంతో దినసరి వేతనంపైనే అమ్మ.. నన్ను, అక్కను కష్టపడి చదివించింది. ఎంబీఏ చదివిన నాకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన ఉండేది. ఈ క్రమంలోనే పోలీస్‌గా ఎంపికయ్యా. భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగం చేయాలని కోరిక ఉంది. కచ్చితంగా సాధించి తీరుతా.

ఆంగ్ల సాహిత్యంలో శరత్ చంద్రుడు

సాహితీ సౌరభం

- అతికొద్ది మంది ఆంగ్ల రచయితల్లో ఒకరు
- ఐటీ ఉద్యోగం వదిలి సాహిత్యం వైపు అడుగులు
- 40కి పైగా రచనలతో ప్రత్యేక గుర్తింపు
- ఇతిహాసాల్లోని పాత్రలే కథా వస్తువులు
- కామన్వెల్త్ బుక్ ప్రైస్ లాంగ్ లిస్టులో చోటు



భార్య అదితితో రచయిత శరత్ కొమర్రాజు



శరత్ కొమర్రాజు ఆంగ్లంలో రాసిన సుప్రసిద్ధ నవలలు

హనుమకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రచయితలు చాలామంది ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోలో అయితే కొదవే లేదు. కథలు, కవిత్వం, నవలలు చాలా రాశారు.. రాస్తున్నారు కూడా. కానీ ఆంగ్లంలో రచనలు చేసేవారి సంఖ్య చాలా తక్కువ. ఆంగ్లంలో ఒకటీ రెండు రచనలు చేసినవారు, ముఖ్యంగా నవలా రచయితలుగా పేరు తెచ్చుకున్నవారిని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. కానీ ఆంగ్ల సాహిత్యాన్నే వృత్తిగా ఎంచుకొని బహుళ సంఖ్యలో పుస్తకాలు రాసిన వారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో ఒకరు యువ ఆంగ్ల రచయిత శరత్ కొమర్రాజు. ఇప్పటికే ఆంగ్లంలో 40కిపైగా నవలలు రాసిన శరత్‌కు ఇంగ్లిష్ సాహిత్యాభిమానుల్లో మంచి క్రేజ్ ఉంది. ఆయన పుస్తకాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. శరత్ రాసిన నవలల్లో చాలా వరకు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ క్రమంలో ఆయన పుస్తకాలు కామన్వెల్త్ బుక్ ప్రైస్ లాంగ్‌లిస్టులో కూడా చోటు దక్కించుకున్నాయి. హనుమకొండ బాలసముద్రానికి చెందిన శరత్ కొమరాజు సీరియస్, సీరియల్ ఇంగ్లిష్ రైటర్ అని చాలా మందికి తెలియదు. తండ్రి డాక్టర్ రవిశంకర్, తల్లి సరళ లాయర్ కాగా ఆయన భార్య అదితిది కర్నాటక. వారికి సరయు, మల్హార్ పిల్లలున్నారు. శరత్ విద్యాభ్యాసమంతా ఇంగ్లిష్ మీడియంలోనే సాగడంతో ఆంగ్ల భాషపై ఆయనకు సహజంగానే పట్టు ఏర్పడింది.

ఒకటి నుంచి పదో తరగతి వరకు హనుమకొండ బిషప్ బరేట్టా స్కూల్లో, ఇంటర్ మొదటి సంవత్సరం విజయవాడ కాలేజీలో చదవగా.. ఆయన ఇంటర్‌లో ఉన్నప్పుడే తండ్రి డాక్టర్ రవిశంకర్ కుటుంబంతో న్యూజిలాండ్‌కు వెళ్లడంతో శరత్ అక్కడే ఇంటర్ ద్వితీయ సంవత్సరం, యూనివర్సిటీ ఆఫ్ ఆక్లాండ్‌లో బీఎస్సీ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశారు. ఆక్లాండ్‌లోనే ఐబీఎం కంపెనీలో ఐదేళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసిన ఆయన 2011లో స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కొంత కాలంలో బెంగళూరు ఐబీఎంలో ఉద్యోగం కొనసాగించారు.

ఆకట్టుకునే శైలి ఆయన సొంతం

క్రైమ్, రొమాన్స్ ఫిక్షన్, నాన్ ఫిక్షన్స్ రాయడంలో శరత్ కొమర్రాజుది అందె వేసిన చేయి. ఆయన ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం ఫైవ్ పాయింట్ సమ్ వన్ ఫేమ్ రచయిత చేతన్ భగత్, ద బాయ్ హూ లవ్డ్ రైటర్ దుర్జోయ్ దత్త, ఐటూ హాడ్ ఏ లవ్ స్టోరీ సృష్టికర్త రవీందర్ సింగ్ స్థాయిలో పాఠకులను కట్టిపడేస్తుంది. విచిత్రమేమిటంటే శరత్ కొమ్మరాజు... చేతన్ భగత్, దుర్జోయ్ సింగ్, రవీందర్ సింగ్‌లాగా ఐటీ ప్రొఫెషన్ నేపథ్యం నుంచి రచనా రంగంలోకి వచ్చిన యువ రచయిత. కొవిడ్ సమయంలో శరత్ రచనలకు బ్రేక్ పడగా.. గతేడాది నుంచే మళ్లీ రాయడం మొదలు పెట్టారు. ప్రస్తుతం ఆయన ఒక నవల రాస్తుండగా అది దాదాపు పూర్తి కావొచ్చింది.

బాల్యం నుంచే పుస్తకాలంటే ఇష్టం

శరత్‌కు బాల్యం నుంచే పుస్తకాలపై ఆసక్తి ఉండేది. ఆక్లాండ్‌లో ఉన్నప్పుడు కూడా నిత్యం లైబ్రరీకి వెళ్లి చదివేవారు. అలా ఆంగ్ల సాహిత్యంపై అభిమానం ఏర్పడి.. ఇంగ్లిష్‌లో రచనలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని చదువు కొనసాగిస్తూనే ఇంగ్లిష్‌లో రచనలకు శ్రీకారం చుట్టారు. అలా మర్డర్ ఇన్ అమరావతి అనే తొలి నవల రాయగా.. ఈ మిస్టరీ, థ్రిల్లర్‌కు పాఠకుల నుంచి ఆదరణ లభించింది.

2011లో ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత బెంగళూరులో ఉద్యోగం చేస్తూనే తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. కొంత కాలానికి నెలకు రూ.లక్షకుపైగా వేతనం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా రచనపైనే దృష్టి సారించారు. కుటుంబం నుంచి పూర్తి సహకారం లభించడంతో రచననే వృత్తిగా ఎంచుకొని ఫుల్‌టైమ్ రైటర్‌గా మారారు. ఇప్పటికి ఆయన మర్డర్ ఇన్ అమరావతితో పాటు ది విండ్స్ ఆఫ్ హస్తినాపూర్ (ఆరు భాగాలు), ది ట్రీ బేర్స్ విట్నెస్ బీర్బల్ (2 భాగాలు), ఆమ్నియన్ కింగ్ ఆఫ్ మధుర, క్రౌవ్స్ ఆగ్రా, ది సాంగ్ ఆఫ్ బృందావన్ (4 భాగాలు), ది పప్పీటీర్స్ ఆఫ్ పాలెం, ద ఇరైజ్ ఆఫ్ హస్తినాపూర్ (2 భాగాలు), ఎటర్నిటి బిగిన్స్, లాయాల్టీ నెట్, ది బర్త్ ఆఫ్ ద్వారాకా, ది క్వీన్ ఆఫ్ అస్తినాపూర్ తదితర నవలలు రాశారు. మహాభారత క్యారెక్టర్ గైడ్స్, మర్డర్ ఇన్ అమరావతి బెస్ట్ సెల్లర్ బుక్స్‌గా పాఠకుల విశేష అభిమానాన్ని చూరగొన్నాయి.

ఇతిహాసాల్లోని పాత్రలే..

శరత్ రాసిన నవల్లో క్రైమ్, థ్రిల్లర్‌తో పాటు ఇతిహాస గాథల నేపథ్యంగా సాగిన రచనలు కూడా ఉన్నాయి. మహాభారత-క్యారెక్టర్ గైడ్స్, ది విండ్స్ ఆఫ్ హస్తినాపూర్ ఈ కోవకు చెందినవే. మహాభారతంలోని 14పాత్రలను ఎంచుకొని వాటి గురించి రాసిన విశ్లేషణాత్మక నవల పాత్రల మధ్య సంఘర్షణను, మహాభారతంలో వాటి ప్రభావాన్ని, మానవ సంబంధాల్లోని సంక్లిష్టతను ఎత్తి చూపుతాయి. మహాభారత ఎ స్సెన్షియల్స్ ఆమ్నిబస్‌లోని ఆరు పుస్తకాలు, క్యారెక్టర్ గైడ్స్ సిరీస్‌లోని 14పుస్తకాలు కృష్ణుడు, అర్జునుడు, ద్రౌపది, కర్ణుడు, దుర్యోధనుడు ఇలా అన్ని ప్రధాన పాత్రల స్వరూప స్వభావాలను కళ్లకు కట్టినట్టు చూపుతాయి.

ది సాంగ్ ఆఫ్ బృందా వన్-హస్తినా పూర్ బృందావనంలో కృష్ణుని బాల్యం, ఆయన ద్వారక యువ రాజుగా ఎదిగిన తీరు మహాభారత ప్రియులందరినీ ఆకట్టుకుంది. ది విండ్స్ ఆఫ్ హస్తినాపూర్ గంగ, సత్యవతి పాత్రల ఔన్నత్యాన్ని, వారి బలమైన వ్యక్తిత్వాన్ని, వేదనను అధిగమిస్తూ తమను తాము నిలదొక్కుకున్న తీరును అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి • జిల్లా అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి వరంగల్ జిల్లా పర్యటనలో ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని నగర అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ నగరాభివృద్ధిపై హైదరాబాద్ సచివాలయంలో జిల్లా మంత్రులు కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేదర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్‌రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టు భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్ధీకరణ పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ శాఖ కార్యదర్శి దానకిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేందర్ మోహన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య సత్య శారదాదేవి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పకడ్బందీగా సేకరించాలి

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు పకడ్బందీగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రూపు-2 పరీక్షల నిర్వహణ, సంక్షేమ హాస్టల్స్ నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవం తదితర అంశాలపై బుధవారం రాత్రి మంత్రి పొంగులేటి జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 80లక్షల మంది వివరాలను డిసెంబరు నెలాఖరులోగా పకడ్బందీగా సేకరించాలన్నారు. ప్రతీ 500 ఇళ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనకు ఒక సర్వేయర్‌ను నియమించాలన్నారు.

అలాగే ఈ నెల 15, 16 తేదీలలో జరిగే గ్రూపు-2 పరీక్షలను సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని, డిసెంబర్ 14వ తేదీన డైట్‌చార్జీల పెంపు ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తులలో ఇందిరమ్మ ఇళ్ల కింద ప్రభుత్వానికి 80లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సర్వేయర్ ద్వారా ఇంటింటికీ తిరుగుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ.. గ్రూపు-1, గ్రూపు-3 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, ఈ నెల 15, 16 తేదీలలో రెండు సెషన్‌లలో గ్రూపు-2 పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు పుష్పలత, భాగ్యలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, ఇతర జిల్లా అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 2,33,356 దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కోసం 2 లక్షల 33 వేల 356 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 1, 430 దరఖాస్తుల సర్వే పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను నియమించి 20 రోజుల్లో పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తామన్నారు. గ్రూప్-2 పరీక్షకు 11వేల 309 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, ఇందుకుగాను 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

టైగర్.. టెన్షన్

ములుగు అరణ్యంలో పెద్దపులి సంచారం



ఆలుబాక వద్ద కనిపించిన పెద్ద పులి పాద ముద్రలు

ఏటా ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి వచ్చిపోతున్న పులులు

ములుగు/మంగపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యం 2.90లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో సరిహద్దును కలిగి ఉండటంతో ఈ అడవుల్లో క్రూర మృగాలు, వన్యప్రాణాలు వృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో అరుదైన పెద్ద పులి ఈ అడవులను ఆవాసంగా చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇంద్రావతి నేషనల్ పార్కు నుంచి ఆహారం, తోడు అన్వేషణలో భాగంగా పులి ప్రతీఏటా ఏటూరునాగారం అడవులకు వచ్చిపోతోంది. 2021 నుంచి వరుసగా పులి సంచారాన్ని ఫారెస్టు అధికారులు ట్రాక్ చేశారు.

తాజాగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి సోమవారం రాత్రి వెంకటాపురం(నూగూరు) మండలంలోకి వచ్చిన పులి మంగళవారం గోదావరి నదిని దాటి మంగపేట మండలంలోకి ప్రవేశించింది. బుధవారం మల్లూరు అడవుల మీదుగా కిన్నెరసాని వన్యప్రాణి విభాగం పరిధిలోని అడవుల్లోకి వెళ్లింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరిపై దాడికి పాల్పడ్డ ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధి కారులు పులి కదలికలపై దృష్టిసారించారు. సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మల్లూరు ప్రాజెక్టు, తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలోని నీటి చెలిమెల వద్ద పులి పాద ముద్రలను బుధవారం గుర్తించిన అటవీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినా ఎక్కడా దాని సంచారానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు లభ్యం కాలేదని డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. నలుగురు సభ్యులతో కూడిన ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. మంగపేట- తాడ్వాయి సరిహ ద్దు అడవుల్లోని దామెరతోగు, మర్కోడు అడవి మీదుగా పెద్ద పులి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభయారణ్యంలోకి ప్రవేశించినట్టు బుధవారం సాయంత్రం గుర్తించారు. పులి సంచారం విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఏ క్షణంలోనైనా తిరిగి ములుగు అడవుల్లోకి వచ్చే అవకాశముందని, 15-20 రోజులు ప్రత్యేక బృందాలు 24 గంటలు పనిచేస్తాయని డీఎఫ్‌వో తెలిపారు.

అడవి దారిలోనే పయనం

ములుగు అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి గ్రామాల వైపు వచ్చిన సందర్భాలు అసలే లేవు. పులి ఆహారంగా తీసుకునే అడవి పంది, జింకలు, దుప్పులు, కనుజు లాంటి వన్యప్రాణులు పుష్కలంగా ఉండటంతో వాటిని వేటాడటం సులువుగా మారింది. దీంతో ఆకలి తీరిన పులి తన దారిన తాను వెళ్లేది. సాధారణంగా పునరుత్పత్తి కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే పులులు ఆ తర్వాత వెళ్లిపోయేవి. కానీ, ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మనుషులపై పులి దాడి చేసిన నేపథ్యంలో ములుగు జిల్లాలోని అటవీ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


వేటగాళ్ల ఉచ్చుకు బలైన పులి

ప్రతీయేటా ఆగస్టు నుంచి డిసెంబరు మధ్యలో పులి సంచరిస్తున్నట్టు స్పష్టమవుతోంది. దాని కదలికలను పసిగట్టిన అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాలు, గొత్తికోయగూడేల ప్రజలను అప్రమత్తంచేస్తూ వస్తున్నారు. అయితే అనూహ్యంగా 2021 ఆగస్టులో ఓ ఆడపులి వేటగాళ్ల ఉచ్చుకు బలైంది. కిన్నెరసాని అడవుల నుంచి వచ్చిన పులి తాడ్వాయి మండలంలోని కొడిశాల, లింగాల అడవుల్లో సంచరించింది. కొడిశాల అడవిలోని ఓ గొత్తికోయ గుంపునకు చెందిన ఆదివాసీలు సెప్టెంబరు 21న ఉచ్చులు వేసి దాని హతమార్చారు. చర్మం, గోళ్లు, మాంసాన్ని తీసుకొని ఎముకలను పాతిపెట్టారు. దాని కొవ్వుతో నూనెను కూడా తయారు చేశారు. చర్మం, గోళ్లను విక్రయించే క్రమంలో అక్టోబరు 3న అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన అప్పుడు దేశవ్యాప్తంగా సంచలనమైంది. పులిని చంపిన గొత్తికోయలు దాని మాంసాన్ని వండుకుని తిన్నారు. అప్పటి వరకు గొత్తికోయలు అడవిని నరికి పోడు వ్యవ సాయం మాత్రమే చేస్తున్నారని, చిన్నచిన్న వన్యప్రాణులను వేటాడుతారని భావించిన అటవీ అధికారులు... ఏకంగా పులిని చంపారని తేలడంతో ఆశ్చర్య పోయారు. దీంతో అప్పటి నుంచి పులి కదలికలను రహస్యంగా ఉంచుతున్న అధికారులు దాని కదలికలపై నిఘా పెడుతున్నారు.

టైగర్ జోన్ ప్రతిపాదన

ఒకప్పుడు పెద్దపులికి ఆవాసంగా ఉండి ఇప్పుడు చుట్టపుచూపునకు పరిమితమైన ములుగు అభయారణ్యంలో పులికి శాశ్వత విడిది కల్పించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయి. గడ్డి మైదానాలు, వన్యప్రాణులు ఎక్కువగా ఉండటంతో పులి ఆవాసానికి అనువుగా మార్చాలని భావించారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయి, మంగపేట మండలాల సరిహద్దులోని అడవిని టైగర్ జోన్‌గా మార్చాలనే ప్రతిపాదన వచ్చింది. ఇందుకు పెద్ద సంఖ్యలో గ్రామాలను తరలించాల్సి రావడంతో సర్వత్రా వ్యతిరేకత వచ్చింది. దీంతో అటవీ అధికారులు ఆలోచనను తాత్కాలికంగా విరమించుకున్నారు.

వాజేడు మండలంలో చిరుత పులి కలకలం



చిరుతవిగా భావిస్తున్న పాదముద్రలు

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి) : ఓవైపు వెంకటాపురం మండ లం మండలంలోని బోదాపురం సమీప అడవుల్లో సంచరించిన పెద్దపులి గోదావరి దాటి మం గపేట మండలంలోకి వచ్చిన ట్టుగా అధికారులు నిర్ధారించిన క్రమంలోనే బుధవారం వాజేడు మండలంలో చిరుతపులి సంచారం వార్తలు కలకలం రేపాయి. వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డిలో చిరుతపులి పాదముద్రలను గమనించిన గ్రామస్థులు కంగారు పడ్డారు. సమాచారం అందుకున్న దూలా పురం రేంజ్ అటవీ శాఖ అధికారులు పాదముద్రల నమూనాలు సేకరించి నిర్ధారణ కోసం సంబంధిత అధికారులకు పంపారు.

అయితే అవి చిరుతవేనని స్పష్టత రాలేదు. కానీ ఇప్పటికే వెంకటాపురం, మంగపేట మండలాల్లో సంచరించింది పెద్దపులేనని అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో వాజేడు మండలంలో చిరుత సంచరించిందంటూ ప్రచారం జరగటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా తమకు అధికారుల నుంచి స్పష్టత వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని, ప్రస్తుతం తాము సేకరించిన పాదముద్రలు హైనావిగా భావిస్తున్నట్టు దూలాపురం రేంజ్ అటవీ శాఖ అధికారులు తెలిపారు.

నవ్య

కుటుంబ కదంబం

గురువారం 12 డిసెంబరు 2024

కౌన్సెలింగ్

వంధ్యత్వానికి చికిత్సలున్నాయా?

డాక్టర్! మా పెళ్లై ఐదేళ్లు. పిల్లలు పుట్టకపోవడంతో ఇద్దరం పరీక్షలు చేయించుకున్నాం. పరీక్షల్లో మా వారిలో లోపముందని తేలింది. పురుషుల్లో వంధ్యత్వాన్ని చికిత్సతో పూర్తిగా సరిదిద్దే వీలుందా? ఎటువంటి చికిత్సలు ఎవరికి అవసరం?

- ఓ సోదరి, హైదరాబాద్

సమర్థమైన చికిత్సతో 75% మందిలో వంధ్యత్వాన్ని పూర్తిగా నివారించవచ్చు. మిగతా 30% మందిలో జన్యుపరమైన సమస్యలుంటాయి. కాబట్టి వాటిని సరి చేయడం కుదరదు. వీర్యం తయారవుతున్నా బయటకు రావడంలో అవరోధాలున్నప్పుడు, లేదా వీర్యమే తయారవని పరిస్థితి ఉన్నప్పుడు, వీర్య కణాల్లో లోపమున్నప్పుడు.. సమస్యనుబట్టి చికిత్స చేయొచ్చు. జెనైటల్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లుంటే వాటిని నోటి మాత్రలతో తగ్గించవచ్చు. వేరికోసిల్, వీర్యనాళంలో సమస్యలతోపాటు స్థలన సమస్యలు ఉంటే సర్జరీతో సరిదిద్దవచ్చు. హార్మోన్ల హెచ్చుతగ్గులు, ఇన్‌ఫెక్షన్లను మందులతో నయం చేయవచ్చు. ఓపెన్ సర్జరీ, లాప్రోస్కోపిక్ సర్జరీలకు కాలం చెల్లింది. ఇప్పుడు 'మైక్రో సర్జరీ'తో రోగిని ఒక్క రోజులోనే ఇంటికి పంపించే సౌలభ్యం ఉంది. ఈ సర్జరీ చవకైనది, సురక్షితమైనది, ప్రభావవంతమైనది.

అంతవరకూ ఓపిక పట్టాలి!

ఒక వీర్యకణం తయారీకి 60 నుంచి 70 రోజుల సమయం పడుతుంది. పుట్టి మహిళ శరీరంలోకి స్రవించిన వీర్యకణం దేహంలో 5 రోజులపాటు బ్రతికే ఉంటుంది. కాబట్టి వంధ్యత్వానికి చేసే చికిత్స ఫలించి, గర్భం దాల్చడానికి కనీసం రెండున్నర నెలల నుంచి ఆరు నెలల సమయం పడుతుంది. చికిత్స మొదలు పెట్టేశాం కదా! ఫలితం 10 నుంచి 15 రోజుల్లో వస్తుందని ఊహించుకోవడం కరెక్టు కాదు. కొంతకాలంపాటు మందులు వాడేసి, ఆ మందులు నిష్ప్రయోజనమని నిర్ధారణకు వచ్చి వదిలేయడం కూడా సరి కాదు. చికిత్సతో సమస్య సరిదిద్దినా, వీర్యకణం తయారవడానికి ఎక్కువ కాలం పడుతుంది కాబట్టి గర్భధారణకు అంతకాలం పాటు మందులు వాడుతూ ఓపికగా వేచి ఉండాలి.

- డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్.



నానబెట్టిన బాదం తింటే?

బాదంపై ఉండే పొట్టులో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరానికి పోషకాలు అందకుండా చేస్తుంది. అందుకే బాదం పప్పుని రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే పొట్టు తీసి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇలా తింటే బాదం త్వరగా జీర్ణమవుతుంది. దీనిలోని పోషకాలను శరీరం సులువుగా గ్రహించగల్గుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే అయిదు నానబెట్టిన బాదం పప్పులను తింటే కలిగే ఇతర ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

జీర్ణక్రియకు : నానబెట్టిన బాదంలో లిపేజ్ అనే ఎంజైమ్ తయారవుతుంది. ఇది జీర్ణాశయంలో ఆహార పదార్థాలు త్వరగా జీర్ణం కావడానికి తోడ్పడుతుంది. అనవసరమైన కొవ్వులను కూడా సులువుగా కరిగిస్తుంది.

మలబద్ధకానికి: నానబెట్టిన బాదం పప్పులో కరగని పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి ప్రేగులలో కదలికలను పెంచుతాయి. దీనితో మలబద్ధకం సమస్య దూరమౌతుంది.

మధుమేహానికి: నానబెట్టిన బాదంలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. ఆరోగ్యకరమైన కొవ్వులు, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా తటస్థంగా ఉంటుంది.

రోగనిరోధక శక్తికి: రాత్రంతా నానబెట్టిన బాదంలో ప్రీబయాటిక్ సమ్మేళనాలు ఏర్పడతాయి. ఇవి ఆహారనాళంలో మంచి బ్యాక్టీరియా పెరగడానికి దోహదం చేస్తాయి. ప్రతిరోజూ ఉదయాన్నే బాగా నానిన బాదం పప్పు తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంటువ్యాధులు దరిచేరవు.

ఎముకలకు: నలభై ఏళ్లు నిండిన మహిళల్లో ఎముకలు బలహీనమవుతూ ఉంటాయి. వీరు నానబెట్టిన బాదం పప్పులను తరచూ తింటూ ఉంటే కాల్షియం, మెగ్నీషియం లాంటి పోషకాలు అంది ఎముకలు గట్టిపడతాయి. బాదంలోని యాంటీ ఆక్సీడెంట్లు, ప్రోటీన్లు కండరాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.



చర్మానికి: నానబెట్టిన బాదంలో మాంగనీస్ అధికంగా ఉంటుంది. ఇది చర్మం పొరల్లో కొల్లాజెన్‌ని ఉత్పత్తి చేస్తుంది. నానబెట్టిన బాదం పప్పును తినడం వల్ల చర్మానికి ఇ, సి విటమిన్లు అందుతాయి. దీనివల్ల చర్మం మీద ముడతలు, గీతలు రావు.

గుండెకు: నానబెట్టిన బాదంలో తయారయ్యే మోనోశాచురేటెడ్ సమ్మేళనాలు గుండె లోపలి భాగాల్లో చెడు కొలెస్ట్రాల్ పేరుకోకుండా చేస్తాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచి గుండె జబ్బులు రాకుండా నివారిస్తాయి. క్యాన్సర్, ట్యూమర్ లాంటి సమస్యలను అడ్డుకుంటాయి.

బరువు తగ్గేందుకు: నానబెట్టిన బాదంలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఫాస్ఫరస్, పొటాషియం, ప్రోటీన్లు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఉదయాన్నే నాలుగు పప్పులు తిన్నా కూడా కడుపు నిండిన భావన కలుగుతుంది. చాలా సమయం వరకు ఆకలి అనిపించదు. దీనివల్ల తినే ఆహారం నియంత్రణలో ఉండి శరీరం బరువు తగ్గే అవకాశం ఏర్పడుతుంది.

వినూత్నం



షాపింగ్ అన్నది ఓపికతో కూడుకున్న వ్యవహారం. అంత తీరికా, ఓపిక లేనివాళ్లకు, వాళ్ల బదులుగా షాపింగ్ చేసిపెట్టడంతో పాటు, స్టైలింగ్ కూడా నేర్పిస్తోంది హైదరాబాద్‌కు చెందిన **స్నేహ పోలప్రగడ**. గత ఎనిమిదేళ్లుగా పర్సనల్ షాపర్‌గా, స్టైలిస్ట్‌గా ఫ్యాషన్ ప్రియుల మన్ననలందుకుంటున్న స్నేహ, 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...

ఫాలోవర్ల ఫ్యాషన్ గురు

"సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ క్రియేటర్‌గా నా ప్రస్థానం ఎనిమిదేళ్ల క్రితమే మొదలైంది. అభిరుచిగా మొదలుపెట్టిన ఈ వ్యాపకం కెరీర్‌గా మారుతుందని నేను ఊహించలేదు. చిన్నప్పటి నుంచి ఫ్యాషన్ పరిశ్రమ పట్ల నాకున్న ఆసక్తి, నన్నీ రంగం వైపు నడిపించిందనే చెప్పవచ్చు. ఫ్యాషన్‌తో సంబంధం ఉన్న రంగంలోనే స్థిరపడాలని చిన్నప్పటి నుంచీ కోరుకునేదాన్ని. ఆ ఆసక్తితోనే బిటెక్ పూర్తి చేసి, ఎంబిఎ చదివేటప్పటి నుంచి ఫ్యాషన్ బ్లాగ్స్ రాయడం మొదలుపెట్టాను. తర్వాత 2017లో, ఇన్‌ఫ్లుయెన్సర్ల మార్కెటింగ్‌కు అంతగా ఆదరణ లేని కాలంలోనే నేను ఇన్‌స్టాగ్రామ్‌లో బ్రాండ్ ప్రమోషన్లు మొదలుపెట్టాను. వేర్వేరు బ్రాండ్స్ సహకారంతో ఫ్యాషన్ దుస్తులు వేసుకుని, ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, వాటిని ప్రమోట్ చేయడం మొదలుపెట్టాను. అలా గుర్తింపు సాధించిన తర్వాత దేశంలో వేర్వేరు ప్రాంతాల్లోని సూక్ష్మ వ్యాపారులను కలిసి, వీడియోలు చిత్రీకరించి ఇన్‌స్టా పేజీలో ప్రమోట్ చేయడం మొదలుపెట్టాను.

అమ్మ తోడ్పాటుతో...

ఈ కెరీర్‌లో నాకు అమ్మ దన్నుగా నిలిచిందని చెప్పాలి. వార్తాపత్రికలు చదువుతూ, సామాజిక మాధ్యమాల్లో ఉత్తరాది స్టైలిస్టులు, ప్రమోటర్ల ప్రొఫైల్స్ చూపించి, 'నువ్వు కూడా ఇలాగే ఎదగాలి' అంటూ ప్రోత్సహిస్తూ ఉండేది. అయితే ఈ కెరీర్ ప్రారంభంలో ఎలాంటి ఆదాయం ఉండేది కాదు. దానికి తోడు కొవిడ్‌లో నా ఫాలోవర్ల సంఖ్య 15 వేల దగ్గరే ఆగిపోయింది. కొవిడ్ తర్వాత పరిస్థితి మెరుగు పడడంతో రెట్టింపు ఉత్సాహం పుంజుకున్నాను. ప్రమోషన్లకే పరిమితం కాకుండా ఇదే రంగంలో వినూత్నమైన కోణాలను అన్వేషించాను. ఆ క్రమంలో 'ఫ్యాషన్ జిరాఫ్' అనే ఇన్‌ఫ్లుయెన్సర్ల నాయకత్వంలో కొనసాగే ఎగ్జిబిషన్ల కోసం ఒక వేదికను నెలకొల్పాను. అటు ఫ్యాషన్ ప్రియులు, ఇటు వ్యాపారులు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉండేలా, ఈ ఎగ్జిబిషన్లలో నేను పని చేస్తున్న బ్రాండ్లకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయడం మొదలుపెట్టాను. అలాగే వారణాసి, కంచి నుంచి చేనేత కళాకారులను పిలిపించి, వేర్వేరు రాష్ట్రాలకు చెందిన స్థానిక వస్త్రాలకు ఎగ్జిబిషన్‌లో స్థానం కల్పించాను. అలాగే 'మాకరాన్ బై ఎస్3' అనే మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా కొత్తగా వ్యాపారాల్లోకి అడుగు పెట్టిన వారికి సామాజిక మాధ్యమాల్లో తమను తాము ప్రమోట్ చేసుకోగలిగే వ్యూహాలను అందిస్తూ ఉంటాను. అలాగే కొత్తగా నెలకొల్పే దుకాణాలకు మార్కెటింగ్ ఈవెంట్స్ కూడా ప్లాన్ చేస్తూ ఉంటాను.

ఎన్నారైలకు ఇండియా షాపింగ్

ఎన్నారైలు ప్రత్యేకించి షాపింగ్ కోసం ప్రతిసారీ స్వదేశానికి వచ్చి వెళ్లడం సాధ్యపడదు. అలాగని వాళ్లు, దుస్తులను ప్రత్యక్షంగా చూడకుండా ఆన్‌లైన్‌లో కొనుక్కోలేరు. అలాంటి వాళ్ల కోసం 'ఎకిసా బై శాండ్స్' ఇన్‌స్టాగ్రామ్ వేదికగా, వాళ్ల బదులుగా నేనే ఓపిగ్గా షాపింగ్ చేసి పెడుతూ ఉంటాను. హైదరాబాద్‌తో పాటు కర్నాటక, తమిళనాడు, వారణాసి, జైపూర్, ఢిల్లీ, కోల్‌కతా... ఇలా వేర్వేరు ప్రదేశాల్లో దొరికే అసలైన ఉత్పత్తులను కస్టమర్లకు వీడియోలో చూపిస్తూ, వాటిని కొనుగోలు చేసి, విదేశాలకు పంపిస్తూ ఉంటాను. ఈ సేవలకు తోడు, స్టిచ్చింగ్, స్టైలింగ్ కన్సల్టేషన్ సేవలను కూడా అదనంగా అందిస్తాం. ఏ దుస్తులను దేనితో మ్యాచ్ చేయాలో, ఏ సందర్భానికి ఎలాంటి దుస్తులు తగినవో సూచనలు కూడా ఇస్తూ ఉంటాను.



నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. నాన్న రామచందర్ పోలప్రగడ, ఎస్ఎల్ డయగ్నొస్టిక్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అమ్మ వాణి గృహిణి. నాతో పాటు చెల్లి స్నిగ్ధ పోలప్రగడ కూడా ఇదే రంగంలో కొనసాగుతోంది. వీడియోల ఎడిటింగ్, పోస్టింగ్ పనులు చెల్లే చూసుకుంటుంది. అలాగే సోషల్ మీడియా వ్యూహాత్మక ప్రణాళికల బాధ్యత కూడా చెల్లిదే! ఏ రోజు, ఏ పోస్ట్ పెడితే నెటిజన్లకు ఎక్కువ చేరువ కాగలుగుతామో, స్నిగ్ధ ఎంతో బాగా అంచనా వేయగలుగుతుంది. స్నేహితురాలు మానస నా వ్యాపార భాగస్వామి.

మనిష్ మల్హోత్రా బ్రాండ్‌కు ప్రచారం

ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్లు అసలైన ఉత్పత్తులను ప్రమోట్ చేయడం ఎంతో కీలకం. రెండు లక్షల మంది ఫాలోవర్లు నన్ను విశ్వసిస్తున్నారు. కాబట్టి నకిలీ ఉత్పత్తులకు ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రచారం కల్పించను. ఈ వృత్తిలో భాగంగా దేశమంతా తిరుగుతాను కాబట్టి నకిలీకి ఆస్కారం లేని నాణ్యమైన వస్త్రాలు ఎక్కడ దొరుకుతాయో, ప్రముఖ డిజైనర్లు వాళ్ల ఉత్పత్తుల కోసం ఎక్కడి నుంచి ముడిసరుకునే సమకూర్చుకుంటూ ఉంటారో తెలుసు. కాబట్టి నాణ్యతను కోరుకునే ఫ్యాషన్ ప్రియులు నన్ను, నేను ప్రచారం కల్పించే ఉత్పత్తులను పూర్తిగా విశ్వసిస్తూ ఉంటారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా బ్రాండ్ కూడా నేను ప్రమోట్ చేశాను. టైటన్ వాచ్, లూలూ మాల్‌కు కూడా పని చేశాను. భవిష్యత్తులో దుబాయ్, యుఎస్ఎ, సింగపూర్‌లలో స్థిరపడిన భారతీయులకు ఎగ్జిబిషన్ల ద్వారా మన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచన ఉంది. అలాగే వెబ్‌సైట్‌ను నెలకొల్పి దాని ద్వారా ప్రామాణికమైన సమాచారాన్ని అందిస్తూ, ఆన్‌లైన్ కొనుగోళ్లను సులభతరం చేయాలనే ఆలోచన కూడా ఉంది."

• గోగుమళ్ల కవిత

వార్తల్లో వనిత

అమెరికాలో భారత సంతతికి చెందిన సిక్కు మహిళ, **హర్మీత్ కౌర్**కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా, 54 ఏళ్ల హర్మీత్‌ను అమెరికా న్యాయశాఖ పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా ప్రకటించారు. ఆ భారతీయ అమెరికన్ ఆసక్తికరమైన విశేషాలివి...



భారతీయ అమెరికన్ మహిళకు అపూర్వ గౌరవం

1969లో చండీఘడ్‌లో పుట్టిన హర్మీత్ కౌర్, రెండేళ్ల వయసులోనే తల్లితండ్రులతో కలిసి అమెరికా వలస వెళ్లిపోయింది.

న్యూయార్క్ నగరానికి తరలివెళ్లక ముందు ఆమె, ఉత్తర కారొలినాలో నివసించింది. డార్ట్‌మోర్త్ కాలేజీలో క్లాసికల్ స్టడీస్, ఇంగ్లీషులో డిగ్రీ పూర్తి చేసిన హర్మీత్... వర్జీనియా స్కూల్ ఆఫ్ లా నుంచి లా డిగ్రీ అందుకుంది. ఆ తర్వాత యునైటెడ్ స్టేట్స్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌కు చెందిన జడ్జి, పాల్ విక్టర్‌కు క్లర్క్‌గా పని చేసింది. ఆ తర్వాత న్యూయార్క్, లండన్, సిలికాన్ వ్యాలీ, శాన్‌ఫ్రాన్సిస్కోలలో పని చేసిన తర్వాత, 2006లో ధిల్లాన్ లా గ్రూప్ ఇంక్‌ను స్థాపించి, ప్రజాహక్కుల కోసం లాభాపేక్ష లేని కేంద్రాన్ని నెలకొల్పింది. తన సొంత లాగ్రూప్ ద్వారా, కొవిడ్ సమయంలో అమెరికా ప్రభుత్వం ప్రజలపై విధించిన నిబంధనలు, ప్రజలను ఇళ్లకే పరిమితం చేసే ఆదేశాలను ధిక్కరిస్తూ, ఎన్నో దావాలు వేసింది. ఫేస్ మాస్కుల అవసరాన్ని విమర్శించడంతో పాటు, బ్రిటిష్ టివి ప్రముఖుడైన పియర్స్ మోర్గాన్ కార్యక్రమంలో పాల్గొని, కొవిడ్-19 పాండమిక్‌తో ట్రంప్ వ్యవహారశైలిని విమర్శించిన వ్యక్తి నోరు మూయించి ప్రధాన వార్తల్లోకి ఎక్కింది. 2020 ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌కు న్యాయ సలహాదారుగా కూడా వ్యవహరించింది హర్మీత్.

వ్యాజ్యాలు, విమర్శలు

వాణిజ్య వ్యాజ్యాలు, ఉపాధి చట్టాలు, మొదటి సవరణ హక్కులు,



ఎన్నికల చట్టాలు.. ఇలా హర్మీత్ చట్టాలకు సంబంధించిన పలు కీలక అంశాల్లో నైపుణ్యం సాధించింది. ప్రత్యేకించి భద్రతలు, వినోదాలు, ఉపాధి వివక్ష, మానవ హక్కులకు సంబంధించిన వ్యాజ్యాలను చేపడుతూ ఉంటుంది. హర్మీత్ వివాదాలకు కూడా ప్రసిద్ధి చెందింది. గత జులైలో, క్రైస్తవ మత ఛాందసవాదులు, సంప్రదాయవాదులు సమావేశమైన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో, సిక్కు ప్రార్థనలోని అర్దాస్‌ను పఠించి, విదేశీ దేవుళ్లను ప్రార్థిస్తోందనే విమర్శలను సైతం ఎదుర్కొంది. అలాగే 2019లో ఓటర్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఓటర్ల పౌరసత్వాన్ని ధృవీకరించడంలో వైఫల్యాలను విమర్శిస్తూ, క్యాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోటార్ వెహికల్స్‌ను మీద ఆరోపణలు చేసింది.

వ్యక్తిగత జీవితం

హర్మీత్ తండ్రి డాక్టర్ తేజ్‌పాల్ ధిల్లాన్, ఆర్థోపెడిక్ సర్జన్. వృత్తి రీత్యా ఆయన కుటుంబంతో కలిసి ప్రపంచ దేశాలు తిరిగాడు. హర్మీత్ కుటుంబం మొదట ఇంగ్లండ్‌కూ, 1971లో అమెరికాకు వలస వెళ్లింది. హర్మీత్ 12 ఏళ్ల వయసులో అమెరికా పౌరసత్వాన్ని పొందింది. హర్మీత్ తల్లి హర్మీందర్ కౌర్ ధిల్లాన్. ఒకానొక సందర్భంలో ఆమె కూతురు హర్మీత్ గురించి ప్రస్తావిస్తూ, హర్మీత్‌ది ఇతరుల అభిప్రాయాలకు తలొగ్గని స్వభావమనీ, ఎదురు ప్రశ్నించే తత్వమనీ పేర్కొనడం గమనార్హం. హర్మీత్ పెంపకమంతా సిక్కు సంప్రదాయాలు, విలువలతోనే కొనసాగింది. ప్రతి వేసవిలో రెండు నెలల పాటు హర్మీత్ తన తల్లి పర్మీందర్, అన్న మన్‌దీప్‌తో కలిసి భారతదేశానికి వస్తూ ఉండేది. వచ్చిన ప్రతిసారీ తన అమ్మమ్మతాతయ్యల మార్గదర్శకత్వంలో సిక్కు సంస్కృతి గురించి లోతైన పరిజ్ఞానాన్ని ఏర్పరుచుకుంటూ ఉండేది. హర్మీత్ గ్రాడ్యుయేషన్ చదువు పూర్తి చేసిన తర్వాత, సిక్కు వైద్యుడు, కన్వర్జీత్ సింగ్‌ను పెళ్లి చేసుకుంది. కానీ వారి వైవాహిక జీవితం ఎక్కువ కాలం కొనసాగలేదు. 2003లో అతన్నుంచి విడాకులు తీసుకున్న హర్మీత్, ఎనిమిదేళ్ల తర్వాత 2011లో, సర్వజీత్ సింగ్‌ను రెండో పెళ్లి చేసుకుంది. సర్వజీత్, పార్కిన్సన్, కేన్సర్ వ్యాధులతో పోరాడుతూ ఈ ఏడాది కన్నుమూశారు.

స్నానంతో అదృష్టం!

స్నానం చేసే నీటిలో కొన్ని మూలికలు, దినుసులు కలిపితే అందం, ఆరోగ్యంతోపాటు అదృష్టం కూడా కలిసి వస్తుందని జ్యోతిషం చెబుతోంది. వాటి గురించి తెలుసుకుందాం.

వేపాకు



వేపాకులో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. అందుకే దీన్ని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఇందులో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో గుప్పెడు వేపాకులను వేసి అయిదు నిమిషాల తరవాత స్నానం చేస్తే శరీరంలోని ప్రతికూల శక్తి అంతా బయటికి వెళుతుంది. సానుకూల దృక్పథం పెరుగుతుంది. మంచి ఆలోచనలు వస్తాయి.

గంధం

స్నానం చేసే నీటిలో గంధం చెక్క లేదా పొడి వేసుకుంటే కీర్తిప్రతిష్ఠలు, సంపద పెరుగుతాయనీ, అదృష్టం కలిసి వస్తుందనీ, చేపట్టిన ప్రతిపనిలో విజయం దక్కుతుందనీ జ్యోతిషం చెబుతోంది. అంతేకాదు... శరీరానికి, మెదడుకి చల్లదనాన్ని, విశ్రాంతిని అందిస్తుంది. గంధం సువాసన ఎంతటి ఒత్తిడినైనా తగ్గిస్తుంది. కష్టాలను దాటుకుని ముందుకు సాగే ధైర్యాన్ని ఇస్తుంది.



పసుపు

ఆయుర్వేదం ప్రకారం పసుపు ఆరోగ్య ప్రదాయిని. శుభాలకు సంకేతం. ఇది మంచి యాంటీ బ్యాక్టిరియల్ ఔషధం. ఒక బకెట్ నీటిలో చెంచా పసుపు కలుపుకొని స్నానం చేస్తే శరీరం మీద ఉన్న వ్యాధికారక క్రిములన్నీ నశిస్తాయి. పసుపుకి ఉన్న ప్రత్యేకమైన సువాసన మెదడుని ఉత్తేజితం చేస్తుంది. నూతనోత్సాహాన్ని ఇస్తుంది. చర్మానికి మంచి ఛాయతోపాటు కాంతిని అందిస్తుంది.



గులాబీ రేకులు



గులాబీ రేకులు విజయానికి, దర్పానికి, ప్రేమకు సంకేతాలు. స్నానం చేసే నీటిలో గుప్పెడు గులాబీ రేకులు కలుపుకొంటే ఆందోళన, ఒత్తిడి తగ్గుతాయి. గులాబీ పరిమళం మనసుకు ఆనందాన్ని, విశ్రాంతిని అందిస్తుంది. నిరుత్సాహానికి లోనుకాకుండా కొత్త ఆలోచనలవైపు మనసును మళ్లిస్తుంది.

తులసి

తులసి సౌభాగ్యానికి, విజయానికి సంకేతం. దీనిలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. బకెట్ నీటిలో కొన్ని తులసీ దళాలు వేసి అయిదు నిమిషాల తరవాత స్నానం చేస్తే మనసులో ఆధ్యాత్మిక భావనలు పెరుగుతాయి. శరీరానికి రోగనిరోధక శక్తి లభిస్తుంది. తులసి ఆకుల పరిమళం మానసిక ఆందోళనను పారద్రోలుతుంది. చర్మం కొత్త కాంతితో మెరిసిపోతుంది. దైవం తోడు ఉన్న భావన మానసిక ధైర్యాన్ని పెంచుతుంది. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.



చలికాలంలో డిజైనర్ బ్లౌజులు

శీతాకాలంలో చలిగాలులు ఎక్కువగా వీస్తుంటాయి. బాగా చలిగా అనిపిస్తుంటుంది. ఇలాంటపుడు స్లీవ్‌లెస్, డీప్ నెక్ బ్లౌజులు వేసుకోలేము. అలాగని స్వెటర్స్ వేసుకుంటే ట్రెండీగా కనిపించదు. అందుకే చలికాలంలో వేసుకోదగ్గ స్టయిలిష్, ట్రెండీ బ్లౌజ్ డిజైన్ల వివరాలు మీకోసం....

ఫుల్ స్లీవ్స్

- ఈ బ్లౌజ్‌ల చేతులు భుజాల నుంచి మణికట్టు వరకు పొడవుగా ఉంటాయి. ఇవి ఎటువంటి శరీరాకృతి ఉన్నవారికైనా చక్కగా అమరుతాయి. వీటికి చక్కని నెక్ డిజైన్ కూడా పెట్టించుకోవచ్చు. జార్జెట్, ఫ్యాన్సీ, కాటన్ చీరల మీద వీటిని ధరిస్తే నిండుగా హుందాగా కనిపిస్తారు.

షార్ట్ స్లీవ్స్

- ఈ బ్లౌజ్‌ల చేతులు మోచేయి కన్నా పైకి ఉంటాయి. పొట్టిగా ఉండే మహిళలకు, కాస్త బొద్దుగా ఉండేవారికి ఈ బ్లౌజ్‌లు బాగా నప్పుతాయి. ఈ బ్లౌజ్ చేతుల మీద అందంగా ఎంబ్రాయిడరీ చేసినవి, మగ్గం వర్క్ చేసినవి... ఇలా ఎన్నో రకాలు లభ్యమవుతున్నాయి. ఎటువంటి చీరలమీదనైనా వీటిని ధరించవచ్చు.

బ్లేజర్ బ్లౌజ్

- ప్రస్తుతం ఈ బ్లేజర్ బ్లౌజ్‌కు ఆదరణ ఎక్కువగా ఉంది. పొట్టి చేతులు, పొడుగు చేతులు, వీ నెక్ రకాలు అందుబాటులో ఉన్నాయి. మెడ ముందు భాగంలో బ్లేజర్‌ను గుర్తుకు తెచ్చేలా ఆకర్షణీయమైన డిజైన్ ఉంటుంది. ఉలెన్ వస్త్రం లేదా మందపాటి వస్త్రంలో వీటిని రూపొందిస్తారు. వివిధ రంగుల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

హై నెక్ కాలర్ బ్లౌజ్

- మెడని పట్టి ఉంచే కాలర్‌తో ముందు భాగంలో అందమైన గుండీలతో చాలా ఆకర్షణీయంగా ఉంటుంది ఈ బ్లౌజ్. క్రేప్, జార్జెట్, సిల్క్ లాంటి పలుచని చీరల మీద అందంగా నప్పుతుంది. ఫుల్ స్లీవ్స్, హాఫ్ స్లీవ్స్ రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ధరిస్తే అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తారు.



నా నిర్లక్ష్యం లేదు



- నేను థియేటర్‌కు వచ్చినంత మాత్రాన రేవతి మృతికి కారణమైనట్లు కాదు
- సినీ నటుడు అల్లు అర్జున్
- తనపై పెట్టిన కేసు కొట్టేయాలంటూ హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం దురదృష్టకరం అని.. అయితే ఆ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని సినీనటుడు అల్లు అర్జున్ పేర్కొన్నారు. తాను ప్రీమియర్ షో కోసం థియేటర్‌కు వచ్చినంత మాత్రన రేవతి మృతికి కారణమైనట్లు కాదని చెప్పారు. తన సినిమా విడుదలైన రోజు థియేటర్‌కు హాజరవ్వడం అనేది తాను మొదటి నుంచీ పాటిస్తున్న సంప్రదాయం అని, పైగా పుష్ప-2 ప్రీమియర్ షో కోసం తాను సంధ్య థియేటర్‌కు వస్తున్నట్లు పోలీసులు, థియేటర్ యాజమాన్యానికి రెండు రోజుల ముందే సమాచారం అందించానని, అలాంటప్పుడు తనకు నేరాన్ని ఎలా ఆపాదిస్తారు? అని ప్రశ్నించారు. ఈ మేరకు రేవతి మృతి కేసులో తనను నిందితుడిగా చేరుస్తూ చిక్కడపల్లి పోలీసులు పెట్టిన కేసు కొట్టేయాలని పేర్కొంటూ అల్లు అర్జున్ హైకోర్టులో బుధవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 'పిటిషనర్ (అల్లు అర్జున్)ను నిందితుడిగా చేర్చడానికి కావాల్సిన ఆధారాలు లేవు. అక్రమంగా కేసు పెట్టడం వల్ల క్రిమినల్ ట్రయల్‌ను ఎదుర్కోవాల్సి వస్తే పిటిషనర్‌కు ఉన్న పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటాయి. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణ లేకుండా యాంత్రికంగా కేసు నమోదు చేశారు. ఘటన జరగడానికి ముందే ఏసీపీ, డీసీపీ వంటి సీనియర్ పోలీసు అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సినిమా ప్రదర్శనకు పిటిషనర్ హాజరయ్యారు కాబట్టి క్రిమినల్ ఉద్దేశాలను ఆపాదించి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం కరెక్ట్ కాదు. హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి వంటి తీవ్రమైన సెక్షన్లకు.. ఘటనా స్థలం వద్ద వాస్తవంగా జరిగిన ఘటనలకు ఎలాంటి సంబంధం లేదు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదులో సైతం ఘటనతో పిటిషనర్‌కు సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆరోపణ చేయలేదు. ఎలాంటి వాస్తవిక, న్యాయపరమైన ఆధారం లేని ఈ కేసు కొనసాగితే పిటిషనర్‌కు మానసిక వ్యథే మిగులుతుంది. పేరుప్రతిష్ఠలు దెబ్బతిని, అవి పునరుద్ధరించలేని విధంగా నష్టం జరుగుతుంది' అని అల్లు అర్జున్ తరఫున ఆయన న్యాయవాది పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది త్వరలో హైకోర్టు సింగిల్ జడ్జి ఎదుట విచారణకు రానుంది. కాగా రేవతి మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదని..సంధ్య సినీ ఎంటర్‌ప్రైజెస్, సంధ్య యజమానులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో వివరణ ఇవ్వాలని జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం బుధవారం పోలీసులకు నోటీసులు జారీచేసింది.

ఏజెన్సీని వణికిస్తున్న చలి

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు
- అర్లి (టి)లో 8.5, ఆదిలాబాద్ రూరల్‌లో 9.1 డిగ్రీలు

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా తుఫాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు కొద్దిగా పెరిగినా బుధవారం నుంచి ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలను చలి వణికిస్తోంది. ఏజెన్సీ మండలాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి)లో అత్యల్పంగా 8.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ రూరల్‌లో 9.1 డిగ్రీలు, తలమడుగులో 9.4, బేలలో 9.5, నేరడిగొండలో 9.6, మావల, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు(యు)లో 9.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే, కెరమెరి మండలంలో 10.5, తిర్యాణిలో 11, ఆసిఫాబాద్‌లో 12, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 13.2, గంభీరావుపేటలో 13.5, వీర్నపల్లి 13.9, బోయినపల్లిలో 14.0 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో మారుమూల ప్రాంతాల ప్రజలు చలికి వణికి పోతున్నారు. ముఖ్యంగా రైతులు, రైతు కూలీలు, మున్సిపల్ కార్మికులతో పాటు వసతి గృహాల్లోని విద్యార్థులు చలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మోహన్‌బాబు కుటుంబ వివాదం వ్యక్తిగతం

- ఆయన ఇంట్లో గొడవ శాంతిభద్రతల పరిధిలోకి రాదు
- సివిల్ వ్యవహారాల్లో పోలీసుల జోక్యం అనవసరం
- బౌన్సర్లందరినీ పంపించేయాలి
- పోలీసుల షోకాజ్ నోటీసును కొట్టేయాలన్న మోహన్‌బాబు పిటిషన్‌పై హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబ వివాదం వ్యక్తిగత అంశమని, ఆయన ఇంటి ప్రాంగణంలో జరిగిన ఘటనలతో శాంతిభద్రతలకు సంబంధం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ వివాదాలు సివిల్ అంశాలు అయినందున ఇందులో పోలీసుల జోక్యం అనవసరమని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం తేల్చి చెప్పింది. జల్‌పల్లిలోని నివాసం వద్ద మంగళవారం జరిగిన ఘటనలపై మోహన్ బాబు వ్యక్తిగతంగా పోలీస్ స్టేషన్‌కు హాజరై వివరణ ఇవ్వాలని రాచకొండ కమిషనర్ జారీ చేసిన షోకాజ్ నోటీసును ఈ నెల 24వరకు వాయిదా వేసింది. పోలీసులు ఇచ్చిన షోకాజ్ నోటీసును కొట్టివేయాలని, తనకు రక్షణ కల్పించాలని మోహన్‌బాబు వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మోహన్‌బాబు, ఆయన కుమారుడు మనోజ్ బౌన్సర్లను వెంటపెట్టుకోవడం సరికాదని, వారందరినీ అక్కడ నుంచి పంపించివేయాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే, జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ఒక కిలోమీటరు పరిధిలోకి సొంత కుటుంబసభ్యులు తప్ప వేరెవరూ వెళ్లరాదని పేర్కొంది. మనోజ్ వెంట కొందరు సంఘవ్యతిరేకులు, సోషల్ మీడియా, మీడియా ప్రతినిధులు వస్తున్నారని, తనకు పోలీసు రక్షణ కల్పించాలని మోహన్‌బాబు పిటిషన్‌లో అభ్యర్థించారు. మంగళవారం జరిగిన తోపులాటలో తనకు గాయాలయ్యాయని, ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పోలీసుల షోకాజ్ నోటీసును రద్దు చేయాలన్నారు. అయితే, ఈ నెల 8న తమ మధ్య జరిగిన గొడవ వ్యక్తిగతమని తెలిపారు. కుటుంబ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోకుండా నిరోధించాలని, పోలీసులు మనోజ్‌కు మద్దతిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో.. పోలీసులు మోహన్‌బాబు ఇంటికి ఎప్పటిలాగే రెండు గంటలకొకసారి తనిఖీలకు వెళ్లాలని, ఇంటిపై నిఘా పెట్టాలని హైకోర్టు ఆదేశించింది.

పోలీసులపై ఆరోపణలు సరికాదు

ఈ వ్యవహారంలో రాష్ట్ర హోంశాఖ తరఫు న్యాయవాది.. రాచకొండ కమిషనర్ ఎదుట బుధవారం మనోజ్ హాజరై వివరణ ఇచ్చారని, మోహన్‌బాబుకు జారీ చేసిన షోకాజ్ నోటీసును కొట్టేయాల్సిన అవసరం లేదని వాదించారు. పిటిషనర్ వచ్చి వివరణ ఇస్తే సమస్య ఏంటని, శాంతిభద్రతలను అదుపు చేయడానికి చట్టప్రకారం ఉన్న అధికారంతోనే కమిషనర్ నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వివాదంతో పోలీసుల మీద ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనే కేసు నమోదైనట్లు వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. మోహన్‌బాబు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నందున షోకాజ్ నోటీసును, తదుపరి విచారణను ఈ నెల 24వరకు వాయిదా వేసింది.

మంచు ఫైటింగ్స్‌లో శాంతి ఎపిసోడ్!

మోహన్‌బాబు కుటుంబ సమస్య పరిష్కారానికి సన్నిహితుల ప్రయత్నం!

- సీపీ ఎదుట మనోజ్, విష్ణు హాజరు
- మోహన్‌బాబు మేనేజర్ కిరణ్, విజయ్ అరెస్టు
- మీడియాకు క్షమాపణలు: మనోజ్
- మమ్మల్ని అమితంగా ప్రేమించడమే నాన్న తప్పు: విష్ణు
- మోహన్‌బాబుకు ఇంకా రెండు రోజులు చికిత్స అవసరం: వైద్యులు
- ఇన్‌స్టాలో మంచు లక్ష్మి 'శాంతి' మంత్రం


రాచకొండ కమిషనర్‌ను కలిసిన విష్ణు, మనోజ్

హైదరాబాద్/సిటీ/పహాడీషరీఫ్/రాయదుర్గం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబం.. దాడులు, ఘర్షణల నుంచి కొంత శాంతించింది. ఇంటి రచ్చను సర్దుబాటు చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టింది. తమ కుటుంబ సన్నిహితులతో మోహన్‌బాబు, ఆయన పెద్ద కుమారుడు విష్ణు మాట్లాడినట్లు, దీంతో వారు సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మోహన్‌బాబు కుటుంబ సభ్యుల రచ్చను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. బుధవారం ఆయన కుమారులు మనోజ్, విష్ణు ఇద్దరినీ వేర్వేరుగా పిలిచి విచారించారు. మరోవైపు మనోజ్ ఫిర్యాదు ఆధారంగా మోహన్‌బాబు మేనేజర్ వెంకటకిరణ్‌ను అరెస్టు చేశారు. కాగా, అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన మోహన్‌బాబు ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా లేదని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజులపాటు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండాలని చెప్పారు. మరోవైపు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి 'పీస్' అంటూ 'ఎక్స్'లో శాంతి మంత్రాన్ని పఠించగా.. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ ఇద్దరూ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. తన తండ్రి దేవుడని, ఆయన భుజంపై తుపాకీ పెట్టి ఇతరులు ఇవన్నీ చేయిస్తున్నారని మనోజ్ అన్నారు. మీడియా ప్రతినిధులపై దాడికి సంబంధించి తన తండ్రి తరఫున తాను క్షమాపణ చెబుతున్నానన్నారు. కాగా, మీడియాపై దాడి ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని విష్ణు అన్నారు. తమ కుటుంబ వివాదాన్ని మీడియా ఇంతటితో వదిలేయాలని కోరారు.

గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు..

మంచు మనోజ్ బుధవారం రాచకొండ సీపీ సుధీర్ బాబు ఎదుట విచారణకు హాజరయ్యారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను వివరించారు. దీంతో కుటుంబ సమస్యను కుటుంబంలోనే పరిష్కరించుకోవాలని, గొడవలకు దిగితే చట్టపరంగా చర్యలుంటాయని సీపీ స్పష్టం చేశారు. సీపీ ఆదేశంతో.. ఇకపై ఎలాంటి గొడవలకు వెళ్లనంటూ మనోజ్ రూ.లక్ష పూచీకత్తు సమర్పించారు. బయటకు వచ్చిన తర్వాత మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు నాన్నంటే ప్రాణమని, ఆయన దేవుడి లాంటి వారని అన్నారు. ఇప్పుడు చూస్తున్నది తన తండ్రి వ్యక్తిత్వం కాదని అన్నారు. తన అన్న విష్ణు ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతోందన్నారు. కాగా, పిల్లల్ని అమితంగా ప్రేమించడమే తన తండ్రి చేసిన తప్పు అని మంచు విష్ణు అన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇది తమ కుటుంబవిషయమని, ఈ విషయంలో భాగమైన బయటవాళ్లు వెనక్కి తగ్గాలని హెచ్చరించారు. మధ్యాహ్నం రాచకొండ సీపీ ఎదుట విష్ణు హాజరయ్యారు.

మోహన్‌బాబుపై కేసు..

మంగళవారం రాత్రి మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన ఘటనలో మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన ఇంటి వద్ద ఉన్న బౌన్సర్లను బైండోవర్ చేయించారు. ఇదిలా ఉండగా.. మోహన్‌బాబుకు బీపీ ఎక్కువగా ఉందని, మెడ నొప్పి, కాళ్ల నొప్పి తీవ్రంగా ఉన్నాయని కాంటినెంటల్ ఆస్పత్రి బులెటిన్‌లో పేర్కొంది. ఒంటిపై కూడా కొన్ని గాయాలున్నాయని, కంటి కింద వాపు ఉందని తెలిపింది. రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచుతామంది. మరోవైపు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి ఇన్‌స్టాగ్రామ్‌లో పీస్ (శాంతి) అంటూ కామెంట్ పెట్టారు. ఈ పోస్టుకు మనోజ్ భార్య మౌనిక లైక్ కొట్టారు.

మోహన్‌బాబుపై కేసు..

మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబును మా అసోసియేషన్ నుంచి తొలగించడంతోపాటు హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఫిల్మ్ చాంబర్ వద్ద మీడియా ప్రతినిధులు నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు జర్నలిస్టులు రాచకొండ కమిషనరేటట్ ఎదుట ఆందోళన చేపట్టారు.

ట్రాఫిక్ చలాన్ కట్టకపోతే ఇళ్లకు విద్యుత్, నీళ్ల సరఫరా ఆపేయాలి

- ఏపీలో నిబంధనలు పాటించని వాహనదారులు
- తెలంగాణ సరిహద్దుకు చేరగానే సీట్ బెల్టులు పెట్టుకుంటున్నారు: ఏపీ హైకోర్టు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ చలాన్లు కట్టనివారి ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అభిప్రాయపడింది. చలాన్లు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేసేందుకు చట్టనిబంధనలు వెసులుబాటు కల్పిస్తున్నాయని, అలా చేయకుండా మిమ్మల్ని ఎవరు ఆపారని పోలీసులు, ఆర్టీఏ అధికారులను న్యాయస్థానం ప్రశ్నించింది. ఏపీ వ్యాప్తంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల మూడు నెలల్లో 667 మంది మృత్యువాత పడ్డారు. నిబంధనలు సరిగ్గా అమలు చేయకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటిరవితో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పోలీసులు నిబంధనలు కఠినంగా అమలు చేస్తే ఇలాంటి పరిస్థితి రాదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కార్ల అద్దాలను నల్ల ఫిలిమ్‌లు ఉంటున్నాయని, ఎవరూ సీటు బెల్టులు పెట్టుకోవడం లేదని పేర్కొంది. కానీ తెలంగాణ లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని, అక్కడ వాహనదారులు నిబంధనలు పాటిస్తారని చెప్పింది. ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాల డ్రైవర్లు తెలంగాణ సరిహద్దుకు వెళ్లగానే సీట్ బెల్ట్ పెట్టుకుంటున్నారని, అద్దాలకు నల్ల ఫిలిమ్ ఉన్న కార్లు ఒక్కటీ హైదరాబాద్‌లో కనిపించవని, చట్టనిబంధలు కఠినంగా అమలు చేయడమే ఇందుకు కారణమని న్యాయస్థానం పేర్కొంది.

నవ్య | చిత్రజ్యోతి

విభిన్న వినోదం



ఎప్పటికప్పుడు కొత్త కథలు ఎన్నుకొని, వైవిధ్యమైన పాత్రలను చేస్తూ ప్రేక్షకులను అలరించే కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర చాలా గ్యాప్ తర్వాత మళ్లీ దర్శకత్వం చేపట్టి రూపొందించిన చిత్రం 'యు ఐ ద మూవీ' సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ సినిమాను ఈ నెల 20న గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం విజువల్‌గా, టెక్నికల్‌గా అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. రీష్మా నానయ్య కథానాయికగా నటించిన ఈ చిత్రంలో మురళీ శర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య, సాధు కోకిల, ఇంద్రజిత్ లంకేశ్ ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సహ నిర్మాత: నవీన్ మనోహరన్, నిర్మాతలు: జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్.

రెండో పెళ్లికి రెడీనా?



కొత్త ఏడాది తమ జీవితాల్లోకి సంతోషాల కాంతులు మోసుకురావాలని కోరుకోనివారెవరుంటారు!. నటి సమంత కూడా అదే ఆకాంక్షించారు. 2025లో రాశిఫలాల ప్రకారం తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌లో కొత్త సంవత్సరం ఎలా ఉండబోతోందో తెలిపే ఒక సందేశాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. వృత్తి జీవితంలో ఎదుగుదల, ఆర్థిక స్థిరత్వంతో పాటు నూతన సంవత్సరంలో ప్రేమ, విధేయత చూపించే భాగస్వామి లభిస్తారనీ, సంతానం కలుగుతుందని ఆ పోస్ట్‌లో ఉంది. అందులో పేర్కొన్న విధంగా తన జీవితంలో మంచి జరగాలని కోరుకుంటున్నట్లు సమంత తెలిపారు. ఇందులో ఉన్న కొన్ని అంశాలు సమంత జీవితానికి దగ్గరగా ఉండడం, వృషభ, కన్య, మకర మూడు రాశుల ప్రస్తావన తేవడంతో ఆమె తన రెండో పెళ్లి గురించి చెప్పకనే చెప్పారనీ, త్వరలో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారేమోనని నెటిజన్లు విశ్లేషిస్తున్నారు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో మాతృత్వాన్ని ఆస్వాదించాలని కోరుకుంటున్నట్లు సమంత తెలిపారు. ప్రస్తుతం ఆమె 'రక్త్ బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు.

తాండవం మొదలైంది



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'అఖండ 2 తాండవం' రెగ్యులర్ షూటింగ్ బుధవారం మొదలైంది. దర్శకుడు బోయపాటి తనదైన స్టైల్‌లో బ్రెత్ టేకింగ్ ఫైట్ సీక్వెన్స్‌తో షూటింగ్ ప్రారంభించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో రామ్, లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో ఈ ఫైట్ చిత్రీకరిస్తున్నారు. సంచలన విజయం సాధించిన 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మరింత యాక్షన్, గ్రిప్పింగ్ డ్రామాను అందిస్తుందని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెబుతున్నారు. భారీ తారాగణంతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విజయదశమి సందర్భంగా సెప్టెంబర్ 25న విడుదలవుతుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఫొటోగ్రఫీ! సి.రామ్‌ప్రసాద్, ఎడిటింగ్: తమ్మిరాజు.

ప్రేమ, వినోదం.. ఫంకీ



విష్వక్‌సేన్ హీరోగా నటించే 'ఫంకీ' చిత్రం షూటింగ్ బుధవారం మొదలైంది. 'జాతిరత్నాలు' చిత్ర దర్శకుడు అనుదీప్ కేవీ రూపొందిస్తున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. మరో దర్శకుడు కల్యాణ్ శంకర్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ ఆకట్టుకుంటోంది. ప్రేమ గుర్తులు కలిగిన ఈ పోస్టర్‌లో 'ఫ్యామిలీ ఎంటర్‌టైనర్' అనే పదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి వచ్చే ఏడాది సంక్రాంతి తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందనీ, అందర్నీ కడుపుబ్బా నవ్వించేలా సినిమా ఉంటుందనీ నిర్మాతలు చెప్పారు.

సుందరవల్లి రాయల్ లుక్



యువ కథానాయకుడు నిఖిల్ పోరాట యోధుడిగా నటిస్తున్న 'స్వయంభూ' చిత్రం శరవేగంతో జరుగుతోంది. హై బడ్జెట్, ఫస్ట్ క్లాస్ టెక్నికల్ స్టాండర్డ్స్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేశ్ నటిస్తున్నారు. వీరిలో నభా నటేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న సుందరవల్లి లుక్‌ని విడుదల చేశారు. రాయల్ ట్రెడిషనల్ లుక్‌లో మరింత అందంగా కనిపించారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న 'స్వయంభూ' చిత్రానికి కృష్ణమాచారి దర్శకుడు.


బాలీవుడ్ సినీ దిగ్గజం రాజ్‌కపూర్ శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం కపూర్ కుటుంబ సభ్యులు ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ నిర్వహిస్తున్న రాజ్‌కపూర్ శతజయంతి వేడుకలకు హాజరు కావాలని ప్రధానిని ఆహ్వానించారు. రణ్‌బీర్‌కపూర్, కరీనా కపూర్, సైఫ్ అలీఖాన్, కరిష్మా కపూర్, అలియాభట్, నీతూ కపూర్ తదితరులు ప్రధానిని కలిశారు.

పెళ్లి వేడుకలు ప్రారంభం



కథానాయిక కీర్తిసురేశ్ పెళ్లి వేడుకలు ప్రారంభమయ్యాయి. నేడు ఆమె తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌తో ఏడడుగులు వేయనున్నారు. గోవాలోని ప్రముఖ రిసార్ట్ వీరి పెళ్లికి వేదిక కానుంది. బుధవారం ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ వేడుకకు సిద్ధమవుతున్న ఫొటోను కీర్తి ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేశారు. ఇప్పటికే ఇరువైపులా కుటుంబ సభ్యులు గోవాకు చేరుకున్నారు. హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం జరగనుంది. కీర్తి, ఆంటోని పేర్లలోని తొలి అక్షరాలు కే ఏను ముద్రించిన హ్యాండ్ బ్యాండ్స్ అతిథులకు అందించేందుకు సిద్ధం చేశారు. అలాగే అతిథుల గదుల్లో తమ పెళ్లికి సంబంధించిన విశేషాలను తెలుపుతూ ముద్రించిన 'వెల్‌కమ్ టూ ద వెడ్డింగ్ మ్యాడ్‌నెస్' అనే మ్యాగజైన్స్‌ను కీర్తి ఉంచారట. కీర్తిసురేశ్ సన్నిహితులైన కొద్దిమంది సినీ ప్రముఖులు మాత్రమే ఈ పెళ్లి వేడుకల్లో పాల్గొంటారని తెలుస్తోంది.

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో దండోరా



'కలర్ ఫొటో', 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టి ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని 'దండోరా' పేరుతో కొత్త చిత్ర నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. నటుడు శివాజీ, నవదీప్, రాహుల్ రామకృష్ణ తదితరులు ప్రధాన పాత్రలు పోషించే ఈ చిత్రం తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటుంది. పురాతన ఆచారాలు, సంప్రదాయలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, హాస్యం, హృదయానికి హత్తుకొనే భావోద్వేగాలతో చిత్రం ఉంటుందని దర్శకుడు మురళీకాంత్ చెప్పారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఎస్కేఎన్ కెమెరా స్విచాన్ చేయగా, మరో నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు.

మూడు రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో మూడు రోజుల వరుస నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 16.09 పాయింట్ల లాభంతో 81,526.14 వద్ద ముగియగా నిఫ్టీ 31.75 పాయింట్ల లాభంతో 24,641.80 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ బుధవారం ఒక్క రోజే రూ.91,110.2 కోట్లు పెరిగి రూ.460.46 లక్షల కోట్లకు చేరింది. బుధవారం రాత్రి వెలువడే అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల కోసం భారత మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చి విభాగం హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

ఐపీఓల సబ్‌స్ర్కిప్షన్ అదుర్స్ : బుధవారం ప్రారంభమైన మూడు ఐపీఓలకు మదుపరుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వన్ మొబిక్విక్ సిస్టమ్స్ ఐపీఓ అయితే ఇష్యూ ప్రారంభమైన తొలి రోజు తొలి గంటలోనే పూర్తిగా సబ్‌స్ర్కైబ్ అయింది. రిటైల్ పోర్షన్ ఏడు రెట్లు, నాన్-ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.5 రెట్లు సబ్‌స్ర్కైబ్ అయ్యాయి.

● విశాల్ మెగా మార్ట్ ఇష్యూ తొలి రోజు ముగిసే సమయానికి 51 శాతం సబ్‌స్ర్కిప్షన్ సాధించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 53 శాతం సబ్‌స్ర్కిప్షన్ నమోదయింది.

● సాయి లైఫ్ సైన్సెస్ ఇష్యూ కూడా తొలి రోజు ముగిసే సమయానికి 84 శాతం సబ్‌స్ర్కిప్షన్ సాధించింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 18 శాతం సబ్‌స్ర్కిప్షన్ వచ్చింది.

హైదరాబాద్ విమానాశ్రయంలో ఏపీఓసీ సెంటర్

దేశంలోనే తొలి ఏఐ ఆధారిత కేంద్రం

ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పని చేసే ఎయిర్‌పోర్ట్ ప్రెడిక్టివ్ ఆపరేషన్ సెంటర్‌ను (ఏపీఓసీ) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభం భారత విమానయాన చరిత్రలోనే ఒక కొత్త అధ్యాయమని ఆయన అన్నారు. దేశంలో ఏఐ, ప్రిస్ర్కిప్టివ్ అనలిటిక్స్, ఐఓటీ ఆధారంగా పని చేసే ఇలాంటి ఒక కేంద్రం ఏర్పాటు కావడం ఇదే ప్రథమం. ఈ సెంటర్ ఎయిర్ సైడ్ (విమానాల రాకపోకలు నిర్వహించే ప్రాంతం), ల్యాండ్‌సైడ్ (వాహనాల రాకపోకలు, పార్కింగ్ వంటివి), టెర్మినల్ (ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతం) నిర్వహణా కార్యకలాపాలన్నింటినీ ఒకే వ్యవస్థ పరిధిలోకి తెస్తుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిశోర్ చెప్పారు. దీని వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణానుభూతి కల్పించే వీలు కలుగుతుందన్నారు. వాస్తవిక డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకుని అంతరాయాలు తగ్గించడంతో పాటు నిరంతరాయంగా కార్యకలాపాలు సాగించేందుకు ఈ కేంద్రం సహాయకారిగా ఉంటుందని చెప్పారు. దశలవారీగా జీఎంఆర్ నిర్వహణలోని విమానాశ్రయాలన్నింటికీ ఈ వ్యవస్థను విస్తరించాలనుకుంటున్నామంటూ ఢిల్లీ విమానాశ్రయంలో ఈ వ్యవస్థ కొద్ది నెలల్లో ఏర్పాటు కానున్నట్టు చెప్పారు. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్ నిర్వహణ వ్యవస్థను ఆధునీకరించవలసి ఉన్నదంటూ ఇతర విమానాశ్రయాల్లో కూడా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. హైదరాబాద్ విమానాశ్రయం సాధించిన అద్భుతమైన వృద్ధిని ఆయన కొనియాడారు. 2010 సంవత్సరంలో 65 లక్షల మంది ప్రయాణికులు, 220 రోజువారీ విమాన సర్వీసుల స్థాయి నుంచి నేడు 2.5 కోట్ల మంది ప్రయాణికులు, 550 రోజువారీ విమాన సర్వీసుల స్థాయికి ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. దేశీయ విమానయాన రంగంలో కూడా అద్భుతమైన పురోగతి ఏర్పడుతున్నదంటూ నవంబరు 17వ తేదీన ఒక్క రోజులోనే 5 లక్షల మంది వివిధ దేశీయ గమ్యాలకు ప్రయాణించారని, ఇది ఒక కొత్త రికార్డు అని చెప్పారు. ప్రజలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిరంతరాయంగా ప్రయాణించగల వసతులు అందుబాటులో ఉంచాలన్నదే మంత్రిగా తన లక్ష్యమన్నారు.

కొత్త టెర్మినల్, రెండో రన్‌వే

హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య ఏడాదికి 4.5 కోట్లు చేరితే రెండో రన్ వే ప్రారంభించడంతో పాటు కొత్త టెర్మినల్ నిర్మించే విషయం పరిశీలిస్తామని కిశోర్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఏటా 3 కోట్లున్న ప్రయాణికుల సంఖ్య 2030 నాటికి 4.5 కోట్లు చేరుతుందని అంచనాగా చెప్పారు. ముందస్తు అంచనాలు, తమ అనుభవం ఆధారంగా సామర్థ్యాల విస్తరణ ప్రణాళికల రూపకల్పన ఇప్పటికే చేపట్టామని ఆయన చెప్పారు. ఏటా 1.2 కోట్ల ప్రయాణికుల సామర్థ్యంతో 2008 సంవత్సరంలో నిర్మించిన జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఏటా 3.4 కోట్ల మంది ప్రయాణికులను తరలించగల మౌలిక వసతులను దశలవారీగా ఇప్పటికే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విమానాశ్రయంలో ఒక ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ ఉంది.

ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాం

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా



ముంబై: తన హయాంలోనూ విధానపరమైన ద్రవ్య విషయాల్లో ఎలాంటి మార్పు ఉండదని ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు, స్పందించేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా ఉంటుందన్నారు. 'మనం సుస్థిరమైన ద్రవ్య విధానాలు కొనసాగించాల్సి ఉంది. అలా అని వాటికే అంటుకుపోయి ఉండకూడదు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండక తప్పదు' అన్నారు. ద్రవ్యోల్బణ నియంత్రణ, కీలక వడ్డీ రేట్ల తగ్గింపుపై మాత్రం మల్హోత్రా నోరు మెదప లేదు.

ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

ప్రజా ప్రయోజనాలే ప్రాతిపదికగా ఆర్‌బీఐ నిర్ణయాలు తీసుకుంటుందని మల్హోత్రా స్పష్టం చేశారు. ఆర్థిక సేవలు అందరికీ అందుబాటులోకి తేవడంపై తాను ప్రత్యేకంగా దృష్టి పెట్టబోతున్నట్టు తెలిపారు. ఇందుకోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఫైనాన్షియల్ రెగ్యులేటర్లతోనూ సమన్వయపూర్వకంగా పని చేస్తామని చెప్పారు. టెక్నాలజీ సాయంతో బ్యాంకింగ్ సేవలను అందరికీ చేరువ చేసేందుకూ మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జూబిలెంట్ భార్తియా గ్రూప్ చేతికి

కోకా-కోలాలో 40% వాటా

డీల్ విలువ రూ.10,000 కోట్లు!?



న్యూఢిల్లీ: భారత బాట్లింగ్ వ్యాపారం 'హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్'లో (హెచ్‌సీసీబీఎల్) 40 శాతం వాటాను జూబిలెంట్ భార్తియా గ్రూప్‌నకు విక్రయిస్తున్నట్టు అంతర్జాతీయ శీతల పానీయాల దిగ్గజం కోకా-కోలా బుధవారం ప్రకటించింది. డీల్ విలువను మాత్రం వెల్లడించలేదు. అయితే, ఈ ఒప్పందం విలువ రూ.10,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని మార్కెట్ వర్గాల అంచనా. హెచ్‌సీసీబీఎల్ మాతృ సంస్థ హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (హెచ్‌సీసీహెచ్) వ్యూహాత్మక పెట్టుబడి ద్వారా 40 శాతం వాటా కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం కుదుర్చుకున్నట్టు భార్తియా గ్రూప్ తన ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబరులో ఏర్పాటు చేసిన జూబిలెంట్ బెవరేజెస్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఈ కొనుగోలు జరుపుతున్నట్టు తెలిపింది. భారత మార్కెట్లో హెచ్‌సీసీబీ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగించడంతోపాటు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ పెట్టుబడులు దోహదపడనున్నాయని భార్తియా గ్రూప్ పేర్కొంది. నియంత్రణ మండళ్ల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. పార్లే బిస్లెరీకి చెందిన రమేశ్ చౌహాన్ నుంచి థమ్సప్ సహా పలు బ్రాండ్ల కొనుగోలు ద్వారా కోకా-కోలా కంపెనీ 1993లో భారత మార్కెట్లోకి పునః ప్రవేశించింది.

అంతర్జాతీయంగా కీలకేతర ఆస్తులను తగ్గించుకునే వ్యూహంలో భాగంగా కోకా-కోలా భారత బాట్లింగ్ బిజినెస్‌లోనూ వాటా విక్రయించింది. హెచ్‌సీసీబీఎల్ ఏపీ, తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో బాట్లింగ్ యూనిట్లను కలిగి ఉంది. కోకో కోలా, స్ప్రైట్, థమ్సప్, లిమ్కా, మాజా, ఫాంటా, మినిట్ మెయిడ్, కిన్లే వాటర్ వంటి ప్రముఖ బ్రాండ్లతో సహా మొత్తం 8 విభాగాల్లో 37 భిన్న ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తోంది. కోకా-కోలాకు భారత్ ఐదో అతిపెద్ద మార్కెట్. జూబిలెంట్ భార్తియా గ్రూప్‌నకు చెందిన జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ దేశంలోని అతిపెద్ద క్యూఎస్ఆర్ చైన్ ఆపరేటర్లలో ఒకటి. డామినోస్ పిజ్జా, పాపైస్, డంకిన్, హాంగ్స్ కిచెన్, కెఫే బ్రాండ్ కాఫీ సైతం ఈ గ్రూప్‌నకు చెందినవే. భారత్‌తోపాటు ఇతర దేశాలకూ వ్యాపారాన్ని విస్తరించింది. ఇండియా, టర్కీ, బంగ్లాదేశ్, శ్రీలంక, అజర్‌బైజాన్, జార్జియా మార్కెట్లలో మొత్తం 3,130 స్టోర్లను నిర్వహిస్తోంది.

బిగ్ సీ 22వ వార్షికోత్సవ ఆఫర్లు

హైదరాబాద్: దక్షిణాదిలో అతిపెద్ద మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ.. 22వ వార్షికోత్సవ ఆఫర్లను ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువైన స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువైన ఇయర్ బర్డ్స్‌ను రూ.22కే అందిస్తున్నట్టు బిగ్ సీ సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపారు. అంతేకాదు, 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాక్, మొబైల్ కొనుగోలు కోసం జీరో డౌన్‌పేమెంట్, నో కాస్ట్ ఈఎంఐ ఆఫర్లను సైతం అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇవే గాక, ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన ఒక బహుమతిని కూడా అందిస్తామన్నారు. వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మీ, వన్‌ప్లస్ మొబైల్ కొనుగోలుపై 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాక్, సామ్‌సంగ్ మొబైల్ కొనుగోలుపై రూ.20,000 వరకు తక్షణ క్యాష్ బ్యాక్, ఐఫోన్ కొనుగోలుపై రూ.7,000 వరకు తక్షణ డిస్కౌంట్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్ కూడా కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్‌లు కొనుగోలు చేసే సదుపాయాన్నీ కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు.

మళ్లీ రూ.80,000 దాటిన పసిడి

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ మళ్లీ జోరందుకుంది. పది గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర బుధవారం ఢిల్లీలో రూ.620 పెరిగి రూ.80,400 వద్ద ముగిసింది. కిలో వెండి రూ.1,450 లాభంతో రూ.96,300కు చేరింది. గత నెల రోజుల్లో వెండి ధరలో భారీ పెరుగుదల ఇదే. దేశీయ మార్కెట్‌లో రిటైలర్లు, నగల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలూ ఇందుకు తోడయ్యాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 2,700 డాలర్లకు చేరువైంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు పుంజుకోవడం కూడా ఇందుకు దోహదం చేస్తున్నట్టు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ కమొడిటీస్ రెసెర్చి అనలిస్టు మానవ్ మోదీ చెప్పారు.

సిడ్నీలో సైయెంట్ కొత్త కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంటెలిజెంట్ ఇంజనీరింగ్ సర్వీసుల రంగంలోని సైయెంట్ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నూతన కార్యాలయం ప్రారంభించినట్టు ప్రకటించింది. న్యూ సౌత్ వేల్స్‌లోని పరమటాలో ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇందులో 100 మందికి పైగా అసోసియేట్లు పని చేయగల వసతి ఉన్నట్టు తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,470 ▲	72,850 ▲	1,03,000 ▼
విజయవాడ	80,400 ▲	74,000 ▲	95,000 ▼
విశాఖపట్నం	76,490 ▲	72,850 ▲	1,03,000 ▼
ప్రొద్దుటూరు	79,600 ▲	73,710 ▲	94,500 ▲
ముంబై	77,670 ▲	71,140 ▼	92,700 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ

హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	81	విజయవాడ	94
వరంగల్	81	గుంటూరు	94
కరీంనగర్	81	ఒంగోలు	94
మహబూబ్‌నగర్	81	చిత్తూరు	80
కర్నూలు	81	నెల్లూరు	80
విశాఖపట్నం	96	అనంతపురం	80
గోదావరి	94		

అయ్యో.. మళ్లీనా!



లిరెన్‌తో గుకేష్ 13వ గేమ్ డ్రా
నేడే ఆఖరి రౌండ్
గేమ్ గెలిస్తే టైటిల్ సొంతం
డ్రాగా ముగిస్తే టైబ్రేక్‌లో ఫలితం
వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, యువ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ మధ్య ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోరు ముగింపు దశకు చేరుకుంటున్నా మళ్లీ అదే ఫలితం.. అత్యంత ఉత్కంఠ రేపిన టోర్నీ చివరిరౌండ్‌నకు ముందు గేమ్‌లోనూ ఎవరినీ వరించని విజయం.. బుధవారం జరిగిన కీలకమైన 13వ గేమ్ కూడా డ్రాగా ముగిసింది. మరో రౌండ్ మాత్రమే మిగిలున్న ఈ టోర్నీలో తాజా ఫలితంతో లిరెన్, గుకేష్ చెరో 6.5 పాయింట్లతో సమంగా నిలిచారు. గురువారం ఆఖరిదైన 14వ రౌండ్ జరగనుంది. ఈ గేమ్‌లో గెలిచిన ఆటగాడు 7.5 పాయింట్లతో చాంపియన్‌గా నిలుస్తాడు. ఒకవేళ ఆఖరి గేమ్ డ్రాగా ముగిస్తే.. టైబ్రేక్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఇక, దాదాపు ఐదు గంటలపాటు సాగిన బుధవారం నాటి గేమ్‌లో 18 ఏళ్ల గుకేష్ తెల్లపావులతో ఆడాడు. 40 ఎత్తుల తర్వాత లిరెన్‌పై పైచేయి సాధించే అవకాశం గుకేష్‌కు లభించింది. కానీ, దాన్ని గుకేష్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఈ క్రమంలో 32 ఏళ్ల లిరెన్ అత్యంత చాకచక్యంగా పావులు కదుపుతూ గేమ్‌ను ముందుకు తీసుకెళ్లాడు. కొన్ని ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు ఎలాంటి రిస్క్ తీసుకోలేదు. చివరకు 68 ఎత్తుల తర్వాత గేమ్‌ను డ్రాగా ముగించారు.

గాబాలో తస్మాత్ జాగ్రత్త!

ఆసీస్‌కు అదిరే రికార్డులు



ఇవీ రికార్డులు
మొత్తం మ్యాచ్‌లు 66
గెలిచినవి: 42; ఓడినవి: 10
డ్రాలు: 13; టై: 1

బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కీలకమైన మూడో టెస్ట్‌కు ప్రఖ్యాత స్టేడియం గాబా సిద్ధమైంది. బౌన్స్‌తో పర్యాటక బ్యాటర్లను బెంబేలెత్తించే ఈ వికెట్.. ఒకరకంగా ఆతిథ్య ఆస్ట్రేలియాకు పెట్టనికోట. ఇక్కడ క్రిస్మస్ ముందు జరిగిన 61 మ్యాచ్‌లో కంగారూలు 7 సార్లు మాత్రమే ఓడారు. కానీ, క్రిస్మస్ తర్వాత ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో మూడు టెస్టుల్లో పరాజయం చవిచూశారు. 1988 నుంచి గాబా స్టేడియంలో ఓటమి ఎరుగని ఆసీస్‌కు 2021లో భారత్ పరాజయాన్ని రుచిచూపింది. ఆ తర్వాత వెస్టిండీస్ జట్టు ఆసీస్‌ను కంగుతినిపించింది. అయితే, ఈ రెండు టెస్టులు జనవరిలో నిర్వహించడం గమనార్హం. బ్రిస్బేన్ వికెట్ పేస్, బౌన్స్‌తో బ్యాటర్లకు సవాల్ విసురుతుంది. క్రిస్మస్‌కు ముందు ఇది మరింత ఎక్కువగా ఉండనుండడంతో ఆసీస్ పేసర్లు చెలరేగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో శనివారం నుంచి జరిగే టెస్ట్‌కు గాబాను వేదికగా ఎంపిక చేయడం సెంటిమెంటల్‌గా కంగారూలకు కలసి వచ్చేదే. పైగా వర్షం కురుస్తుండడంతో ఫాస్ట్ బౌలర్లకు మరింతగా సహకారం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. 'వివిధ కాలాల్లో గాబా వికెట్ భిన్నంగా ప్రతిస్పందిస్తుంది. సీజన్‌కు ముందు పిచ్ తాజాగా ఉంది. గతంలో తరహాలోనే వికెట్‌ను రూపొందించాం. పేస్, బౌన్స్‌కు గాబా ప్రత్యేకం అన్న విషయం తెలిసిందే'నని క్యూరేటర్ డేవిడ్ శాండుర్‌స్కీ చెప్పాడు.

బ్రిస్బేన్ చేరిన టీమిండియా..

టీమిండియా అడిలైడ్ నుంచి బ్రిస్బేన్‌కు చేరుకొంది. ఎయిర్‌పోర్ట్ నుంచి ఆటగాళ్లు బయటికొస్తున్న వీడియోను బీసీసీఐ నెట్‌లోపోస్టు చేసింది. క్రికెటర్లందరూ ఉల్లాసంగా కనిపించారు.

గాబా కూల్చివేత ప్రణాళిక రద్దు..

2032లో జరిగే విశ్వక్రీడల కోసం గాబా స్టేడియాన్ని కూల్చి నూతనంగా నిర్మించాలన్న ఆలోచనను బ్రిస్బేన్ ఒలింపిక్స్ నిర్వాహకులు తిరస్కరించారు. పార్క్‌లాండ్‌లో కొత్తగా స్టేడియాన్ని నిర్మించాలన్న ఐడియాను కూడా తోసిపుచ్చారు. ఒలింపిక్స్ ఆరంభ, ముగింపు ఉత్సవాలను నిర్వహించేలా అందుబాటులో ఉన్న సన్‌కార్ప్ రగ్బీ స్టేడియాన్ని ఆధునికీకరిస్తారు.



క్రికెట్ పండుగకు సిద్ధం

ఈనెల 14 నుంచి జరిగే టెస్ట్‌ను పురస్కరించుకొని ఇక్కడి భారతీయులు సన్నాహకాలను ఆరంభించారు. మన సంప్రదాయ వంటకాలతో పాటు జాతీయ జెండాలతో స్టేడియంలో పండుగ వాతావరణం సృష్టించనున్నారు. ఈపాటికే టీమిండియా జెర్సీలకు తోడు రోహిత్, కోహ్లీ ఫొటోలకు మంచి డిమాండ్ నెలకొంది. 'టీమిండియా మూడు నాలుగేళ్లకొకసారి ఇక్కడకు వస్తుంటుంది. అప్పుడే మ్యాచ్ చూడడానికి స్టేడియానికి వెళ్తాం. ఒకరకంగా మాకిది పండుగ' అని ఓ అభిమాని చెప్పాడు. 2021 తరహాలో భారత జట్టు మరోసారి అద్భుతం చేయాలని బలంగా కోరుకొంటున్నట్టు అతను చెప్పాడు.

మంధాన పోరాడినా!




● మూడో వన్డేలోనూ భారత్‌కు ఓటమి
● 3-0తో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్
● సదర్లాండ్ సెంచరీ ● గార్డ్‌నర్‌కు 5 వికెట్లు

పెర్త్: ఓపెనర్ స్మృతి మంధాన (109 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 105) సెంచరీతో పోరాడినా.. మిగతా వారి నుంచి తగిన సహకారం అందకపోవడంతో ఆస్ట్రేలియా చేతిలో భారత్ మహిళల జట్టుకు పరాభవం తప్పలేదు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 83 పరుగుల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. దీంతో సిరీస్‌ను కంగారూలు 3-0తో నెగ్గారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు చేసింది. పేసర్ అరుంధతి (4/26) దెబ్బకు.. ఓపెనర్లు వోల్ (25), లిచ్‌ఫీల్డ్ (26)తోపాటు పెర్రీ (4), బెత్ మూనీ (10) అవుట్ కావడంతో ఆసీస్ 78/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో గార్డ్‌నర్ (50)తో కలసి ఐదో వికెట్‌కు 96 పరుగులు జోడించిన అనబెల్ సదర్లాండ్ (110).. కెప్టెన్ తహిల మెక్‌గ్రాత్ (56)తో కలసి ఏడో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు సవాల్ విసరగలిగే స్కోరును అందించింది. ఛేదనలో భారత్ 45.1 ఓవర్లలో 215 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ గార్డ్‌నర్ (5/30) ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్ వెన్నువిరిచింది. ఓపెనర్ రిచా (2) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మంధాన, హర్లీన్ డియోల్ (39) రెండో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, హర్లీన్‌ను అవుట్ చేసిన కింగ్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించింది. హర్మన్‌ప్రీత్ (12)ను సదర్లాండ్ బోల్తా కొట్టించగా.. 189 పరుగుల స్కోరు వద్ద శతకం పూర్తి చేసుకొన్న మంధానాను గార్డ్‌నర్ బౌల్డ్ చేయడంతో భారత్ ఒక్కసారిగా ఒత్తిడికి లోనైంది. అదే స్కోరు వద్ద దీప్తి (0), జెమీమా (16) కూడా అవుట్ కావడంతో కోలుకోలేక పోయింది. మిన్నూమణి (8), అరుంధతి (5), సైమా (0)లను గార్డ్‌నర్ అవుట్ చేయగా.. టిటాస్ సాధు (3)ను కింగ్ పెవిలియన్ చేర్చింది.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 50 ఓవర్లలో 298/6 (సదర్లాండ్ 110, తహిల 56; అరుంధతి 4/26);
భారత్: 45.1 ఓవర్లలో 215 ఆలౌట్ (మంధాన 105, హర్లీన్ 39; గార్డ్‌నర్ 5/30).

దిగజారిన కోహ్లీ, రోహిత్ ర్యాంకులు



దుబాయ్: ఆస్ట్రేలియాతో అడిలైడ్ టెస్ట్‌లో ఘోరంగా విఫలమైన స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల ఐసీసీ ర్యాంకులు దారుణంగా దిగజారాయి. బుధవారం విడుదలైన టెస్ట్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో విరాట్ 14వ స్థానం నుంచి 20కి పడిపోయాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌ల్లో విరాట్ వరుసగా 7,11 పరుగులే చేశాడు. ఇక ఇదే గులాబీ టెస్ట్‌లో ఆరో నెంబర్‌లో బరిలో దిగిన కెప్టెన్ రోహిత్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తొమ్మిది పరుగులే సాధించాడు. ఫలితంగా ఐదు ర్యాంకులు కోల్పోయిన రోహిత్ 31వ స్థానంలో నిలవడం గమనార్హం. గత ఆరేళ్లలో రోహిత్ 30వ స్థానంకంటే కిందికి పడిపోవడం ఇదే తొలిసారి. యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ తన అత్యుత్తమ ర్యాంకును కొనసాగిస్తూ నాలుగో స్థానంలో నిలిచాడు. బౌలర్ల విభాగంలో బుమ్రా తన టాప్ ర్యాంక్‌ను కొనసాగించాడు.

ట్రిపుల్ జంప్‌లో ప్రణయ్‌కు కాంస్యం



భువనేశ్వర్: జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ కుర్రాడు ప్రణయ్ పతకంతో మెరిశాడు. బుధవారం ఇక్కడ జరిగిన ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో ప్రణయ్ 15.07 మీటర్లు లంఘించి మూడోస్థానంతో కాంస్యం దక్కించుకున్నాడు.

ప్లేఆఫ్స్‌కు హరియాణా

పుణె: ప్రొ.కబడ్డీ తాజా సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా హరియాణా స్టీలర్స్ నిలిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా 37-26తో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. స్టీలర్స్‌లో వినయ్ (9), శివమ్ (8) అదరగొట్టారు. బెంగళూరు జట్టులో జతిన్ (5), నితిన్ (5), ప్రతీక్ (5) మాత్రమే రాణించారు. మరో మ్యాచ్‌లో యు ముంబా 47-31తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

టీఓఏ పీఠంపై జితేందర్

34 ఓట్లతో విజయం ● కార్యదర్శిగా మల్లారెడ్డి



హైదరాబాద్: అత్యంత ఉత్కంఠ రేపిన తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) కార్యవర్గం ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పైచేయి సాధించారు. సంఘం అధ్యక్షునిగా జితేందర్ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఆయన తన ప్రత్యర్థి చాముండేశ్వరనాథ్‌పై 34 ఓట్ల తేడాతో గెలుపొందారు. జితేందర్‌కు 43 ఓట్లు పోలవగా.. చాముండికి 9 ఓట్లు దక్కాయి. కార్యదర్శి పదవిని మల్లారెడ్డి దక్కించుకున్నారు. 40 ఓట్లు సొంతం చేసుకున్న ఆయన బాబురావు (12)ను ఓడించారు. కోశాధికారి పదవికి సతీష్ గౌడ్ ఎన్నికయ్యారు. సతీష్‌కు 40, ప్రత్యర్థి ప్రదీప్‌కు 12 ఓట్లు దక్కాయి. టీఓఏ నూతన కార్యవర్గం కోసం గతనెల 21వ తేదీనే ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరగగా.. మిగతా పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయి. అయితే, కోర్టులో స్టే ఉండడంతో అప్పట్లో ఎన్నికల కౌంటింగ్‌ను నిలిపివేశారు. కోర్టు స్టే ఎత్తివేయడంతో తాజాగా ఫలితాలను ప్రకటించారు. నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు పదవిలో ఉండనుంది.

జితేందర్ ఎన్నిక చెల్లదు: చాముండి

టీఓఏ అధ్యక్షునిగా జితేందర్ రెడ్డి గెలిచినా, అతని ఎన్నిక చెల్లదని చాముండేశ్వరనాథ్ ఆరోపించారు. క్రీడా బిల్లు నిబంధనల ప్రకారం 70 ఏళ్లు పైబడిన వారు ఎన్నికల్లో పోటీకి అనర్హులనీ, ఆ రకంగా చూస్తే జితేందర్ అధ్యక్ష స్థానానికి అర్హుడు కాదని చాముండి అన్నారు. భారత ఒలింపిక్ సంఘం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాననీ, త్వరలో తానే టీఓఏ పీఠాన్ని అధిష్ఠిస్తానని చెప్పారు.



గాయత్రి జోడీకి నిరాశ

హాంగ్జౌ (చైనా): ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూబీఎఫ్) వరల్డ్ టూర్ ఫైనల్స్ తొలి మ్యాచ్‌లో గాయత్రి /ట్రీసా జాలీ ద్వయం పోరాడి ఓడింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీ గ్రూప్ 'ఎ'లో తలపడుతున్న గాయత్రి జోడీ మొదటి మ్యాచ్‌లో ప్రపంచ నెంబర్ వన్ జంట లియు షెంగ్ షు/టాన్ నింగ్‌కు గట్టి పోటీనిచ్చింది. చివరకు 20-22, 22-20, 14-21తో పరాజయం చవిచూసింది. గురువారం జరిగే గ్రూపు రెండో మ్యాచ్‌లో పెర్లీ టాన్/తినా మురళీధరన్ (మలేసియా) జోడీని గాయత్రి/ట్రీసా జంట ఢీకొంటుంది.

జింబాబ్వే ఉత్కంఠ విజయం

హరారే: ఉత్కంఠగా జరిగిన తొలి టీ20లో జింబాబ్వే 4 వికెట్లతో అఫ్ఘానిస్థాన్‌ను ఓడించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 144 పరుగులు సాధించింది. జనత్ (54), నబి (44) రాణించారు. ఛేదనలో జింబాబ్వే 145/6 స్కోరు చేసి గెలిచింది. బ్రియాన్ (49), మేయర్స్ (32) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు

» అట్టహాసంగా ప్రారంభం... అంతలోనే పగుళ్లు


కళాక్షేత్రం గోడకు ఏర్పడిన పగుళ్లు

హనుమకొండ టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరిట వరంగల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. గత నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ భవనం అట్టహాసంగా ప్రారంభమైంది. అయితే నెల రోజులు కూడా కాకముందే పెచ్చులూడిన, పగుళ్లు తేలిన గోడలు దర్శనమివ్వడంతో నాణ్యత విషయంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించపోవడం వల్లే ఇలా జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిని తలదన్నేలా వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మిస్తామని బీఆర్ఎస్ హయాంలో హనుమకొండ బాలసముద్రంలో 4.20ఎకరాల స్థలంలో రూ.52కోట్ల అంచనా వ్యయంతో 2014 సెప్టెంబరు 9న కాళోజీ జయంతి రోజున శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రెండేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ దశాబ్దానికి కూడా కాలేదు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక పెండింగ్‌లో ఉన్న పనులు చకచకా పూర్తిచేసి నవంబర్ 19న భవనాన్ని ప్రారంభించారు.

తెలంగాణలో సమీకృత స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యంకాదు:కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సెయిల్ ఆధ్వర్యంలో తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ స్థాపనకు అవకాశంలేదని గతంలోనే కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ తెలిపిందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం లోక్‌సభలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వీలుగా టీఎస్ఎండీసీఎల్‌కు 65.20 చదరపు కిలోమీటర్ల పరిధిలో ముడి ఇనుము ఖనిజ నిల్వల కోసం ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వం 2019లో పంపిందన్నారు. దీనిపై కేంద్ర ఉక్కు శాఖ, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ చర్చలు జరిపాయని చెప్పారు. ఈ పరిశీలనలో తెలంగాణలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ఆధ్వర్యంలో సమీకృత స్టీల్ ప్లాంట్ సాధ్యంకాదని ఉక్కు మంత్రిత్వ శాఖ చెప్పినట్లు తెలిపారు. ముడి ఇనుము, ఖనిజ ప్రాంతాన్ని రిజర్వు చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనను 2021లో తిరిగి పంపించినట్లు కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు.

విద్యార్థుల సమస్యలు పట్టవా రేవంత్?:కవిత

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు పాఠశాలల్లో భోజనం అందించలేని చేతగాని స్థితిలో ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డికి సర్కారు బడులు, గురుకులాల్లో విద్యార్థుల సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన తనకు ఆందోళన కలిగించిందన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రతిరోజూ ఏదో ఒక చోట ఆహారం వికటించి విద్యార్థులు ఆస్పత్రి పాలవుతుండటంతో తల్లిదండ్రుల్లో భయాందోళనలు నెలకొన్నాయన్నారు.

కేటీఆర్‌వి దిగజారుడు మాటలు:సామ రామ్మోహన్

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ నాటకాలు.. దిగజారుడు మాటలను తెలంగాణ సమాజం గమనిస్తోందని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై కేటీఆర్ విమర్శలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు కేసీఆర్ కుంగిపోతారని పేర్కొన్నారు. కవిత.. తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లి అంటున్నారని అయితే ప్రపంచం అంతా కవితను లిక్కర్ రాణి.. అని పిలుస్తున్నారని విమర్శించారు.

మేడిగడ్డపై రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం:వినోద్

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతులు చేసే విషయంపై నిర్ణయం తీసుకోకుండా రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులు చేయడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) పర్మిషన్ తీసుకోవాలని డ్యామ్ సేఫ్టీ చట్టంలో ఎక్కడా లేదని, రాష్ట్రప్రభుత్వం ఎన్‌డీఎస్ఏ చేతిలో నిర్ణయం ఉంటుందని చెప్పడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయని వినోద్‌కుమార్ విమర్శించారు. కేసీఆర్‌ను బద్నాం చేయడానికి మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందని కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, తప్పు జరిగితే చర్యలు తీసుకోవాలని అన్నారు.

సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్ మోసం

» రూ.217.55కోట్ల ధాన్యం బహిరంగ మార్కెట్లో విక్రయం

నేరేడుచర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ప్రభుత్వానికి అప్పగించని రైస్ మిల్లుల యజమానిపై పౌరసరఫరాల అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలోని తిరుమల బియ్యం మిల్లు, గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలోని సంతోషిమా బియ్యం మిల్లుకు ప్రభుత్వం రూ. రూ.217.55 కోట్ల విలువైన 32,779 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా తిరిగి బియ్యం ఇవ్వలేదు. ఈ నెల 10వ తేదీన రెండు మిల్లుల్లో పౌరసరఫరాల అధికారులు తనిఖీ చేయగా.. ధాన్యంలేకపోవడంతో బయట విక్రయించినట్లు తేలింది. దాంతో ఆ మిల్లుల యజమాని గౌరు రాజేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ డీఎం ప్రసాద్ తెలిపారు.

పింఛనుదారుల సమస్యలను పరిష్కరించండి

» సీఎంకు పింఛనుదారుల ఐకాస లేఖ

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పింఛనుదారుల ఐకాస ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బుధవారం లేఖ రాసింది. పింఛనుదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం తమను ఆహ్వానించాలని ఐకాస చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శి టి.శుభాకర్‌రావు లేఖలో పేర్కొన్నారు. ఇటీవల ఉద్యోగుల ఐకాసతో చర్చలు జరిపినట్లే.. పింఛనుదారుల సమస్యలు కూడా వినాలని కోరారు.

ఏసీబీ కస్టడీకి ఇరిగేషన్ ఏఈఈ నిఖేష్

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో అరెస్టయి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) హెచ్ నిఖేష్ కుమార్‌ను ఏసీబీ తమ కస్టడీలోకి తీసుకోనుంది. కోర్టు ఆదేశాల మేరకు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు నిఖేష్‌ను విచారణ చేయనుంది. నిఖేష్‌ను తమకు అప్పగిస్తే దాదాపు ఎనిమిది బ్యాంకు లాకర్లలో దాచిన సొత్తును గుర్తించడానికి అవకాశం ఉంటుందని ఏసీబీ అధికారులు నాంపల్లిలోని ఏసీబీ కోర్టును బుధవారం ఆశ్రయించారు. దీంతో కోర్టు నాలుగు రోజులు కస్టడీకి అనుమతించింది. కాగా, రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ ఏఈఈగా పని చేసిన నిఖేష్ ఇంటితో పాటు అతడి బంధువులు, స్నేహితుల ఇళ్లు సహా మొత్తం 23 చోట్ల నవంబరు 30న ఏకకాలంలో దాడి చేసిన ఏసీబీ సుమారు. 17.73 కోట్ల అక్రమ ఆస్తులను, కిలో బంగారాన్ని గుర్తించింది. వీటి మార్కెట్ విలువ రూ.200 కోట్ల పైమాటే. కాగా, గండిపేటలో విధులు నిర్వహిస్తుండగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలకు నిఖేష్ ఇష్టానుసారం అనుమతులిచ్చి భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శబరిమలకు 26 ప్రత్యేక రైళ్లు : ద.మ. రైల్వే

హైదరాబాద్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన స్టేషన్ల నుంచి శబరిమలకు అదనంగా 26 ప్రత్యేక రైళ్లను నడుపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. 2,9,16 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి కొల్లం(07175), 4,11,18తేదీల్లో కొల్లం-సికింద్రాబాద్ (07176) ప్రాంతాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వీటితోపాటు కాకినాడ, విజయవాడనుంచి కూడా పలు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు.

దేశానికి వినూత్న ఆవిష్కరణలు అందించాలి

» 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'లో ప్రధాని మోదీ
» దేశంలో 51 కేంద్రాల్లో 17 అంశాలపై ఆవిష్కరణలు
» ఐఐటీ హైదరాబాద్‌లో వ్యవసాయ రంగంపై పోటీలు



కంది, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వినూత్నంగా ఆలోచించే యువత, సాంకేతికపరమైన శక్తి సంపత్తులే భారత్ బలాలని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకే నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. బుధవారం దేశవ్యాప్తంగా 51 కేంద్రాల్లో ప్రారంభమైన ఏడో విడత స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 ఫైనల్‌లో పాల్గొన్న 1,300కు పైగా విద్యార్థి బృందాలను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. దేశానికి వినూత్నమైన ఆవిష్కరణలు అందించాలని.. సామాజిక సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపాలన్నారు. ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లాంఛనప్రాయ కార్యక్రమం కాదని.. దేశ యువత నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఓ వేదిక అని చెప్పారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రారంభమైన నాటి నుంచి లక్షలాది మంది యువత ఇందులో భాగస్వాములయ్యారని, ఇప్పటివరకు చేసిన ఆవిష్కరణలు చాలా సమస్యలకు పరిష్కారం చూపాయని వెల్లడించారు. ఈసారి 17 విభిన్న అంశాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో వ్యవసాయం రంగంపై విద్యార్థులు ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి 200 మంది వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు 26 జట్లుగా ఏర్పడి 36 గంటల పాటు శ్రమించి వ్యవసాయ రంగంలోని సమస్యలకు పరిష్కారాలు కనుగొననున్నారు. ఇందులో రైతులు పంట వేసుకునేటప్పుడు విత్తనాల దగ్గరి నుంచి ఉత్పత్తులను అమ్ముకునేవరకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించేందుకు ఫసల్ బజార్, ఫసల్ నీతి, కృషి ఆరోగ్య, కర్షక్ సేతు పేర్లతో మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్లను తయారు చేస్తున్నారు. ఏ వాతావరణంలో ఏ పంట వేసుకోవాలి, చీడపీడల నివారణ, అధిక దిగుబడి కోసం ఏ పురుగుల మందులు, ఏ ఎరువులను వాడాలి.. పంట కొనుగోళ్లకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమీపంలోని కొనుగోలు కేంద్రాల వివరాలు.. తదితర సమాచారాన్ని అన్ని భాషల్లో ఆయా యాప్‌లు, వెబ్‌సైట్లలో అందుబాటులోకి తెస్తున్నారు. ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. రైతును లాభసాటిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణలు రూపొందుతున్నాయన్నారు. విద్య, పరిశ్రమల భవిష్యత్తు, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడమే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో ప్రతిభ కనబర్చిన మొదటి నాలుగు టీమ్‌లను ఎంపిక చేసి ఒక్కో టీమ్‌కు రూ.లక్ష నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు.

చపాట.. వారసత్వ సత్తా

ఐదు దశాబ్దాల కిందటి నుంచే వరంగల్ మిర్చిగా సాగు.. నకిలీ బెడద లేకుండా రైతుల నుంచే మూల విత్తనాలు

» రంగు, రుచిలో విశేష పేరు ప్రఖ్యాతులు
» జాతీయ, అంతర్జాతీయస్థాయి మార్కెటింగ్
» 'జీఐ'తో విదేశాల్లో మరింతగా డిమాండ్!
» వరంగల్, కరీంనగర్, ఖమ్మంలో 25 వేలపైగా ఎకరాల్లో సాగు



వరంగల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెద్దగా కారం లేకుండా కొంచెం తీపి.. సాధారణం కంటే మరింత ఎరుపు.. కొంచెం లావు.. పచ్చళ్లు పెట్టుకుంటే ఎక్కువ రోజులు నిల్వ.. విత్తనంలోనూ నాణ్యత..! ఇదీ చపాటా మిర్చి ప్రత్యేకత. ముడతలతో కనిపించే ఈ పంట ఐదు దశాబ్దాలుగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో సాగవుతోంది. ఆహారంలో రంగుల వినియోగంపై నిషేధం ఉన్న దేశాల్లో.. ప్రత్యామ్నాయంగా చపాటా మిర్చిలోని ఓల్యారోసిన్ అనే ఎర్ర రంగు ద్రావణాన్ని తీసి వాడుతుంటారు. దీంతో విదేశాల్లో చపాటాకు డిమాండ్ పెరిగింది. మూల విత్తనాలను రైతులే తయారు చేసుకుంటుండడంతో నకిలీ బెడద ఉండదు. అయితే, తెగుళ్లు, నల్లతామర, వైరస్ దాడి తీవ్రతతో కొన్నేళ్లుగా ఆశించిన దిగుబడి రావడం లేదు. రైతులు భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చపాటా మిర్చికి తాజాగా భౌగోళిక గుర్తింపు (జీఐ) దక్కింది. ఈ మేరకు 2021 నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. జీఐ కోసం తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ 2022లో దరఖాస్తు చేయగా ఇటీవలే భారత పేటెంట్ కార్యాలయం (ఐపీవో) ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో గిరాకీ, మార్కెటింగ్ అవకాశాలు పెరుగుతూ ఇది అన్నదాతలకూ లాభదాయకం కానుంది. దేశ, విదేశాల్లో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెరుగుపుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

50 ఏళ్ల కిందట పడిన విత్తనం

1972లో పరకాల మండలం నాగారం, నడికుడ, రంగాపురం, బంగ్లాపల్లి, కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వావిలాల తదితర గ్రామాల్లో చపాటా విత్తనాలను రైతులే తయారు చేసుకున్నారు. తొలుత నగర విర్చిగా పిలిచినా.. వరంగల్ మిర్చిగా మార్కెట్‌లో ప్రసిద్ధి చెందింది. లంబుకాయ, సింగిల్ పట్టి, డబుల్ పట్టి, టమాట మిర్చిగానూ పేర్కొంటారు. చపాటాపై స్వీయ ప్రయోగం విజయవంతంతో విత్తనాలను ఇతర రైతులకు అందించారు. మొదటి కాతలో నాణ్యమైన, మంచి రంగుతో కూడిన కాయలను గ్రేడ్ చేసి 10-15 రోజులు, గింజలను వేరు చేసి మరో మూడు రోజులు ఎండబెడతారు. తర్వాత శుద్ధి చేసి భద్రపరుస్తారు. ఈ మిరప పొడిని పచ్చళ్లలో, ఎండు మిర్చిగా వాడుతుంటారు. విశిష్టత రీత్యా చపాటా మిర్చి సాగు పదేళ్ల నుంచి భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు విస్తరించింది. ఈ సీజన్‌లో ఉమ్మడి వరంగల్‌లో 10 వేల, ఉమ్మడి ఖమ్మంలో 6 వేల, ఇతర జిల్లాల్లో 9 వేల ఎకరాల్లో పండిస్తున్నారు.

మెక్సికన్ క్యాప్సికమ్‌లా..

మెక్సికన్ క్యాప్సికమ్‌ను పోలి ఉండే వరంగల్ చపాటా మిర్చి అరుదైన రకాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. పచ్చళ్లు చాలా రోజులు ఉండడంతో ఈ విర్చికి దేశ, విదేశాల్లో డిమాండ్ నెలకొంది. ఆహార శుద్ధి పరిశ్రమలు, హోటళ్లు, బెవరేజెస్, పచ్చళ్ల తయారీతో పాటు లిప్‌స్టిక్, ఐస్‌క్రీంలో వినియోగిస్తుండడం విశేషం. ముఖ్యంగా థాయ్‌లాండ్, వియత్నాం, ఇంగ్లండ్, అమెరికా, స్విట్జర్లాండ్ తదితర దేశాల్లో భారీ డిమాండ్ ఉంది. చపాటా మిర్చి ఉష్ణ విలువ 4000-8,500 మధ్య స్కోవిల్లే హీట్ యూనిట్స్ మధ్య ఉంటుందని, అందుకే విదేశాల్లో బాగా వినియోగిస్తారని ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తెగుళ్ల బెడద నివారిస్తే..

ఇతర మిర్చి రకాలతో పోల్చితే చపాటాకు మార్కెట్‌లో ధర ఎక్కువ. కానీ, తెగుళ్లు, నల్ల తామర, వైరస్‌లు దెబ్బకొడుతున్నాయి. ఎకరానికి సాధారణంగా 15 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. నిరుడు 8 నుంచి 10 క్వింటాళ్లకే పరిమితమైంది. వరంగల్‌లో మిర్చి పరిశోధన కేంద్రంలో లేకపోవడంతో ఏపీలోని గుంటూరు, మహారాష్ట్రలోని పుణెలకు పంపాల్సి వస్తుంది. ఏడేళ్ల నుంచి చపాటా మిర్చికి క్వింటా రూ.25 వేల వరకు ధర పలుకుతోంది. 2022లో ఏకంగా రూ.60వేలు ధర వచ్చింది. పరకాల మండలం హైబత్‌పల్లి రైతు సంపత్ తెచ్చిన పంట క్వింటాకు గరిష్ఠంగా రూ.90 వేలు పలికింది. నిరుడు రూ.30వేల లోపే విక్రయించారు. తెగుళ్లపై ఉద్యానశాఖ అధికారులు పరిశోధనలు చేసి కట్టడికి సూచనలు చేయాల్సి ఉంది.

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు!

» కేటీపీపీ భూ నిర్వాసితుల ఆవేదన
» సంస్థకు విలువైన భూములు ఇచ్చినా ఇప్పటికీ వారికి ఉద్యోగాలు దక్కని వైనం
» ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి)

కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ) కోసం భూములు ఇచ్చి రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న ఆ కుటుంబాలు మాత్రం చీకట్లలో మగ్గుతున్నాయి. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ ఉద్యోగం ఇస్తామన్న కేటీపీపీ... తన హామీని తుంగలో తొక్కడంతో నిర్వాసితులు 18 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నారు. భూపాలపల్లి జిల్లా చెల్పూరులో నిర్మించిన 1100 మెగావాట్ల కేటీపీపీ కోసం తమ విలువైన భూములు ఇచ్చినా.. ఉద్యోగం రాక బయట బతుకుదెరువు కనిపించక త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. కేటీపీపీ నిర్మాణానికి 2006లో ఉమ్మడి వరంగల్ జిల్లా గణపురం మండలం చెల్పూరు, దుబ్బపల్లి, మహబూబ్‌పల్లి, గొర్లవీడు గ్రామాల పరిధిలో 975 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. ఎకరాకు 3 లక్షల వరకు పరిహారం చెల్లించడంతో పాటు భూములు కోల్పోయిన ప్రతి కుటుంబంలో అర్హతలను బట్టి ఒకరికి ఉపాధిని కల్పిస్తామని అప్పటి జెన్‌కో ఎండీ అజయ్ జైన్ హామీ ఇచ్చారు. 2008 జూలైలో 500 మెగావాట్లు, 2015లో మరో 600 మెగావాట్ల యూనిట్ల నిర్మాణాలను పూర్తి చేశారు. 2010లో మొదటి దశ ఉత్పత్తి ప్రారంభం కాగా 2011-12లో జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) సమావేశమై భూ నిర్వాసితుల్లో కొందరికి ఉద్యోగాలు ఇచ్చింది. అయితే కేటీపీపీ రెండో దశ యూనిట్‌లో ఖాళీగా ఉన్న 127 పోస్టులను భర్తీ చేయాలని నిర్వాసిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. జూనియర్ ప్లాంట్ అటెండెంట్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్నా సంస్థ అంతర్గతంగా సర్దుబాట్లతో కాలం గడిపేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. భూములు కోల్పోయి ఉద్యోగం రాక 50 నిర్వాసిత కుటుంబాల్లోని అర్హులు 18 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు, కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న 60 మంది తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో తమ గోడు వెళ్లబోసుకునే స్వేచ్ఛ లేకుండా గొంతు నొక్కేశారని, ఈ ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న గూగుల్, ప్రభుత్వ ప్రతినిధులు

ఏపీతో గూగుల్

» విశాఖలో సెంటర్ ఏర్పాటుకు కుదిరిన ఒప్పందం

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌తో కీలక భాగస్వామిగా ఉంటామని ప్రఖ్యాత ఐటీ దిగ్గజం గూగుల్ ప్రకటించింది. విశాఖపట్నంలో గూగుల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదించింది. రాష్ట్రంలో కృత్రిమ మేథో (ఏఐ) సేవలు అందించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. బుధవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (జీజీఏఐ) వైస్ ప్రెసిడెంట్ వికాశ్ కోలే బృందం సమావేశమైంది. చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో గూగుల్ కార్యకలాపాల విస్తరణ, కృత్రిమ మేధను అందించడం, ఇతర సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని విద్యార్థులకు అందించడం వంటి అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో పెట్టుబడులు ఏ స్థాయిలో పెట్టాలనుకుంటున్నారు, విశాఖతో సహా రాష్ట్రంలోని ఇతర ప్రదేశాల్లో ఎక్కడెక్కడ తమ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు వంటి విషయాలను వికాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ చేసుకున్న ఒప్పందం, ఆ తర్వాత విశాఖలో వికాశ్ పర్యటన గురించి చర్చ జరిగింది. అమెరికా పర్యటనలో గూగుల్‌ను మంత్రి లోకేశ్ సందర్శించడం, రాష్ట్రానికి ఏఐ సేవలు అందించాలంటూ గూగుల్‌ను ఆహ్వానించడం వంటి అంశాలూ ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని వికాశ్ కోలే వెల్లడించారు. మంత్రి లోకేశ్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో జరిపిన సంప్రదింపుల తర్వాత రాష్ట్రంతో వ్యూహాత్మకంగా కలసి ముందుకు వెళ్లాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో గూగుల్ కార్యకలాపాలను చేపట్టడం, అందునా విశాఖలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. రిలయన్స్ నిప్పాన్ స్టీల్స్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్ వంటి సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలు నిర్వహించేందుకు రావడంపై చర్చ సాగింది.

ఐటీ అత్యంత ప్రభావశీలి: చంద్రబాబు

భారత్‌లో తమ సంస్థ వ్యాపార కార్యకలాపాల గురించి గూగుల్ బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించింది. ఐటీ రంగానికి ఆర్థికంగానూ, సామాజికంగా ప్రభావం చూపే శక్తి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక, సామాజికాభివృద్ధిలో ఐటీ రంగం కీలకమైందన్నారు.

చేతి గుర్తుకు ఓటేస్తే.. చేతకాని సీఎంను ఇచ్చారు!

రేవంత్‌రెడ్డిని పదవి నుంచి తప్పించే దమ్ముందా?.. ఢిల్లీకి అందే మూటలపై తప్ప.. మీరిచ్చిన మాటలపై శ్రద్ధ లేదు

» రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ
» బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సంస్థలకు ఉన్న కాంగ్రెస్ నాయకుల పేర్లు మార్చేస్తామని వెల్లడి
» విగ్రహాలను కాదు.. ప్రజల బతుకులను మార్చండి: హరీశ్



హైదరాబాద్/సంగారెడ్డిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చేతి గుర్తుకు ఓటేస్తే చేతగాని సీఎంను తెలంగాణకు అంటగట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏడాది కిందట కొలువు దీరిన కాంగ్రెస్ సర్కారు రాష్ట్రాన్ని ఆగం చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణ అస్తిత్వాన్ని కూడా దెబ్బతీస్తోందన్నారు. ఈ మేరకు బుధవారం కేటీఆర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఏడాది పాలనలో ఏ పేజీ తిప్పి చూసినా.. మోసం, అవినీతి, నియంతృత్వమే కాంగ్రెస్ విధానమన్నది స్పష్టమవుతోందన్నారు. అతి తక్కువ కాలంలో అత్యధిక ప్రజాధనాన్ని లూటీ చేసిన సర్కారుగా రేవంత్ ప్రభుత్వం ఓ చీకటి చరిత్రను లిఖించిందని తెలిపారు. నిత్యం రాజ్యాంగ విలువలు వల్లెవేసే మీకు.. తన బావమరిదికి లబ్ధి చేకూర్చిన రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తప్పించే దమ్ముందా? అని రాహుల్‌ను ప్రశ్నించారు. ఓవైపు సీఎంతో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న మీకు రాజ్యాంగాన్ని తాకే నైతిక హక్కు లేదని అన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేర కాల్చి చంపుతున్న కాంగ్రెస్ సంస్కృతిని మరోసారి తెలంగాణలో అమలు చేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. "ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అరెస్టులు అన్నట్టుగా సాగుతున్న మీ పాలనా తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోంది. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా నిర్బంధం, సకల రంగాల్లో సంక్షోభమేనని ఏడాది పాలన రుజువు చేసింది. గ్యారెంటీలన్నీ గారడీలేనని, డిక్లరేషన్లపై మీకే డెడికేషన్ లేదని రుజువైంది. సీఎం ఢిల్లీకి పంపే మూటలపై ఉన్న శ్రద్ధ, ప్రజలకు మీరిచ్చిన మాటపై లేకపోవడం ద్రోహం గాక మరేంటి? రైతు భరోసా ఊసే లేదు. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ నాలుగు విడతలుగా ఊరించి ఉసూరుమనిపించడంతో దాదాపు 620 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా ముఖ్యమంత్రిలో చలనం లేదు" అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. 'చేతనైతే హామీలు అమలు చేయండి. లేదంటే ప్రజల ముందు లెంపలేసుకుని క్షమాపణలు కోరండి' అని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, రాజీవ్ అంతర్జాతీయ విమానాశ్రయం పేర్లను మార్చలేదని, ఇందిరాగాంధీ విగ్రహాల జోలికి వెళ్లలేదని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి ప్రజలపై కాంగ్రెస్ తల్లిని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పలు సంస్థలకు ఉన్న ఇందిర, రాజీవ్, ఇతర కాంగ్రెస్ నాయకుల పేర్లను మార్చడంతోపాటు సచివాలయం ముందున్న కాంగ్రెస్ తల్లి, రాజీవ్‌గాంధీ విగ్రహాలను గాంధీభవన్‌కు సాగనంపుతామని లేఖలో తెలిపారు.

ఉద్యమ చరిత్రలో రేవంత్‌రెడ్డిది ద్రోహి పాత్ర: హరీశ్




తెలంగాణ ఉద్యమ చరిత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది ద్రోహి పాత్ర అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నడూ 'జై తెలంగాణ' అనలేదని చెప్పారు. 2009 డిసెంబరు 9న తెలంగాణ ప్రకటన రావడానికి కారణం కేసీఆరే అన్నారు. సోనియా దయతోనే తెలంగాణ వచ్చిందనడం అమరులను అవమానించడమేనని చెప్పారు. తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయే అని ఆరోపించారు. నాడు రేవంత్‌రెడ్డిని తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే తప్పించుకున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలను కూడా రేవంత్‌రెడ్డి తొలగిస్తారా? అని హరీశ్ ప్రశ్నించారు. విగ్రహాలను కాదని, ప్రజల బతుకులను మార్చాలని హితవు పలికారు.

కాగా, రాష్ట్ర చరిత్ర, సంస్కృతిని హననం చేసే సర్కారుతో సన్మానం చేయించుకోలేనన్న నందిని సిధారెడ్డి ప్రకటనపై ఎక్స్‌లో కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

» అక్టోబరులో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడు
» ఆ స్థానంలో 256 కేజీల పంచలోహ విగ్రహం ప్రతిష్ఠ
» పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం


ముత్యాలమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ

సికింద్రాబాద్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. సోమవారం నుంచి మొదలైన విగ్రహ పునఃప్రతిష్ఠ బుధవారం జరిగిన పూజలతో ముగిసింది. అక్టోబరులో ఓ దుండగుడు ఈ ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. ఈ ఘటన వివాదాస్పదమవ్వగా.. స్పందించిన దేవాదాయ శాఖ అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించి ఆలయాన్ని పునర్నిర్మించి బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తి చేసింది. బుధవారం జరిగిన పూజా కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఓ దుండగులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దురదృష్టకరమని అన్నారు. అయితే, 256 కిలోల అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. విభిన్న సంస్కృతులు, మతాలకు నిలయమై మినీ ఇండియాగా పేరు గాంచిన హైదరాబాద్‌లో మత కల్లోలాలు జరగకూడదని అన్నారు. ఇక, స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం విగ్రహ పునఃప్రతిష్ఠ చేసిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాలను కలిసికట్టుగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

'యూపీఎస్సీ'లో 'రాజీవ్' లబ్ధిదారుల విజయం

» అభినందనలు తెలిపిన సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ మెయిన్స్ 2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. అయితే ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన వారిలో 20 మంది రాజీవ్ సివిల్స్ అభయ హస్తం లబ్ధిదారులు కావడం విశేషం. సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీని కింద సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 135 మంది పేద అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందించింది. తాజాగా విడుదలైన యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లో వారిలో 20 మంది అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. వారిని సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అభినందించారు. "ప్రభుత్వం నుంచి అందిన చిరు సాయం ఈ రోజున యూపీఎస్సీ పరీక్షలో గొప్ప ఫలితాలను ఇచ్చింది. తెలంగాణ సర్కారు సారథిగా ఇది నాకు గొప్ప ఆనందాన్ని కలిగించింది. ఒకే దఫా 20 మంది తెలంగాణ పేద బిడ్డలు ఈ దేశ భవిష్యత్తును నిర్మించే అవకాశం ఉన్న పరీక్షలో రాణించడం తెలంగాణ సమాజానికి గర్వకారణం. యూపీఎస్సీ మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన యువతకు నా అభినందనలు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు 'ముఖ గుర్తింపు హాజరు'

» నేటి నుంచే అమలు.. ఐఏఎస్‌లకు మినహాయింపు



హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని అధికారులు, ఉద్యోగులకు గురువారం నుంచి 'ముఖ గుర్తింపు(ఫేషియల్ రికగ్నిషన్)' ఆధారంగా హాజరు విధానం అమలుకానుంది. దీనికి సంబంధించి సీఎస్ శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. సచివాలయంలోని అన్ని శాఖల కార్యాలయాల ద్వారాల వద్ద ఇందుకు సంబంధించిన పరికరాలను ఇప్పటికే అమర్చారు. సంబంధిత శాఖల ముఖ్యకార్యదర్శులు కూడా ఈ విషయమై తమ ఉద్యోగులు, అధికారులకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేయాలని శాంతికుమారి సూచించారు. ఐఏఎస్‌లు మినహా నాల్గో తరగతి ఉద్యోగుల నుంచి అదనపు కార్యదర్శి వరకు ఈ విధానం అమలు కానుందని పేర్కొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై కేంద్రం గురి

» రేపటి నుంచి ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాల పరిశీలన

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ దృష్టి సారించింది. రెండో దశ పర్యావరణ అనుమతులు తీసుకోకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారనే కేసుకు సంబంధించి.. పర్యావరణానికి కలిగిన హానిని అంచనా వేసి, నివేదిక ఇవ్వడానికి ఉప కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఈనెల 13వ తేదీ(శుక్రవారం) నుంచి 17వ తేదీ వరకు ప్రాజెక్టు నిర్మాణం జరిగిన ప్రదేశాలను పరిశీలించనుంది. ఈ కమిటీలో డాక్టర్ ఉదయ్‌కుమార్ (ఛైర్మన్‌గా), డాక్టర్ జేవీ త్యాగి, కార్తీక్ సప్రే, డాక్టర్ అమియా సాహూ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) నుంచి ఆర్.రాజ్‌కుమార్‌తో పాటు కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఉన్నారు. కాగా, పర్యావరణ అనుమతి తీసుకోకుండా పనులు చేస్తున్నందుకు ప్రాజెక్టు కోసం వెచ్చించిన రూ.35,200 కోట్లలో 1.5 శాతం అంటే రూ.528 కోట్లు నష్టం పరిహారంగా, మరో రూ.300 కోట్ల జరిమానాగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి 2022 డిసెంబరులో ఎన్జీటీ ఉత్వర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు 2023 ఫిబ్రవరి 17న స్టే విధించింది. రెండో దశ పర్యావరణ అనుమతి లభించాలంటే ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రెండో దశ పర్యావరణ అనుమతి లభించనుంది.

పాలమూరు, కల్వకుర్తి, బీమా పనులు చేపట్టాలి

» అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ-3లో కెనాల్ సవరణ అంచనాలను ప్రభుత్వానికి పంపించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాజెక్టులపై మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి, సమీక్ష నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ప్యాకేజీ-3కి సంబంధించి గతంలో స్టేట్ లెవెల్ స్టాండింగ్ కమిటీ రూ.728.88 కోట్లకు ఆమోదించిందని అధికారులు ప్రస్తావించగా.. సవరణ అంచనాలకు పరిపాలన అనుమతి పొందడానికి వీలుగా ప్రభుత్వానికి ఫైలును పంపించాలని మంత్రి ఉత్తమ్ నిర్దేశించారు. భీమా ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 27, 19తో కెనాల్‌లో పూడిక తీతతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ-28 పూడిక తీత పనులను చేపట్టాలని ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలని నిర్దేశించారు.

'సురభి నాట్యమండలి' 140వ ఉత్సవానికి రండి

» కేంద్ర మంత్రి షెకావత్‌కు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సురభి నాట్యమండలి 140వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని కోరుతూ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. డిసెంబరు 14న సాయంత్రం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించే థియేటర్ ఆర్ట్ ఫెస్టివల్‌కు రావాలని కోరారు.

సెలవులో డీజీపీ జితేందర్

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీజీపీ జితేందర్ వ్యక్తిగత సెలవుల్లో విదేశాలకు వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీజీపీగా హోంశాఖ కార్యదర్శి రవిగుప్తాకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. 9 రోజుల పాటు వ్యక్తిగత పనుల నిమిత్తం జితేందర్ లండన్ వెళ్లినట్లు సమాచారం. ఈ నెల 19వ తేదీన జితేందర్ విధులకు హాజరుకావచ్చని తెలుస్తోంది.

సీఎం నియోజకవర్గంలో పశువైద్య కళాశాల!

» 38 ఎకరాల్లో రూ.171 కోట్లతో నిర్మాణం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో పశు వైద్య కళాశాల ఏర్పాటుకానుంది. దాదాపు 38 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 171 కోట్లతో దీనిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ నిర్మించనుంది. పశు వైద్య కళాశాల ప్రాంగణంలో ప్రధాన భవనం, పశువైద్యశాల, బాలికలు, బాలురకు ప్రత్యేకంగా వసతి గృహాలు ఉంటాయి. ఈ కళాశాల హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీ.వీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో ఉంటుంది. ఈ మేరకు బుధవారం పశుసంవర్ధక శాఖ, రోడ్లు, భవనాల శాఖల మధ్య నిర్మాణ ఒప్పందం కుదిరింది.

తెలంగాణకు 4,212 స్మార్ట్ క్లాస్ రూమ్‌లు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ఇప్పటివరకు 4,212 స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేసేందుకు అనుమతిచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. బుధవారం, రాజ్యసభలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌధురి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. సమగ్ర శిక్షా పథకంలో భాగంగా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో 6-12వ తరగతి వరకు స్మార్ట్‌క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వీటి కోసం ఒక్కో పాఠశాలకు నాన్-రికరింగ్ గ్రాంటు కింద రూ.2.40 లక్షలు, రికరింగ్ గ్రాంటు కింద రూ.38 వేల (ఈ- కంటెంట్, డిజిటల్ వనరులు. విద్యుత్ ఛార్జీలతో సహా) ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

అనంతలో 14 నుంచి హెచ్‌ఆర్‌ఎఫ్ మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మానవ హక్కుల వేదిక(హెచ్‌ఆర్‌ఎఫ్) 10వ మహాసభలు ఈనెల 14, 15వ తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కులగణన ఎందుకు అవసరం? అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎస్ సాహు.. బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం.. కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై విశ్రాంత చరిత్ర అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారని ఆయన తెలిపారు.

త్వరలో క్యాబినెట్ విస్తరణ!

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని, దీనివల్ల బీసీలు పార్టీకి సానుకూలంగా మారుతున్నారని, కులగణన వివరాల ఆధారంగా సంక్షేమ పథకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని కూడా భట్టి తెలిపినట్లు సమాచారం. కులగణనను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసినందుకు భట్టిని రాహుల్ అభినందించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈసారి ఢిల్లీ పర్యటనలో పూర్తిగా మంత్రివర్గ విస్తరణపైనే అధిష్ఠానంతో చర్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ చేపట్టడంతోపాటు, పదవులు రానందుకు అసంతృప్తిగా ఉన్న వివిధ నేతలను కూడా బుజ్జగించాల్సిన అవసరం ఉందని, విస్తరణ తాలూకు పర్యవసానాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని రేవంత్ వర్గీయులు భావిస్తున్నారు.



ఢిల్లీకి ఆశావహులు

రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కోసం ఆశావహులు ఢిల్లీకి రావడం మళ్లీ ప్రారంభమైంది. మల్‌రెడ్డి రంగారెడ్డి ఇప్పటికే రాగా, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం రానున్నట్లు తెలిసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షి ఇప్పటికే ఢిల్లీలో ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో అవకాశం లభించే వారికి సంబంధించి.. సుదర్శన్‌రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్, మల్‌రెడ్డి రంగారెడ్డి, వివేక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల మరో ఏడెనిమిది ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌కు లభించే అవకాశం ఉన్నందువల్ల.. ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యే ఒకరిద్దరు నేతలకు కూడా మంత్రివర్గంలో చోటు లభించవచ్చని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ జాబితాలో షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషీ పేర్లు వినిపిస్తున్నాయి. ప్రేమ్‌సాగర్ రావు పేరును కూడా భట్టి విక్రమార్క ఢిల్లీ నేతల వద్ద ప్రస్తావిస్తున్నట్లు సమాచారం. ఇక.. తనను మంత్రివర్గంలో తీసుకుంటానని హామీ ఇచ్చి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని, తాను భువనగిరి అభ్యర్థిని కూడా గెలిపించుకున్నానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ నేతలకు చెబుతున్నట్లు తెలిసింది. మొత్తం మీద, మరోసారి మంత్రివర్గ విస్తరణ అంశం ముందుకొచ్చింది.

మైదానంలో దందా



హైదరాబాద్‌లోని స్టేడియాలు ఆగమాగం.. పాట కచేరీలు, సభలు, సినిమా వేడుకలు

» రాజకీయ ఒత్తిళ్లతో అనుమతి
» క్రీడాకారుల సాధనకు అడ్డంకి
» ప్రభుత్వం మారినా అదే తంతు

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

- నిరుడు హైదరాబాద్ టాకీస్ అనే సంస్థ గచ్చిబౌలి స్టేడియంలో సంగీత విభావరి నిర్వహించింది. తర్వాత వారం పాటు ఈ మైదానాన్ని క్రీడాకారులు వాడుకోలేకపోయారు.
- అక్టోబరు 19న గచ్చిబౌలిలో ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ సంగీత విభావరి నిర్వహించాక మైదానం చిందరవందరైంది.
- నవంబరు 30న ఎల్బీ స్టేడియంలో గాయని శ్రేయాఘోషల్ సంగీత విభావరి నిర్వహించారు. ఇప్పటికే ఎల్బీ స్టేడియం నిర్వహణపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అయినా, ఇవేమీ పట్టనట్లు ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు.
- అక్టోబరులో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పంజాబీ ప్రసిద్ధ గాయకుడు దిల్జిత్ దొసాంజె నిర్వహించిన సంగీత విభావరితో ఆ మైదానం ఆగమాగమైంది. దీంతో క్రీడాకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేశారు.



ఎల్బీస్టేడియంలో శ్రేయా ఘోషల్ సంగీత విభావరికి ఏర్పాట్లు(ఫైల్)

దాదాపు హైదరాబాద్‌లోనూ ఇలానే జరుగుతోంది. కానీ, ప్రభుత్వ వర్గాలనుంచి స్పందన కొరవడుతోంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం ప్రముఖ స్టేడియాలు సంగీత విభావరులు, సినిమాల వేడుకలు, బహిరంగ సభలు, ప్రభుత్వ సమావేశాలకు వేదికలుగా మారి దెబ్బతింటున్నాయి. జాతీయ క్రీడలు, ఆఫ్రో ఏషియన్ క్రీడలు, ప్రపంచ మిలటరీ క్రీడలకు ఆతిథ్యమిచ్చిన గచ్చిబౌలి స్టేడియం మొదలు.. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ వంటి దిగ్గజ క్రికెటర్లు మ్యాచ్‌లు ఆడిన ఎల్బీ స్టేడియం వరకు హైదరాబాద్‌లోని ఏ క్రీడా సముదాయమైనా ఈవెంట్స్ నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులకు ఆట వస్తువులుగా మారిపోయాయి. క్రీడాకారులు మైదానాన్ని తమ రెండో ఇల్లుగా భావిస్తారు. అక్కడి మట్టికి నమస్కరించి కానీ లోపలకు అడుగుపెట్టరు. అలాంటి స్టేడియాలు ప్రైవేటు, ప్రభుత్వ కార్యక్రమాలు, పండుగ సంబరాలు, విందులతో దెబ్బతింటున్నాయి. గత ప్రభుత్వంలో క్రీడలను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఈవెంట్ నిర్వాహకులు ఆడిందే ఆటగా సాగింది. ఇప్పుడైనా మార్పు వస్తుందని భావిస్తే అది అత్యాశే అయింది. ఆటలపై అభిలాష ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా క్రీడా మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తున్నాక కూడా అడ్డుకట్ట పడకపోవడంపై క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి ఇచ్చేది లేదంటూనే..

ఎల్బీ స్టేడియంతో పాటు క్రీడా మైదానాల్లో ఇకపై ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించమని సీఎం రేవంత్ చెప్పాక కూడా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) అనుమతులు ఇస్తోంది. క్రీడేతర కార్యక్రమాలకు మైదానాలను అద్దెకు ఇవ్వబోమని కచ్చితంగా చెప్పిన శాట్ డిప్యూటీ డైరెక్టర్ ఆ తర్వాత వేరే పోస్ట్‌కు వెళ్లిపోయారు. కాగా, గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియాన్ని రూ.20 కోట్లతో ఆధునీకీకరించారు. అయినా, దేవిశ్రీ కార్యక్రమం కోసం ఇచ్చేశారు. మొదట వెనుకాడినా.. అప్పుడు సీఎంవోలో ఉన్న ఓ ఉన్నతాధికారితో పాటు ప్రభుత్వంలోని ముఖ్య నేత ఒత్తిడితో ఓకే చెప్పేశారు. ఇక హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఎల్బీ స్టేడియంలో పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు క్రికెట్, ఫుట్‌బాల్ కోచింగ్ తీసుకుంటారు. నెలకు లేదా సెషన్‌కు ఇంత అని చెల్లిస్తారు. పిల్లల ఉత్సాహాన్ని చూసి తల్లిదండ్రులు కాస్త ఖర్చయినా పర్వాలేదని భావిస్తారు. అలాంటి ఎల్బీ స్టేడియంలో కోచింగ్‌ను నిలిపివేసి మరీ శ్రేయాఘోషల్ ఈవెంట్‌కు కేటాయించారు.

ముందుగా టికెట్లు అమ్మేద్దాం..

మనం ఏదైనా కార్యక్రమం చేపడితే ముందుగా తేదీని నిర్ధారణ చేసుకుంటాం.. వేదికను చూసుకుంటాం.. తగిన ఏర్పాట్లు చేసుకుంటాం.! కానీ, ఈవెంట్ నిర్వాహకుల దందా వేరే విధంగా ఉంటోంది. కనీసం స్టేడియం బుక్ చేయకుండా, శాట్ అనుమతి కూడా లేకుండానే ఎల్బీ స్టేడియంలో సంగీత కార్యక్రమానికి టికెట్లు అమ్మేశారు. ఇంతలో తాపీగా.. కార్యక్రమాన్ని నవంబరు 8 నుంచి30కి మార్చారు. ఈ సంగతి తెలిసి శాట్ యంత్రాంగం నిర్వాహకులను మందలించినట్టు సమాచారం. కానీ, సీనియర్ ఐఏఎస్ అధికారి సిఫార్సు మేరకు ఈ అడ్డంకులన్నీ తొలగిపోయాయి. కాగా, హైదరాబాద్‌లోనే జీఎంఆర్ ఎరీనా, హైటెక్స్ వంటి పలు ప్రదేశాలున్నాయి. అక్కడ కార్యక్రమాలు చేపట్టడం బాగా ఖర్చుతో కూడుకున్నది కావడంతో నిర్వాహకులు ప్రభుత్వ స్టేడియాలను ఎంచుకుంటున్నారు.

ఆదాయానికి మరో మార్గం లేదా?

మైదానాల నుంచి ఆదాయం రాబట్టాలనే ఉద్దేశం ఉంటే క్రీడా సంఘాల కార్యక్రమాలకు వాటిని కేటాయించవచ్చు. లేదా చుట్టూ వాణిజ్య సముదాయాలు నిర్మించి క్రీడా అనుబంధ విపణిని అభివృద్ధి చేయొచ్చు. ఒడిశా ప్రభుత్వం ఈ విధంగానే కొన్ని చర్యలు చేపట్టింది. మన రాష్ట్రంలో మాత్రం సంగీత విభావరులు, సినిమా ఫంక్షన్లు, సభల నిర్వహణకు అనుమతిస్తే ఎలాగని పలువురు సీనియర్ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఒడిశా సర్కారును ఆదర్శంగా తీసుకోవాలని క్రీడా నిపుణులు సూచిస్తున్నారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

అధిష్ఠానానికి ప్రగతి నివేదిక!

» మంత్రివర్గ విస్తరణపైనా చర్చించే చాన్స్
» పెండింగ్ నిధులపై కేంద్రానికి వినతిపత్రాలు

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఏడాది పాలనలో సాధించిన రాష్ట్ర ప్రగతిపై ఆయన కాంగ్రెస్ అధిష్ఠానానికి సమగ్ర నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో చర్చలు జరిపిన రేవంత్.. ఈ మేరకు సమగ్ర నివేదికను రూపొందించినట్లు సమాచారం. బుధవారం బంధువుల వివాహ వేడుకలో పాల్గొనేందుకు రాజస్థాన్‌లోని జైపూర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎంకు విమానాశ్రయంలో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు గోవింద్‌సింగ్, సీఎల్పీ నేత తికారం జల్లి, ఎమ్మెల్యే అమిత్ చరణ్‌లు ఘన స్వాగతం పలికారు. వివాహ వేడుకల అనంతరం అక్కడి నుంచే గురువారం ఢిల్లీ చేరుకోనున్న రేవంత్.. ప్రగతి నివేదికలో భాగంగా గ్యారెంటీల అమలుతో పాటు రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ తదితర పథకాల అమలు, కులగణన.. తదితర అంశాలను అధిష్ఠానానికి వివరించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మంత్రివర్గ విస్తరణపైనా అధిష్ఠానం పెద్దలతో చర్చించే అవకాశమున్నట్లు చెబుతున్నారు.

కేంద్ర మంత్రులనూ కలవనున్న సీఎం..

ఢిల్లీ పర్యటనలో పెండింగ్ నిధులపై కేంద్ర మంత్రులనూ సీఎం రేవంత్ కలవనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టితో పాటుగా ఆయా కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంపైన కేంద్ర పెద్దలతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి కేటాయించిన కోటా నిధులు మంజూరు చేయాలని కోరనున్నట్లు సమాచారం.

31నాటికి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

» 14న సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో మంత్రులు, ఎంపీల సహపంక్తి భోజనాలు
» గ్రూప్-2కు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి
» కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో పొంగులేటి



హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని అధికారులను రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. పరిశీలించిన దరఖాస్తుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా ప్రతి 500 మందికి ఒక సర్వేయర్‌ను నియమించుకోవాలన్నారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులనూ భాగస్వాములను చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, సామాజిక సర్వే, మెస్ చార్జీల పెంపు అంశాలపై సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి బుధవారం వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటుకాకుంటే వెంటనే ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఏ గ్రామంలో ఏ రోజు సర్వే నిర్వహిస్తారో అంతకన్నా ముందురోజే గ్రామంలో చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలన్నారు. ఫిర్యాదులు, సలహాల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ ఏడాది 4.50 లక్షల ఇళ్లను నిర్మించబోతున్నట్టు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో మెస్ చార్జీలను పెంచలేదని, తమ ప్రభుత్వం 40శాతం మేర ఈ చార్జీలను పెంచడంతో దాదాపు 7.65 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్నట్టు తెలిపారు. కలెక్టర్లు తరచూ హస్టళ్లను తనిఖీ చేయాలని, హస్టళ్లకు వచ్చే సరుకుల నాణ్యతపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ నెల 14న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు స్థానికంగా ఉన్న సంక్షేమ హస్టళ్లను సందర్శించి, అక్కడి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కుల సర్వేకు ఈ నెల 13 వరకు అవకాశం ఉందని, ఇప్పటివరకు కోటి 12 లక్షల కుటుంబాల్లో సర్వే పూర్తయిందన్నారు. ఈ నెల 13న గడువు పూర్తయిన తర్వాత కూడా ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా ప్రజలు సర్వే వివరాలను నమోదు చేసుకునేలా అవకాశం కల్పించామని చెప్పారు. ఇక ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

'ఆశా'ల సమస్యల పరిష్కారానికి సిద్ధం

» బీఆర్ఎస్ నేతలు ఆశా వర్కర్లకు మద్దతు పలకడం హాస్యాస్పదం
» మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం స్పష్టం చేశారు. ఆశా వర్కర్ల డిమాండ్ల సాధ్యాసాధ్యాలను అంచనా వేసి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈలోగా రాజకీయ నాయకుల వలలో పడవద్దని ఆశా వర్కర్లకు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధర్నా చౌక్‌ను మాయం చేసిన బీఆర్ఎస్ నేతలు ఆశా వర్కర్లకు అండగా ఉంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఆశా వర్కర్లకు మద్దతు పలుకుతున్న బీఆర్ఎస్ నేతలు.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించకుండా ఏం చేశారని ప్రశ్నించారు. ఆశా వర్కర్ల సమస్యలను నాడు పరిష్కరించి ఉంటే నేడు ఆశాలు రోడ్డెక్కాల్సిన అవసరం ఉండేది కాదు కదా అని అన్నారు.

ఆకస్మిక ఆందోళనల ఆంతర్యమేంటి ?

సరిగ్గా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆశా వర్కర్లు ఆకస్మికంగా ఆందోళనకు దిగడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ఆందోళనల వెనుక విపక్షాల పాత్రపై ఆరా తీస్తోంది. ఇందుకు సంబంధించి నిఘా వర్గాలు ప్రభుత్వానికి ఓ నివేదిక కూడా పంపినట్టు సమాచారం. ఆశా వర్కర్ల ధర్నాల వెనుక ఆంతర్యాన్ని కనిపెట్టేందుకు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, ఇతర రాష్ట్రాల్లో ఆశా వర్కర్లకు ఇన్సెంటివ్ కింద ఎంత చెల్లిస్తున్నారనే లెక్కలు కూడా తీశారు. ఇన్సెంటివ్ చెల్లింపులో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉన్నా ఆందోళన చేస్తుండడంతో ఏదో బలమైన కారణమే ఉందని సర్కారు భావిస్తుంది. మరోవైపు, ఆశ వర్కర్ల ప్రతినిధులు, సంఘాలతో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు త్వరలో చర్చలు జరిపే అవకాశం ఉంది.



ఆయా రాష్ట్రాల్లో ఆశాల ఇన్సెంటీవ్‌లు ఇలా..

రాష్ట్రం	ఇన్సెంటీవ్ (రూ.ల్లో)
ఏపీ	10,000
తెలంగాణ	9,900
బిహార్	4,000
ఢిల్లీ	3,000
కేరళ	5,000
కర్ణాటక	4,000
యూపీ	3,750
బెంగాల్	3,000

గతంలోనే 105రోజుల పాటు ఆందోళన

ఆశా వర్కర్ల సమస్య ఇప్పటిది కాదు. గత పదేళ్లలో ఆశా వర్కర్లు అనేకసార్లు సమ్మెకు దిగారు. ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఆందోళనలు కూడా చేశారు. వేతన పెంపు ప్రధాన డిమాండ్‌గా ఇప్పుడు ఆందోళనలు నిర్వహిస్తున్నామని ఆశా వర్కర్లు చెబుతున్నారు. నిజానికి, తమకు రూ.18 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు 2015 సెప్టెంబరు 2 నుంచి 2015 డిసెంబరు 16 వరకు 106 రోజుల పాటు సమ్మె చేశారు. సమ్మెకాలంలో పోలీసులు చాలా సార్లు ఆశాలపై దాడి చేశారు. అయినా, పట్టించుకోని అప్పటి బీఆర్ఎస్ నేతృత్వంలోని ప్రభుత్వం.. ఆశాలను ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరించింది. వందల మందికి నోటీసులు కూడా జారీ చేసింది. దీంతో ఆశాల 2018లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన నాటి ప్రభుత్వం ఎన్నికల ముందే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చింది. ఆ తర్వాత బీఆర్ఎస్ మళ్లీ అధికారం చేపట్టినా హామీ అమలును పట్టించుకోకపోవడంతో ఆశాలు 2020 మార్చిలో మళ్లీ సమ్మె చేశారు. 2023 సెప్టెంబరు లోనూ సమ్మెకు దిగారు. సరిగ్గా ఎన్నికల ముందు సమ్మె చేయడంతో నాటి పాలకులు తాము మళ్లీ అధికారంలోకి వస్తే రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది.

రాజన్న కోడెలను అమ్ముకున్నారు!

» ముగ్గురి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
» కోడెల గోల్‌మాల్‌పై ఆలయ అధికారుల విచారణ

గీసుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి కోడెలు, దూడలను వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండకు తీసుకొచ్చి అక్రమంగా అమ్ముకొన్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో భక్తులు నివ్వెరపోయే విషయాలు వెలుగుచూశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనుగొండకు చెందిన మాదాసి రాంబాబు రాజేశ్వరి సొసైటీ ద్వారా వేములవాడ గోశాల నుంచి కోడెలను, లేగ దూడలను తీసుకొచ్చి అమ్ముకుంటున్నట్లు గత నెల 29న వెలగందుల రాజు గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 1న రాంబాబుపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రాజన్న ఆలయ గోశాల నుంచి రెండు దఫాల్లో 66 కోడెలను తీసుకొచ్చినట్లు గుర్తించారు. అనంతారానికి చెందిన మంద స్వామి, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చలపర్తికి చెందిన పసునూటి శ్యామ్ కలిసి పలువురు రైతుల నుంచి ఆధార్‌కార్డులతో పాటు వారి భూమి పత్రాలను సేకరించి గోశాల అధికారులకు అందించి.. కోడెలను, దూడలను తీసుకొచ్చారు. ఇలా తెచ్చిన వాటిలో 26 కోడెలను ఆలయ గోశాలకే తిరిగి ఇచ్చినట్లు, మరికొన్ని పారిపోగా, కొన్ని మృతి చెందినట్లు పోలీసులకు చెప్పారు. మరో 11 కోడెలు గట్టుకిందపల్లిలో ఉన్నట్లు తెలిపారు. పారిపోయినట్లుగా చెప్పిన కోడెలను ముగ్గురు కలిసి అమ్ముకున్నట్లు తేలడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గోశాల నుంచి తీసుకొచ్చిన కోడెల వివరాలను తెలుసుకునేందుకు ఆలయ అధికారులు బుధవారం మనుగొండ, అనంతారం గ్రామాల్లో విచారణ జరిపారు. ఆధార్ కార్డుల్లోని చిరునామాల ఆధారంగా రైతుల ఇళ్లకు వెళ్లారు. మనుగొండలో రైతుల ఇళ్లకు తాళం వేసి ఉండడంతో పొరుగు వారిని ఆరా తీశారు. గోశాలకు చెందిన కోడె మృతి చెందినట్లు తెలుసుకున్న ఆలయ అధికారులు ఆ కోడెను పాతిపెట్టిన ప్రాంతంలో తవ్వించి పంచనామా చేయించారు.

ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ

» ఇప్పటికే పెట్టుబడుల ఆకర్షణ కేంద్రంగా నిలిచింది:శ్రీధర్ బాబు
» న్యూజెర్సీ ఇన్నోవేషన్స్ ఇన్‌స్టిట్యూట్‌తో టీ-హబ్ ఒప్పందం

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా మార్చడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. కృత్రిమ మేధ, జీవశాస్త్రాలు, టెక్నాలజీ రంగాల్లో దిగ్గజ సంస్థలను ఆకర్షించడం ద్వారా ఇప్పటికే పెట్టుబడుల ఆకర్షణ కేంద్రంగా నిలిచిందని తెలిపారు. టీ-హబ్ ఫౌండేషన్ న్యూజెర్సీ ఇన్నోవేషన్స్ ఇన్‌స్టిట్యూట్, న్యూజెర్సీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలతో వాణిజ్య, సాంకేతిక ఆవిష్కరణల భాగస్వామ్యంపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా భారతీయ అమెరికన్లు, వృత్తి నిపుణులకు న్యూజెర్సీ మంచి అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు.

స్కిల్స్ వర్సిటీలో నాస్కామ్ భాగస్వామి కావాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో నాస్కామ్ భాగస్వామి కావాలని మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. బుధవారం సచివాలయంలో తనను కలిసిన నాస్కామ్ అధ్యక్షుడు రాజేశ్ నంబియార్‌తో పలు అంశాలపై చర్చించారు. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఐటీ ఉద్యోగులకు, ఇంజనీరింగ్ పట్టభద్రులకు శిక్షణ ఇవ్వడంలో నాస్కామ్ కీలక పాత్ర పోషించాలని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందని, కొత్త సంస్థలు ఇక్కడికి వచ్చేందుకు నాస్కామ్ తన పలుకుబడిని ఉపయోగించాలని కోరారు. రానున్న కొద్ది సంవత్సరాల్లో తెలంగాణ ఐటీ రంగం దేశంలోనే అగ్రగామిగా మారుతుందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇక్కడ ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఐటీ అనుకూల వాతావరణం కల్పించామని తెలిపారు.

చలితో కస్తూర్బా విద్యార్థులకు అస్వస్థత

» ఆసుపత్రికి తరలింపు.. నిలకడగా ఆరోగ్యం

» జగిత్యాల జిల్లా సారంగాపూర్‌లో కలకలం

సారంగాపూర్, డిసెంబరు, 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా బాలికల వసతి గృహంలో తొమ్మిది మంది విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురైన ఘటన కలకలం రేపింది. విద్యార్థులు ఉదయం పూరి, పుప్పుతో కూడిన అల్పాహారం తిన్నారు. ప్రార్థన అనంతరం విద్యార్థులు అస్వస్థతకు లోనవడంతో ఉపాధ్యాయులు గమనించి వెంటనే వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం ముగ్గురు విద్యార్థినులను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చలి ప్రభావం తట్టుకోలేకనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. జిల్లా వైద్యాధికారి, తహసీల్దార్ విడివిడిగా వసతి గృహానికి వెళ్లి విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో మొత్తం 300 మంది విద్యార్థులున్నారని, అందరికి సరిపడా గీజర్స్ లేక పోవడంతో వేడినీరు అందడం లేదని తెలిపారు.

యూపీఎస్సీ మాదిరిగా టీజీపీఎస్సీ!

హైదరాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్(యూపీఎస్సీ) మాదిరిగా తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్(టీజీపీఎస్సీ)ను తీర్చిదిద్దనున్నట్టు టీఎస్‌పీఎస్సీ నూతన ఛైర్మన్ బుర్రా వెంకటేశం చెప్పారు. ఈ క్రమంలో యూపీఎస్సీ ఛైర్‌పర్సన్ ప్రీతి సూదన్‌తో ఫోన్‌లో మాట్లాడి నియామక ప్రక్రియపై చర్చించారు. 18న ఢిల్లీకి వెళ్లి యూపీఎస్సీని సందర్శించాలని ఆయన నిర్ణయించారు. వెంకటేశంతో పాటు కమిషన్ సభ్యులు కూడా ఆ పర్యటనలో పాల్గొననున్నారు. అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఛైర్మన్ ఎస్. గోపాలకృష్ణతో కూడా వెంకటేశం మాట్లాడారు. రిక్రూట్‌మెంట్ విధానాలపై మరింత విస్తృత చర్చల కోసం డిసెంబరు 19న ఆయనతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

ఓటీపీ రాకుండానే ఖాతా నుంచి 1.9కోట్లు స్వాహా

» కోటి పది లక్షలు కాపాడిన సైబర్ పోలీసులు

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ భద్రత బ్యూరో అప్రమత్తతతో ఓ బాధితుడికి చెందిన కోటి పది లక్షల రూపాయలను పోలీసులు కాపాడగలిగారు. బుధవారం రెండు గంటల 3 నిమిషాలకు ఓ వ్యక్తి ఖాతా నుంచి కోటి 90 లక్షల రూపాయలు డెబిట్ అయినట్లు సందేశం వచ్చింది. ఎలాంటి ఓటీపీ అడగకుండానే తన ఖాతా నుంచి డబ్బు మాయం కావడంతో ఆందోళన చెందిన బాధితుడు సాయంత్రం నాలుగు గంటలకు 1930 నెంబర్ ద్వారా సైబర్ భద్రత బ్యూరోకి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన విధుల్లోని అధికారి మౌనిక బ్యాంకింగ్ అనుసరణ(ఫాలోఅప్) బృందాలను అప్రమత్తం చేశారు. వారు పంజాబ్ నేషనల్ బ్యాంకుకు బాధితుని ఖాతా నుంచి డబ్బు చేరినట్లు గుర్తించారు. వెంటనే ఆ బ్యాంకు అధికారులతో మాట్లాడి ఖాతాలో ఉన్న 75,69,223 రూపాయలను ఫ్రీజ్ చేయించారు. అప్పటికే మోసగాళ్లు ఆ బ్యాంకు నుంచి వివిధ బ్యాంకులకు 35 లక్షల రూపాయలను బదిలీ చేశారు. దీంతో పోలీసు బృందం లావాదేవీలు జరిగిన బ్యాంకులు అన్నిటిని సంప్రదించి రూ.35 లక్షలను కూడా విత్‌డ్రా చేసుకోకుండా అడ్డుకున్నారు. ఇంకా 79 లక్షల 30 వేల రూపాయలను వివిధ వ్యాలెట్లకు బదిలీ చేయడంతో ఆ డబ్బును కాపాడటం కోసం ప్రయత్నిస్తున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు.. సైబర్ క్రైం బాధితులు డబ్బు పోతే గోల్డెన్ అవర్స్‌లో(అంటే డబ్బు పోయిన తొలి రెండు మూడు గంటల్లో) 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని ఆమె తెలిపారు.

బైబిల్స్‌ను పంపిణీ చేసిన టీచర్ సస్పెన్షన్ !

విద్యార్థులకు బైబిల్ గ్రంథాలను పంపిణీ చేసిన ఓ ఉపాధ్యాయుడిని అధికారులు సస్పెండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న లింగాలరాజు అనే టీచర్ విద్యార్థులకు బైబిల్‌ను పంపిణీ చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. విచారణలో అది నిజమేనని తేలడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

రెడ్‌కార్నర్ నోటీసుకు.. ఆలస్యం ఎందుకు?

ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను ఎప్పుడు అరెస్టు చేస్తారు: హైకోర్టు

శ్రవణ్‌రావు బెయిల్ పిటిషన్‌లో తీర్పు రిజర్వు

హైదరాబాద్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్న ఫోన్‌ట్యాపింగ్ కేసు నిందితులు ప్రభాకర్‌రావు(ఏ1), శ్రవణ్‌రావు(ఏ2)లపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయడానికి ఆలస్యమెందుకని హైకోర్టు పోలీసులను నిలదీసింది. వారిద్దరినీ ఎప్పుడు అరెస్టు చేస్తారంటూ అసహనం వ్యక్తంచేసింది. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికల్లో ఆలస్యంపై ప్రశ్నించింది. శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తీర్పును రిజర్వ్ చేసింది. పూర్వాపరాల్లోకి వెళ్తే.. తాను ప్రభుత్వోద్యోగిని కాదని, ఫోన్‌ట్యాపింగ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనకు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేయాలని కోరుతూ.. శ్రవణ్‌రావు తన న్యాయవాది ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ కె.సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. శ్రవణ్‌రావు తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. జర్నలిస్టు అయిన తన క్లైంట్.. వృత్తి ధర్మంలో భాగంగా ఎక్కడికైనా వెళ్తారని, ఎవరితోనైనా మాట్లాడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ)కి వెళ్లారని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు పెట్టిన సెక్షన్లలో తన క్లైంట్‌కు ఏదీ వర్తించదని, ఆయన ప్రభుత్వోద్యోగి కానే కాదని చెప్పారు. కేసు నమోదైన వెంటనే విదేశాలకు ఎందుకు వెళ్లారనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. "నా క్లైంట్ తరచూ ప్రయాణాలు చేస్తుంటారు. అంతే తప్ప.. ఈ కేసున్నందుకే విదేశాలకు వెళ్లలేదు" అని వివరణ ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలను వినిపిస్తూ.. రెడ్‌కార్నర్ నోటీసు విషయంలో సీబీఐ ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు విజ్ఞప్తి చేసిందన్నారు. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు అరెస్టుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే మొదటి చార్జ్‌షీట్ దాఖలు చేశామని, తదుపరి దర్యాప్తు కోసం దిగువ కోర్టు అనుమతి తీసుకున్నట్లు గుర్తుచేశారు. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు వస్తేగానీ, కేసు దర్యాప్తు ముందుకు సాగదని తెలిపారు. పిటిషనర్ శ్రవణ్‌రావు ఫోన్‌ట్యాపింగ్ కుట్రలో భాగస్వామిగా ఉన్నారని, ట్యాపింగ్‌లో కీలక పాత్ర పోషించారని.. నిందితులంతా కలిసి 62 హార్డ్‌డిస్క్‌లను ముక్కలు చేసి, నదిలో పారేశారని వివరించారు. న్యూస్ చానెల్ ఎండీగా ఉన్న శ్రవణ్‌రావు.. తరచూ ప్రభాకర్‌రావును కలిసి, ఎవరి ఫోన్ ట్యాపింగ్ చేయాలి? అనే అంశంపై, తదుపరి వ్యూహాలపై చర్చలు జరిపేవాడని తెలిపారు. ఈ మేరకు ఇతర నిందితులు వాంగ్మూలమిచ్చారని చెప్పారు. ప్రణీత్‌రావు తరచూ శ్రవణ్‌రావును కలుస్తూ.. టార్గెట్ ఏంటి? అని తెలుసుకునేవాడని వెల్లడించారు. కేసుతో సంబంధం లేకుంటే.. భారత్‌కు తిరిగి రావొచ్చుకదా? అని ప్రశ్నించారు. వాదోపవాదాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేసింది.

డాక్టర్ నిరుద్యోగి!

(మొదటిపేజీ తరువాయి)

బాధ అయితే వర్ణనాతీతం. కోట్లు పోసినా... కనీసం వారి ఖర్చుల మందం కూడా సంపాదించుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇంకా చెప్పాలంటే నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్ కూడా ఎంబీబీఎస్ వైద్యులకు లేకుండాపోతోందని సీనియర్ వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితికి కారణం రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ఇబ్బడిముబ్బడిగా సంఖ్య పెరుగుతుండటమే. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటులో కలపి 60 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో 8,715 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఇంకా కాలేజీల సంఖ్య పెరుగుతూనే ఉంది. కాలేజీల సంఖ్యను పెంచుతున్నారే తప్ప వాటిలో తగినంత మంది అధ్యాపకులు ఉండటం లేదు. ఫలితంగా మెడికోలకు నాణ్యమైన వైద్యవిద్య అందడం లేదు. మరో నాలుగేళ్ల తర్వాత రాష్ట్రంలో ఏటా



పదివేలమందివరకు ఎంబీబీఎస్ చదవి బయటకొస్తారు. వారిలో ఉపాధి దొరికేది కొద్దిమందికే. మిగతా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమే.

పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్ డాక్టర్లకు లేదు



ప్రస్తుతం ఎంబీబీఎస్ డాక్టర్లకు అసలు డిమాండ్ లేదు. నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఉన్న డిమాండ్‌కూడా డాక్టర్లకు లేదు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.10 వేలు కూడా ఇస్తున్నారు. ఇక డెంటల్ డాక్టర్లకు ఆ ఉద్యోగం కూడా దొరికే పరిస్థితి లేదు. నర్సుల కంటే తక్కువ వేతనంతో డాక్టర్లు పనిజేస్తున్నారు. భవిష్యత్తులో వైద్యవిద్య ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్‌లా మారే ప్రమాదం లేకపోలేదు. త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లో పనిజేసే ఆర్ఎంపీలను ఎంబీబీఎస్ వైద్యులు రీప్లేస్ చేసే పరిస్థితి కనిపిస్తోంది.

- డాక్టర్ భాగం కిషన్‌రావు,
అనస్థీషియా ప్రొఫెసర్, ఖమ్మం

క్యూబా పద్ధతి మేలు



మన రాష్ట్రంలో డాక్టర్ల డిమాండ్ కంటే సప్లయ్ ఎక్కువగా ఉంది. భవిష్యత్తులో ఇది తీవ్ర నిరుద్యోగ సమస్యకు దారి తీస్తుంది. పెరిగిన కాలేజీల నేపథ్యంలో మనం దీన్ని ఆపలేం. ఇటువంటి పరిస్థితుల్లో క్యూబా దేశ విధానాన్ని మనం కూడా పాటించాలి. అక్కడ తయారయ్యే వైద్యులను ప్రపంచంలో వైద్యుల కొరత ఉన్న దేశాలను గుర్తించి పంపుతున్నారు. మన ప్రభుత్వం కూడా అదే పద్ధతిని పాటించాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. ఒక డాక్టర్‌ను తయారు చేయాలంటే ప్రభుత్వానికి ఏటా లక్షల్లో ఖర్చవుతుంది. లక్షలు పోసి తయారు చేసిన వారిని నిరుద్యోగులుగా ఉంచాలి. ఇతర చదువులు చదివిన వారు ఏదైనా పని, ఉద్యోగం చేయగలరు. కానీ వైద్యం చదివిన వారు వైద్యం తప్ప ఇతర పనులకు కూడా పనికిరారు. ఇది విషాదకరంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మన దేశంలో లక్షన్నరకు పైగా నిరుద్యోగ డాక్టర్లు ఉన్నారు.

-డాక్టర్ బీఎన్ రావు,
మాజీ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

ట్రేడింగ్‌లో రూ.30 లక్షల నష్టం..

కుటుంబం ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

నిండు కుటుంబం శీతల పానీయంలో పురుగు మందు కలుపుకొని తాగి, ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కాసిపేట గ్రామంలో చోటుచేసుకుంది. తాండూరు పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల మొండయ్య(60), శ్రీదేవి(55) దంపతులకు కుమారుడు శివప్రసాద్(26), మానసిక రుగ్మతలను ఎదుర్కొంటున్న కుమార్తె శ్రీచైతన్య(22) ఉన్నారు. మొండయ్య కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా.. ఆయన కుమారుడు శివప్రసాద్ బెల్లంపల్లిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులతో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో సంపాదించాలనే ఆశతో శివప్రసాద్ కాసిపేట, బెల్లంపల్లిలో తెలిసిన వారి వద్ద రూ.10 లక్షలు అప్పుచేశారు. నూటికి రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీ ఇస్తుండడంతో.. అతనికి అప్పులిచ్చేందుకు పలువురు ముందుకొచ్చేవారు. మొదట్లో వచ్చే కొద్దిపాటి లాభంతో వడ్డీలు చెల్లించేవారు. నష్టాలు రావడంతో మరోమారు రూ.20 లక్షల మేర అప్పు చేశారు. షేర్‌మార్కెట్‌పై అవగాహన లేకుండా పెట్టుబడులు పెట్టడంతో.. అవికూడా ఆవిరై పోయాయి. వడ్డీ చెల్లించే పరిస్థితి లేక.. ఇల్లు వదిలి పారిపోయాడు. విజయవాడలో.. ప్రకాశం బ్యారేజీ నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించగా.. పోలీసులు అడ్డుకుని, స్వగ్రామానికి పంపారు. దీంతో.. అప్పులిచ్చిన వారు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు పెట్టి.. మొండయ్య, శ్రీదేవిపై ఒత్తిడి తీసుకువచ్చారు. తరచూ అప్పుల వాళ్లు ఇంటికి వస్తూ.. డబ్బుల కోసం ఒత్తిడి తీసుకొస్తుండడంతో.. కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించారు. దీంతో.. మంగళవారం



మొండయ్య



శ్రీదేవి



శివప్రసాద్



శ్రీచైతన్య

తెల్లవారుజామున శీతల పానీయంలో పురుగు మందు కలుపుకొని, సేవించారు. ఆ తర్వాత మొండయ్య తన బావమరిది కోలేటి రమేశ్‌కు ఫోన్‌చేసి, తామంతా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పారు. దాంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న రమేశ్.. అపస్మారక స్థితిలో పడిపోయిన మొండయ్య కుటుంబాన్ని అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో.. మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మొండయ్య మంగళవారం రాత్రి 10.30 సమయంలో కన్నుమూశారు. బుధవారం ఉదయం శ్రీదేవి, శ్రీచైతన్య.. సాయంత్రం శివప్రసాద్ మృతిచెందారు. రమేశ్ ఫిర్యాదు మేరకు తాండూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలో పది మంది..

షేర్ మార్కెట్, ఆన్‌లైన్ గేమ్స్ కారణంగా మంచిర్యాల జిల్లాలో ఏడాది కాలంలో పది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కాసిపేటలో మొండయ్య కుటుంబం మృతిచెందగా.. ఈ ఏడాది ఆగస్టులో జిల్లా కేంద్రంలో ఓ కుటుంబం హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంది. లోన్‌యాప్‌ల వేధింపులతో.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసే ఇప్ప వెంకటేశ్, తన భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్, విహాంత్‌కు విషమిచ్చి చంపేసి, తానూ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. జిల్లా కేంద్రంలోని హమాలివాడకు చెందిన ఓ యువతి కూడా లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నారు. లక్సెట్టిపేటలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టాల కారణంగా ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.